www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## గుండె గుభేలు

దేశంలో అత్యధిక మరణాలు ఇవే

మొత్తం మరణాల్లో 31 శాతం

తరువాతి స్థానాల్లో ఊపిరితిత్తుల అంటువ్యాధులు, క్యాన్సర్

భారత రిజిస్ట్రార్ జనరల్ తాజా సర్వే

2

## వయో వృద్ధ భారతం!

దేశంలో తగ్గుతున్న జననాలు..

పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

జనాభాలో 10% వయోధికులే..

త్వరలోనే జపాన్, చైనా సరసన భారత్

పింఛన్లు, ఆరోగ్య సంరక్షణకు అధిక ఖర్చు.. నిపుణుల ఆందోళన

శనివారం | 6-9-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 142 |

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి రా.1:41 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: ధనిష్ఠ రా.10:56 తదుపరి శతభిషం, వర్జ్యం: తె.5:45-7:16, దుర్ముహూర్తం: ఉ.6:05-7:43, అమృతఘడియలు: మ.12:50-2:23, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 6:05, సూర్యాస్తమయం:6:21

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


Pure Since 1925
B KRISHNAN GROUP
రాస్ లీలా
కలెక్షన్
దివ్యమైన ప్రేమకు ఒక
అద్భుతమైన నిర్వచనం.
రాధా మరియు కృష్ణుల యొక్క నృత్యం శాశ్వతమైనది, దీనిని మేము భక్తితో
మరియు ఇష్టంతో బంగారం, వజ్రాలు మరియు రత్నాలతో తయారుచేసి
మీకు అందిస్తున్నాము.
ఇది వారి కాలాతీత బంధం మరియు బృందావనమ్ యొక్క మంత్ర
ముగ్ధమైన రాత్రుల నుండి ప్రేరణ పొందినది, ప్రతి భాగం కూడా అభిరుచి,
క్లిష్టమైన హస్తకళ మరియు ఎప్పటికీ తరగని ప్రేమ అనురాగాలతో
హృదయాన్ని స్పందింపచేస్తుంది.
ఇది కేవలం ఆభరణాల కంటే కూడా ఎక్కువగా దైవాన్ని ధరించిన
భావాన్ని కలుగచేస్తుంది.
భీమ



## కూలీ నం.1

పత్తి తీతలో మెరుపు వేగం!

రోజుకు క్వింటాన్నర వరకు తీస్తూ శభాష్ అనిపించుకుంటున్న ప్రకాశ్‌రావు

2

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 6-9-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


విజయవాడ సిటీ**

రూ.8వేల కోట్ల విలువైన ప్రాజెక్టును.. టెండర్లు పిలవకుండా, పద్ధతులు పాటించకుండా అప్పగించవచ్చా?

ప్రైవేటు కాంట్రాక్టరు, వ్యాపారి... 'ప్రభుత్వ వాహనం'లో తిరుగుతూ ఎమ్మెల్యేలు, అధికారులపై పెత్తనం చేయొచ్చా?

మాస్కులు తయారు చేసే కంపెనీ ఎలాంటి అనుభవం లేకుండానే రాష్ట్రంలో సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేయగలదా?

మీరు నమ్మండి... నమ్మకపోండి! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'సూర్య ఘర్' ప్రాజెక్టులో ఈ చిత్రాలన్నీ జరుగుతున్నాయి. ఉన్నత స్థాయిలో కొందరు అధికారులు కుమ్మక్కు కావడంతో అడ్డగోలు వ్యవహారాలకు తెరలేచింది!



# 'సూర్య ఘర్'కు మాస్క్ మస్కా!

సూర్యుడినీ వదల్లేదు

## మాస్క్‌ల కంపెనీకి 8 వేల కోట్ల ప్రాజెక్టు

- ముఠా కట్టిన ఉన్నతస్థాయి అధికారులు, ఎమ్మెల్యే
- అస్మదీయ కంపెనీకి ఇన్‌స్టలేషన్ సర్వీస్ బాధ్యతలు
- టెండర్లు లేవు, ఎంపిక పద్ధతులూ తెలియవు
- నెడ్‌క్యాప్ ఎండీ నిర్ణయం.. మెప్మా ఎండీకి లేఖ
- సహకరించాలంటూ జిల్లా స్థాయి సిబ్బందికి హుకుం
- ప్రభుత్వ వాహనంలో 'ప్రైవేటు' ప్రతినిధి టూర్లు
- సహకారం కోసం ఎమ్మెల్యేలతో సమావేశాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అత్యాశ నిండిన అక్రమార్కులు 'ముఠా' కట్టారు! ఏకంగా 8 వేల కోట్ల ప్రాజెక్టుపై కన్నేశారు. అమరావతిలో కీలకస్థానంలో ఉన్న అధికారి, నెడ్‌క్యాప్‌లోని మరో ముఖ్య అధికారి కలిసి భారీ దోపిడీకి తెరలేపారు. మాస్క్‌లు తయారు చేసుకునే ఓ కంపెనీని తెరమీదకు తీసుకొచ్చి... దానికి సోలార్ ప్యానల్ ప్రాజెక్టుపై ప్రచారం, ఇన్‌స్టలేషన్ బాధ్యతలు అప్పగించారు. ఆ కంపెనీతో కలిసి పనిచేయాలంటూ... నెడ్‌క్యాప్, మెప్మా సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు. ఆ ప్రైవేటు కంపెనీ ప్రతినిధికి ఓ ప్రభుత్వ వాహనం ఇచ్చి జిల్లాలకు పంపిస్తున్నారు. అంతటితో ఆగకుండా... 'కంపెనీ మనోళ్లదే. సహకరించండి' అంటూ అధికారపార్టీ

మిగతా 14వ పేజీలో...

# ఏపీ అభివృద్ధికి.. పూర్తిగా సహకరిస్తాం

## లోకేశ్‌కు ప్రధాని హామీ

- 'యోగాంధ్ర' కాఫీ టేబుల్ బుక్‌ను మోదీకి అందించిన మంత్రి
- రాష్ట్రంలో పెట్టుబడులకు సహకరించండి
- ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు మద్దతివ్వండి
- ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలకు మార్గనిర్దేశం చేయండి.. మోదీకి వినతి
- జీఎస్టీ సంస్కరణలకు సంపూర్ణ మద్దతు



యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ప్రధాని మోదీకి అందజేస్తున్న లోకేశ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ శుక్రవారం ఢిల్లీలో ప్రధానితో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. యోగా దినోత్సవం సందర్భంగా జూన్‌లో రాష్ట్రంలో

మిగతా 13వ పేజీలో...




గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, వేదికపై మంత్రులు లోకేశ్, సత్యకుమార్, ఎంపీ చిన్ని, అధికారులు

# నిత్య విద్యార్థిని

## రోజూ కొత్త విషయాలు నేర్చుకుంటా

- మంత్రి లోకేశ్‌కు ఐటీ బాగా తెలుసు
- కానీ నాతో పోటీ పడి పని చేయలేడు
- మనవడు దేవాన్ష్ స్పీడ్ నేనందుకోలేను
- నా గురువు ఇప్పటికీ నాకు గుర్తే
- నేనూ టీచర్ కావాల్సినవాడినే
- దేశంలో రాష్ట్రం నం.1 కావాలి
- అందుకే నిరంతరం పనిచేస్తా
- బోధనలో టెక్నాలజీ, వైవిధ్యం పెరగాలి
- పిల్లలకు ఆస్తుల కంటే చదువే ముఖ్యం

ఉపాధ్యాయ దినోత్సవంలో చంద్రబాబు

సరదాగా నవ్వుతూ..నవ్విస్తూ టీచర్లతో మమేకం

"నా గురువు భక్తవత్సలం నాకు ఇప్పటికే గుర్తే. నా జీవితంలో స్ఫూర్తి నింపారు. నేను కూడా టీచర్ కావాల్సిన వాడినే. యూనివర్సిటీలో ఉన్నప్పుడు మా వీసీ నన్ను పిలిచి అర్థికశాస్త్ర అధ్యాపకుడివి కావాలని, తాను సిఫారసు చేస్తానని అన్నారు. కానీ... ఎమ్మెల్యేగా నేను పోటీ చేస్తున్నానని చెప్పాను. 'గెలుస్తావా' అని ఆయన అడిగారు. 'గెలిచి ఇక్కడికి వస్తా' అని తెలిపాను. అన్నట్టే ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిని అయ్యాను. ఆ తర్వాత సీఎంని కూడా అయ్యాను.

- చంద్రబాబు

13

## మధ్యవర్తిత్వం.. అనాది విధానమే!

- శ్రీకృష్ణుడు ఉత్తమ మధ్యవర్తి.. విశాఖలో అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు మేం సిద్ధం
- వర్చువల్ విచారణ, మొబైల్ అప్‌డేట్స్, ఈ-ఫైలింగ్ వాడాలి
- అంతర్జాతీయ సదస్సులో చంద్రబాబు సూచన

14

# పన్ను తగ్గింపు ఫలాలు ప్రజలకు అందుతాయి



- ఈనెల 22 తర్వాత మాకు చాలా పనుంది
- పకడ్బందీగా పర్యవేక్షణ కొనసాగుతుంది
- ప్రయోజనాలను ప్రజలకు చేరుస్తామని కంపెనీలు ప్రభుత్వానికి హామీ ఇచ్చాయి
- అలా చేయని వాటితో మాట్లాడి తేలుస్తాం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: జీఎస్టీ సంస్కరణలు, పన్ను రేట్ల తగ్గింపు ప్రయోజనాలు సాధారణ ప్రజలకు పూర్తిస్థాయిలో కచ్చితంగా అందుతాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇందుకోసం తగిన చర్యలు చేపడతామని చెప్పారు. సంస్కరణలు అమల్లోకి వచ్చే ఈ నెల 22వ తేదీ తర్వాత ప్రభుత్వానికి చాలా పని ఉందని, అదో పకడ్బందీ నిఘా కార్యక్రమమని తెలిపారు. జీఎస్టీ సంస్కరణల అమల్లో సహకరిస్తామని, ప్రయోజనాలను ప్రజలకు అందిస్తామని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలన్నీ హామీ ఇచ్చాయని.. ఒకవేళ ఏదైనా కంపెనీ భిన్నంగా వ్యవహరిస్తే వారితో మాట్లాడి తేలుస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఇండియా టుడే టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మలా సీతారామన్

మిగతా 2వ పేజీలో...

**కార్ల ధరల తగ్గింపు ప్రారంభం**

- తగ్గబోయే ధరలను ప్రకటించిన టాటా
- 65 వేల నుంచి 1.55 లక్షల వరకు మిగులు



జీఎస్టీ తగ్గినా.. రోగులకు ఊరట దక్కేనా?

ప్రైవేటు ఆస్పత్రులపై అనుమానాలు

2



# చిన్న ప్రాజెక్టు.. పెద్ద ఆనందం

- పాతికేళ్లకు నిండిన చెన్నరాయుడు తిప్ప
- భూగర్భ జలాలు పైపైకి.. రైతుల్లో హర్షం

ఇది చెన్నరాయుడుతిప్ప (చంద్రాయణతిప్ప) బ్యాలెన్సింగ్ రిజర్వాయర్! నిల్వ సామర్థ్యం రీత్యా చూస్తే... చాలా చిన్నది. కర్నూలు జిల్లా గూడూరు మండలం బూడిదపాడు గ్రామం దగ్గర ఉంటుంది. 1994లో కోట్ల విజయభాస్కరెడ్డి హయాంలో దీనిని నిర్మించారు. దీని కింద 101.34 ఎకరాల ఆయకట్టు ఉంది. 31ఏళ్లలో రెండు, మూడుసార్లు మాత్రమే దీనిని నింపారు. గత పాతికేళ్లుగా ఒక్క చుక్కనీరు కూడా ఈ ప్రాజెక్టుకు చేరలేదు. ఈ ఏడాది మంచి వర్షాలు కురవడం, తుంగభద్ర జలాశయానికి సామర్థ్యానికి మించి వరద చేరడంతో ఎల్లెల్సీ కాలువ ద్వారా చెన్నరాయుడుతిప్పను జలాలతో నింపారు. మళ్లీ ఇన్నేళ్లకు జలకళ చూస్తూ రైతులు మురిసిపోతున్నారు. దీనివల్ల భూగర్భ జలాలూ పెరుగుతాయని, హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్-1 ఎస్ఈ పాండురంగయ్య తెలిపారు.

- కర్నూలు, ఆంధ్రజ్యోతి



## హాప్ హాప్.. టిప్ టాప్!

14

రూ.250తో కులాసాగా విహారం

- విశాఖలో 'డబుల్ డెక్కర్' టూర్
- పది పర్యాటక ఆకర్షణల వీక్షణ

## రేపు సంపూర్ణ చంద్రగ్రహణం

14

- రాత్రి 8.58 నుంచి అర్ధరాత్రి 2.25 వరకు
- 2022 తర్వాత సుదీర్ఘంగా కనిపించే చాన్స్

## 18 నుంచి అసెంబ్లీ

13

# భారత్, రష్యాను చైనాకు కోల్పోయాం

## 'ట్రూత్ సోషల్'లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పోస్ట్

- మూడు దేశాలూ చిరకాలం వర్ధిల్లాలని వ్యంగ్య వ్యాఖ్య
- టెక్ లీడర్స్‌తో భేటీ.. పిచాయ్, సత్య నాదెళ్లపై ప్రశంసలు
- అమెరికాలో ఎంత పెట్టుబడులు పెడుతున్నారంటూ ప్రశ్న
- 7 యుద్ధాలు ఆపానంటూ మీడియా ముందు ప్రగల్భాలు



న్యూయార్క్/వాషింగ్టన్, సెప్టెంబరు 5: ఇటీవల జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ కలిసి మాట్లాడుకోవడంపై.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొద్దిగా ఆలస్యంగా అయినా తనదైన శైలిలో స్పందించారు! ఆ ముగ్గురు దేశాధినేతలూ కలిసి ఉన్న ఫొటోను తన సొంత సామాజిక మాధ్యమమైన

మిగతా 11వ పేజీలో...

## సైనిక సత్తాకు మెగా డిఫెన్స్ ప్లాన్

- అణుశక్తి యుద్ధనౌకలు, లేజర్ ఆయుధాలు
- సాయుధ దళాలకు హైపర్ సానిక్ క్షిపణులు
- 15 ఏళ్లకు రోడ్ మ్యాప్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్‌తో గట్టిగా బదులిచ్చిన భారత్.. ఇప్పుడు తన సైనిక శక్తిని మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, నెక్స్ట్ జనరేషన్ యుద్ధ ట్యాంకులు, హైపర్ సోనిక్ క్షిపణులు, లేజర్, ఏఐ ఆధారిత ఆయుధాలు,

మిగతా 2వ పేజీలో...



తురకపాలెం గ్రామస్థులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

## తురకపాలెంలో హెల్త్ ఎమర్జెన్సీ!

- ఎయిమ్స్ వైద్య నిపుణుల సాయం తీసుకోండి
- కొత్త కేసులు నమోదుకాకుండా చర్యలు
- తీవ్రత ఎక్కువ ఉన్నవారిని ఆస్పత్రుల్లో చేర్చాలి
- నేడు, రేపు ప్రత్యేక వైద్య బృందాలతో పరీక్షలు
- సోమవారానికి అందరి హెల్త్ ప్రొఫైల్
- ఆరోగ్య శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశం
- తురకపాలెం మరణాలపై అత్యవసర సమీక్ష
- ఉన్నత స్థాయి విచారణకు కమిటీ: మంత్రి సత్య
- కలుషిత నీరు కారణం కాదన్న పెమ్మసాని

3

# లిక్కర్ స్కామ్‌లో వైఎస్ అనిల్ రెడ్డి పీఏ?

- దేవరాజన్‌ను ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు
- నిందితుడు బాలాజీదీ, ఈయనదీ కుప్పమే..
- రాజ్ కసిరెడ్డి ఇచ్చిన సొమ్ము అంతిమ లబ్ధిదారుకు?
- రాజ్ మనిషి చాణక్యతో రోజూ ఫోన్ సంభాషణ
- ధనుంజయ్, కృష్ణమోహన్, చెవిరెడ్డితో భేటీలు
- జగన్ ఆర్థిక వ్యవహారాలు చూసే అనిల్‌రెడ్డిపై కీలక సమాచారం ఇచ్చిన దేవరాజన్!
- ఆధారాలు లభించాక అనిల్‌ను విచారించే వీలు

12

లిక్కర్ స్కామ్‌లో మరో కీలక లింక్‌ను సిట్ సంపాదించింది. జగన్ ఆర్థిక వ్యవహారాలు చూసే వైఎస్ అనిల్‌రెడ్డి పీఏను రెండురోజులుగా అధికారులు విచారిస్తున్నారు. ఈ క్రమంలో అనిల్‌రెడ్డికి సంబంధించిన కొత్త సమాచా రం సిట్‌కు దొరికినట్టు తెలిసింది.

## కి'లేడీ' అరాచకాలెన్నెన్నో!

- పోలీసు విచారణలో ఒక్కొక్కటి వెలుగులోకి
- కోవూరులోని ఓ ఇంటికెళ్లి దొమ్మీ చేసిన వ్యవహారం తాజాగా వెల్లడి
- అరుణ నేరాల చిట్టా విప్పిన అనుచరులు!
- రెండ్రోజుల క్రితం 'ఆయుధాల చట్టం' కింద కేసు
- రెండు హత్యల్లోనూ ఆమె పాత్రపై అనుమానాలు
- నేరాలపై సిట్ తరహాలో పూర్తిస్థాయి విచారణ!



12

# గుండె గుభేల్..!

» దేశంలో అత్యధిక మరణాలు ఇవే.. మొత్తం మరణాల్లో 31%

» తర్వాతి స్థానాల్లో ఊపిరితిత్తుల అంటువ్యాధులు, క్యాన్సర్

» భారత రిజిస్ట్రార్ జనరల్ తాజా సర్వే నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: దేశంలో ఇప్పటికీ గుండె, రక్తనాళాల సంబంధిత వ్యాధులతో మరణిస్తున్న వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. మొత్తం మరణాల్లో 31 శాతం ఇవే ఉన్నాయి. భారత రిజిస్ట్రార్ జనరల్ ఆధ్వర్యంలో తాజా నమూనా నమోదు సర్వే నివేదిక దీన్ని స్పష్టంచేసింది. 2021-2023 సంవత్సరాల మధ్య మరణ కారణాలపై నివేదిక బుధవారం విడుదలైంది. దీని ప్రకారం దేశంలో అంటువ్యాధులు కాని వ్యాధుల వల్ల సంభవిస్తున్న మరణాల శాతం 56.7గా ఉంది. అంటువ్యాధులు, గర్భిణి సంబంధిత వ్యాధులు, నవజాత శిశువులకు కలిగే ఇబ్బందులు, పౌష్టికాహార లోపం వల్ల సంభవించే మరణాల శాతం 23.4గా ఉంది. 2020-2022 సంవత్సరాలలో కొవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన సమయంలో పైన పేర్కొన్న వరుసలో ఈ శాతాల సంఖ్య 55.7, 24.0గా ఉంది. గుండె, రక్తనాళాల సంబంధిత(కార్డియోవాస్కులర్) మరణాల తర్వాత ఊపిరితిత్తుల అంటువ్యాధుల మరణాలు 9.3%తో 2వ స్థానంలో ఉండగా...తర్వాతి స్థానాల్లో 6.4%తో క్యాన్సర్ మరణాలు, 5.7%తో ఊపిరితిత్తుల వ్యాధులున్నాయి. 30ఏళ్లు దాటిన వారిలో జీవనశైలి ప్రధానంగా కార్డియోవాస్కులర్ జబ్బులకు కారణంగా కనిపిస్తోంది. 15-29 మధ్య వయస్సు వారిలో కావాలని తగిలించుకొనే దెబ్బలు, ఆత్మహత్యలు మరణాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. 5.3% మరణాలు జీర్ణకోశ వ్యాధులతో, 4.9% మరణాలు జ్వరాల వల్ల, 3.5% మరణాలు మధుమేహ వ్యాధితో సంభవిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. గాయాలతో మరణాల శాతం 9.4గా, అనారోగ్య కారణాలతో (సాధారణంగా ఇది 70, అంతకుపైబడిన వయస్సు వారై ఉన్నారు) కారణాలతో మరణాల శాతం 10.5గా ఉంది. ఈ నివేదికను విశ్లేషించే క్రమంలో మరణకారణాల విభజనలో పొరపాట్లు ఉండే అవకాశం లేకపోలేదన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని నివేదిక హెచ్చరించింది.

## నవజాత శిశువు బరువు 5.2 కిలోలు

» మధ్యప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో బాలభీముడు

» ఈస్థాయి బరువుతో జననం అరుదు అంటున్న వైద్యులు



జబల్‌పూర్, సెప్టెంబరు 5: అప్పుడే పుట్టిన శిశువు ఎంత బరువు ఉంటాడు? రెండున్నర.. మహా అయితే మూడున్నర కిలోలు! మధ్యప్రదేశ్ జబల్‌పూర్ జిల్లాలోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం బాల భీముడిని తలపించేలా పుట్టిన మగ శిశువును చూసి వైద్యులే ఆశ్చర్యపోయారు. తూస్తే ఆ బిడ్డ 5.2 కిలోలున్నాడు. తల్లి శుభాంగి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. ఇంత బరువుతో బిడ్డ పుట్టడం అరుదైన విషయమని సిజేరియన్ చేసిన గైనకాలజిస్టు డాక్టర్ భావనా మిశ్రా చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డల్లో మగ శిశువులైతే సగటున 2.8-3.2 కిలోలు, ఆడ శిశువులైతే 2.7-3.1 కిలోల వరకు బరువు ఉంటారని ఆమె పేర్కొన్నారు. ఈస్థాయి బరువుతో పుట్టిన బిడ్డను తాను చూడలేదన్నారు.

## లోకం తీరు




## సైనిక శక్తి బలోపేతానికి మెగా డిఫెన్స్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

స్టెల్త్ బాంబర్ డ్రోన్‌లు వంటి అత్యాధునిక ఆయుధాలను సైనిక దళాలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రచించింది. వచ్చే 15 ఏళ్లలో ఈ లక్ష్యాన్ని పూర్తిచేసేలా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్ చేపట్టిన అతిపెద్ద డిఫెన్స్ అప్‌గ్రేడ్ ప్లాన్ ఇదే కావడం విశేషం. ఈ రోడ్‌మ్యాప్ ప్రకారం పాత టీ-72 యుద్ధ ట్యాంకులను 1,800 ఫ్యూచర్ ట్యాంకులతో భర్తీ చేయనున్నారు. వీటితో పాటు మరో 400 తేలికపాటి యుద్ధ ట్యాంకులను కూడా సైన్యానికి అందిస్తారు. యుద్ధట్యాంకులపై నుంచి ప్రయోగించే 50,000 యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్, 700 రోబోటిక్ కౌంటర్ ఐఈడీ వ్యవస్థలను అందించనుంది. వీటితోపాటు 6 లక్షల శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలను కూడా సైన్యానికి అందించనున్నారు.

### నేవీ కోసం తర్వాతి తరం యుద్ధ నౌకలు

నౌకాదళం కోసం సరికొత్త విమానవాహక యుద్ధ నౌక, పది తర్వాతి తరం యుద్ధ నౌకలు, ఏడు అధునాతన కార్వెట్‌లు, నాలుగు ల్యాండింగ్ డాక్ ప్లాట్‌ఫారమ్‌లు సమకూర్చనున్నారు. వీటితోపాటు అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, ఎలక్ట్రో మాగ్నెట్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్ కూడా అందించనున్నారు. ఇక భారత వైమానిక దళం కోసం 75 హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్స్, 150 స్టెల్త్ బాంబర్ డ్రోన్లు, రిమోట్ సాయంతో పనిచేసే 100 విమానాలు, గైడెడ్ ఆయుధాలను అందిస్తారు. ఇవి కాకుండా యాంటీ స్వార్మ్ డ్రోన్ వ్యవస్థలు, లేజర్ ఆయుధాలు, ఏఐతో పనిచేసే ఆయుధాలు, మానవరహిత విమానాల కోసం గగనతలం నుంచి భూమిపై ఉన్న లక్ష్యాలపైకి ప్రయోగించే క్షిపణు, అత్యాధునిక టార్గెటింగ్ ప్యాడ్స్ కూడా సమకూర్చనున్నారు.

## ఖరీదైన వాహనాలతో కాన్వాయ్..
## బాడీగార్డులకు పోలీసు డ్రెస్

» యూపీలో నకిలీ ఐఏఎస్ హల్‌చల్



లఖ్‌నవూ, సెప్టెంబరు 5: యువ ఐఏఎస్ ముసుగులో దందాలు చేసిన ఫేక్ అధికారి సౌరభ్ త్రిపాఠిని ఉత్తరప్రదేశ్ పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వస్థాయిలో జరిగే అతి ముఖ్యమైన భేటీల నుంచి ఉన్నతాధికారులు ఇచ్చే పార్టీలవరకు.. అన్నింటికీ రాచబాటలో త్రిపాఠి హాజరయిన వైనం దర్యాప్తు అధికారులనే నివ్వెరపరుస్తోంది. వ్యవస్థలోని లొసుగులను వాడుకుని హైసెక్యూరిటీ జోన్లను సైతం ఛేదించుకుని ప్రభుత్వాన్ని, పోలీసులను, వ్యాపారులను ఓ 36 ఏళ్ల వ్యక్తి కొన్నేళ్లపాటు బురిడీ కొట్టించిన తీరు ఐఏఎస్ వర్గాలను దిగ్ర్భమకు గురిచేసింది. పోలీసు వర్గాల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ కేబినెట్ స్పెషల్ అధికారి ఐడీతో త్రిపాఠి చలామణి అయ్యాడు. యూపీ దాటి బయటకు వెళితే కేంద్ర ప్రభుత్వ అధికారిని అని చెప్పుకొనేవాడు. ఆరేడు వాహనాలతో కాన్వాయ్ ఏర్పాటు చేసుకునేవాడు. ప్రైవేటు బాడీగార్డులను పోషించేవాడు. వారిలో ఒకరికి పోలీస్ యూనిఫాం వేసి.. వారందరితోకలిసి ప్రభుత్వ కార్యక్రమాల కోసం వెళ్లినప్పుడు.. సెక్యూరిటీ సిబ్బంది ఆటోమెటిక్‌గా పక్కకు తప్పుకొని దారి ఇచ్చేవారు. అత్యంత సంపన్నులు, పారిశ్రామికవేత్తలు ఉండే విలాసవంతమైన భవనాల్లో నివసించేవాడు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల కోసం రేంజ్ రోవర్ వాడితే, దందాల కోసం మెర్సిడెస్ బెంజ్ సీ 220 లేక డిఫెండర్‌ను బయటకుతీసేవాడు. లఖ్‌నవూలో ఇటీవల వాహనాల తనిఖీ సందర్భంగా త్రిపాఠి అసలు రంగు బయటపడింది. కాన్వాయ్‌ల నుంచి బాడీగార్డులు, ఐడీ కార్డుల వరకు.. అంతా ఫేకేనని గుర్తించి, ఆయనను అరెస్టు చేసి, జైలుకు పంపించారు. సౌరభ్ ఐఏఎస్ కాదని తెలిసి మిత్రులు కూడా షాక్ అయ్యారు.

### కార్ల ధరలు తగ్గింపు షురూ!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించేందుకు ఆటోమొబైల్ కంపెనీలు సిద్ధమయ్యాయి. ముందుగా ధరల తగ్గింపునకు టాటా మోటార్స్ శ్రీకారం చుట్టింది. తమ కార్ల ధరలు మోడల్‌ను బట్టి రూ.65,000 నుంచి రూ.1.55 లక్షల వరకు తగ్గుతాయని ప్రకటించింది. జీఎస్టీ పన్ను ప్రయోజనాన్ని పూర్తిగా కొనుగోలుదారులకు బదిలీ చేయాలనే ప్రభుత్వ ఉద్దేశానికి తాము కట్టుబడి ఉన్నట్టు టాటా మోటార్స్ (పాసింజర్ వెహికల్స్) ఎండీ శైలేశ్ చంద్ర తెలిపారు. కర్వ్ మోడల్‌పై రూ.65 వేల వరకు, టియాగోపై రూ.75 వేలు, టిగోర్‌పై రూ.80 వేలు, పంచ్‌పై రూ.85 వేలు, ఆల్ట్రోజ్‌పై రూ.1.10 లక్షలు, హారియర్‌పై రూ.1.40 లక్షలు, సఫారీపై రూ.1.45 లక్షలు, నెక్సాన్‌పై రూ.1.55 లక్షల వరకు ధరల తగ్గింపు ఉంటుందని వెల్లడించారు. మరోవైపు టాటా మోటార్స్ బాటలోనే మిగతా కార్ల కంపెనీలు, ద్విచక్ర వాహనాల కంపెనీలు కూడా ధరల తగ్గింపును ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. దీంతో పండుగకు కొత్త కారు, ద్విచక్రవాహనం కొనాలని భావిస్తున్నవారికి.. ధరలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

### పత్తి తీతలో ప్రకాశ్‌రావు కూలీ నం.1

పిడుగురాళ్ల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జూలకల్లుకు చెందిన ఇనుముక్కల ప్రకాశ్‌రావు (43) ఒక వ్యవసాయ కూలీ. పత్తి తీతలో చుట్టుపక్కల గ్రామాల్లో ఆయన్ను మించినవారు లేరనడంలో అతిశయోక్తి లేదు! ప్రస్తుత పనుల్లో ఇతర కూలీలు రోజుకు 60-70 కేజీల వరకు పత్తిని తీస్తుంటే.. ప్రకాశ్‌రావు మాత్రం 150 కేజీల వరకు తీస్తూ శభాష్ అనిపించుకున్నారు. కేజీకి రూ.12 చొప్పున రోజుకు కూలి రూ.1,500 నుంచి రూ.1,800 సంపాదిస్తున్నారు. కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు కొనసాగించలేకపోయానని, ఆ కష్టం తన బిడ్డలు పడకూడదనే ఉద్దేశంతో.. కూలీ పనుల్లో ఎక్కువ కష్టపడుతున్నానని చెబుతున్నారు. తనకు ముగ్గురు కుమార్తెలని, పెద్దమ్మాయి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుండగా.. రెండో అమ్మాయి ఇంటర్ రెండో సంవత్సరం, మూడో అమ్మాయి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోందని తెలిపారు.

### జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి అక్టోబరు 1 వరకు గుంటూరులోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జరగబోయే 62వ జాతీయ చదరంగం చాంపియన్ షిప్-2025 లోగోని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ ఆవిష్కరించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, విశ్రాంత న్యాయమూర్తి డీవీ వీఎస్ సోమయాజులు, డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య డాక్టర్ డి.సూర్యప్రకాశరావు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్, సెక్రటరీ కె.జగదీష్, ముఖ్య సలహాదారు కేవీవీ శర్మ పాల్గొన్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన గ్రాండ్, ఇంటర్నేషనల్ మాస్టర్స్ పోటీపడనున్నారు. మహిళల గ్రాండ్ మాస్టర్లు, ఇంటర్నేషనల్ మాస్టర్లు పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించనుండటంతో ఇదొక హై ప్రొఫైల్ టోర్నమెంట్‌గా మారనుంది.

# నీకెంత ధైర్యం?

## నన్నే వీడియో కాల్ చేయమంటావా?

» మహిళా ఐపీఎస్‌తో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం వాగ్వాదం

» ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు ఆపేయాలని ఆదేశం



ముంబై, సెప్టెంబరు 5: ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకున్న ఐపీఎస్ అధికారిణితో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వాగ్వాదానికి దిగారు. వీరిద్దరి మధ్య సాగిన సంభాషణకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. రోడ్డు నిర్మాణం కోసం సోలాపూర్ జిల్లా కుర్దు గ్రామంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో సబ్ డివిజనల్ పోలీసు అధికారిణి అంజనా కృష్ణ ఆగస్టు 31న పోలీసు బలగాలు, రెవెన్యూ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. తవ్వకాలు సాగిస్తున్న వారిని అధికారులు అడ్డుకున్నారు. దీంతో స్థానిక ఎన్సీపీ కార్యకర్త ఒకరు నేరుగా అజిత్ పవార్‌కు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. తర్వాత ఆ ఫోన్‌ను అంజనా చేతికి అందించారు. తాను డిప్యూటీ సీఎంను మాట్లాడుతున్నానని, వెంటనే అక్కడి చర్యలను ఆపేయాలని ఆదేశించారు. దీనికి ఆమె స్పందిస్తూ... "ఫోన్‌లో మాట్లాడుతున్నదెవరో నాకెలా తెలుస్తుంది? నా నంబరుకు వీడియో కాల్ చేయగలరా?" అని కోరారు. దీంతో పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీకు అంత ధైర్యం ఉందా? మీపై చర్యలు తీసుకుంటా... నన్నే వీడియో కాల్ చేయమంటారా? నన్ను చూడాలనుకుంటున్నారా... మీ నంబరు ఇవ్వండి లేకపోతే నా నంబరుకు వాట్సాప్ కాల్ చేయండి... నీకెంత ధైర్యం" అంటూ కేకలు వేశారు. అనంతరం పవార్‌కు వీడియో కాల్ చేసిన అధికారిణి... ఆయన గొంతును గుర్తించలేకపోయినట్లు వివరణ ఇచ్చారు. అక్కడ తీసుకుంటున్న చర్యలను వెంటనే ఆపేయాలని పవార్ ఆమెను ఆదేశించారు. ఈ వీడియో వైరల్ కావడంతో పాటు పవార్ తీరుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్సీపీ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఆ వీడియోను ఉద్దేశపూర్వకంగా లీక్ చేశారని ఎన్సీపీ ఎంపీ సునీల్ తట్కరే ఆరోపించారు. కార్యకర్తలను శాంతింపజేయడానికే అధికారిణిని పవార్ మందలించి ఉండొచ్చని, ఆమె విధులను అడ్డుకోవాలనేది ఆయన ఉద్దేశం కాదని చెప్పుకొచ్చారు. కాగా, కేరళకు చెందిన అంజనా కృష్ణ 2022-23 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి. సోలాపూర్ జిల్లా కర్మాలా డీఎస్పీగా ఇటీవలే నియమితులయ్యారు. నిజాయితీ, అంకితభావానికి మారుపేరుగా గుర్తింపు పొందిన ఆమె సివిల్స్ పరీక్షల్లో 355వ ర్యాంకు సాధించారు. ఆమె తండ్రి తిరువనంతపురంలో వ్యాపారం నిర్వహిస్తున్నారు.

### జోక్యం చేసుకొనే ఉద్దేశం లేదు: పవార్

చట్టపరమైన అంశాల్లో జోక్యం చేసుకొనే ఉద్దేశం తనకు లేదని, అక్కడ నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడంతో పాటు, అవి మరింత తీవ్రతరం కాకూడదనే ఆమెకు ఫోన్ చేశానని అజిత్ పవార్ శుక్రవారం వివరణ ఇచ్చారు. పోలీసు విభాగంపైనా, మహిళా అధికారులపైనా తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. పారదర్శక పాలనకు కట్టుబడి ఉన్నామని, ఇసుక తవ్వకాలతో సహా చట్ట విరుద్ధమైన అన్ని కార్యకలాపాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పవార్ స్పష్టం చేశారు. కాగా, ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన అంజనా కృష్ణతో పాటు రెవెన్యూ అధికారులను విధులు నిర్వర్తించకుండా నిరోధించారనే ఆరోపణలపై పోలీసులు ఎన్సీపీ కార్యకర్తలు సహా పలువురిపై కేసు నమోదు చేశారు.

### పవార్‌కు ప్రభుత్వంలో కొనసాగే హక్కు లేదు: రౌత్

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దొంగలను కాపాడుతున్నారని శివసేన(యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపించారు. ఆయనకు ప్రభుత్వంలో కొనసాగే హక్కు లేదన్నారు. "చట్ట విరుద్ధ కార్యకలాపాలకు మద్దతివ్వమని ఒక ఐపీఎస్ అధికారిని అడుగుతున్న పవార్... ఇతరులకు మాత్రం చట్టాన్ని పాటించాలని ఉపదేశాలిస్తుంటారు. తన పార్టీ దొంగలకు రక్షణ కల్పించమని ఆమెను తిడుతున్నారు. ఇదేనా మీ క్రమశిక్షణ..? ఇసుకను అక్రమంగా తవ్వడమంటే ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడమే. మీరు మొత్తం రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. మంత్రులు సిగ్గుపడాలి. గతంలో ఇలాంటి ఘటనల కారణంగా చాలామంది నాయకులు నైతిక కారణాలతో రాజీనామా చేయాల్సి వచ్చింది" అని రౌత్ గుర్తుచేశారు.

## కేరళ యూట్యూబర్ మునాఫ్‌కు సిట్ నోటీసు

ధర్మస్థల వివాదంపై ముగ్గురిని విచారించిన సిట్ చీఫ్



బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు కేరళకు చెందిన యూట్యూబర్ మునాఫ్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ ఏడాది జూలై 11న ధర్మస్థల అటవీ ప్రాంతం నుంచి ఓ పుర్రెను తీసుకొస్తున్న వీడియోను మునాఫ్ తన యూట్యూబ్ చానెల్‌లో పోస్టు చేశారు. ఈ వీడియోలో మాజీ పారిశుధ్య కార్మికుడు చన్నయ్య ఓ కత్తితో పుర్రెను ఎత్తుకొస్తున్న దృశ్యాలు ఉన్నాయి. కాగా, ఇదంతా కల్పితమని, అటవీ ప్రాంతంలో పుర్రె లభించలేదని చన్నయ్య సిట్ ఎదుట తెలిపారు. జయంత్, గిరీశ్ ఇచ్చిన పుర్రెను కత్తితో తీసుకొచ్చానని వివరించారు. దీంతో కుట్రలో మునాఫ్ పాత్ర గురించి తెలుసుకునేందుకు విచారణకు రావాలని సిట్ నోటీసులు జారీ చేసింది. ధర్మస్థల వివాదానికి సూత్రధారులుగా భావిస్తున్న జయంత్, గిరీశ్ మట్టణ్ణవర్, అభిషేక్‌ను సిట్ శుక్రవారం విచారించింది. వారిని సిట్ కార్యాలయానికి పిలిపించి, వేర్వేరుగా సుదీర్ఘ సమయంపాటు విచారించారు. మరోవైపు మండ్యకు చెందిన 'గోల్డెన్ కన్నడిగ' యూట్యూబర్ సుమంత్ బాంబు పేల్చారు. ధర్మస్థల వివాదంపై యూట్యూబ్‌లో పోస్టు పెట్టాలని 'యునైటెడ్ మీడియా' యూట్యూబర్ అభిషేక్ తనకు సూచించారని సుమంత్ తెలిపారు. పోస్టు పెడితే ఫండింగ్ సాధ్యమవుతుందని అభిషేక్ చెప్పారని అన్నారు. ఫండింగ్ చేసేవారు ఎవరని అడిగానని, మహేశ్ తిమరోడి, గిరీశ్ మట్టణ్ణవర్ తమ బాస్‌లని, అంతా వారే చూసుకుంటారని ఆయన తెలిపారని అన్నారు.

# వయో వృద్ధ భారతం!

## దేశంలో తగ్గుతున్న జననాలు.. పెరుగుతున్న వృద్ధుల జనాభా

» జనాభాలో 10 శాతం వయోధికులే

» జనాభా సంక్షోభంతో నిపుణుల ఆందోళన



న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: మన దేశ జనాభాలో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ప్రతి పది మందిలో ఒకరు 60 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. నమూనా నమోదు సిస్టం (ఎస్ఆర్ఎస్)- 2023 నివేదిక ఇటీవల ఆ గణాంకాలను వెల్లడించింది. పడిపోతున్న జననాల రేటు, పెరుగుతున్న ఆయుర్దాయంతో వయో వృద్ధ భారతంగా దేశం మారుతోందని నిపుణులు చెబుతున్నారు. వయోధికుల ఆరోగ్య సంరక్షణ, పింఛన్లు, సామాజిక భద్రత విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివేదిక ప్రకారం దేశ జనాభాలో ప్రస్తుతం 60 ఏళ్లు పైబడ్డ వృద్ధులు 9.7 శాతంగా ఉన్నారు. 2011లో అది 8.6గా మాత్రమే ఉంది. 65 ఏళ్లు పైబడ్డ వారిలో పెరుగుదల 6.4 శాతంగా నమోదైంది. 60 ఏళ్లు పైబడిన వయోధికుల జనాభాలో కేరళ 15 శాతంతో అన్ని రాష్ట్రాల కంటే ముందు ఉంది. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు, హిమాచల్, పంజాబ్, మహారాష్ట్ర వృద్ధుల జనాభా జాతీయ సగటు 9.7% కంటే ఎక్కువ ఉంది. ఇక బిహార్, మధ్యప్రదేశ్, యూపీ, జార్ఖండ్ రాష్ట్రాల్లో వయోధికుల జనాభా 8% లోపే ఉంది. అంటే ఈ రాష్ట్రాల్లో జనాభా వృద్ధి బాగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాల్లో జనాభా తగ్గుముఖం పట్టింది.

### పెరుగుదలకు కారణాలు, సవాళ్లు

● వృద్ధుల జనాభా పెరుగుదలకు రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, మొత్తం పునరుత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) జనాభా భర్తీ స్థాయి 2.1 కంటే తగ్గిపోవడం, రెండు.. ఆయర్దాయం పురుషులకు 68.5 ఏళ్లకు, మహిళలకు 72.5 ఏళ్లకు పెరగడం. టీఎఫ్ఆర్ తగ్గడం వల్ల జనాభాలో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ఆయుర్దాయం పెరగడం వల్ల వృద్ధుల జనాభా పెరుగుతూపోతోంది.

● దేశంలో తక్కువ మంది ప్రజలు మాత్రమే శ్రామిక శక్తిగా ఉంటారు. యువత ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు ఆర్థిక ప్రగతి సాధిస్తాయి. వృద్ధ జనాభా ఎక్కువ ఉన్న రాష్ట్రాల్లో శ్రామిక శక్తి తక్కువగా ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి.

● సంప్రదాయ ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. వృద్ధులు ఒంటరిగా మిగిలిపోయి ప్రభుత్వం పైనో, సేవా సంస్థలపైనో ఆధారపడాల్సి వస్తోంది.

### భవిష్యత్ కోసం చర్యలు తీసుకోవాలి

ఇప్పటికీ దేశంలో యువ జనాభా ఎక్కువగానే ఉన్నా.. వృద్ధ జనాభాలో పెరుగుదల, పిల్లల జనాభా తగ్గదల ఓ హెచ్చరికగా నిపుణులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వృద్ధుల జనాభా అధికంగా ఉన్న చైనా, జపాన్, యూరప్ దేశాల సరసన భారత్ కూడా చేరడానికి ఎంతో సమయం పట్టదంటున్నారు. వృద్ధులకు సదుపాయాలు కల్పిస్తూనే, యువ జనాభా పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

## అమెరికాలో జనాభా తగ్గుముఖం!

వలసలు, జననాల రేటు తగ్గడమే కారణం

వాషింగ్టన్, సెప్టెంబరు 5: అమెరికాకు వలస వచ్చే వారి సంఖ్య తగ్గిపోవడం, జననాల రేటు తక్కువగా ఉండడంతో తొలిసారిగా 2025లో ఆ దేశ జనాభా తగ్గనున్నట్లు అమెరికన్ ఎంటర్‌ప్రైజ్ ఇన్‌స్టిట్యూట్(ఏఈఐ) అంచనా వేస్తోంది. ఈ సంవత్సరం ఆ దేశానికి వలస వచ్చే వారి సంఖ్య 5,25,000కన్నా తక్కువగా ఉండవచ్చని ఏఈఐ తెలిపింది. దీనికితోడు గత ఏడాది జనాభా లెక్కల ప్రకారం 5,19,000 జననాలు మాత్రమే నమోదయ్యాయి. ఫలితంగా అమెరికా జనాభా సంఖ్యలో 6000 మంది తగ్గిపోతారని అంచనా. 250 ఏళ్ల అమెరికా చరిత్రలో ఇటువంటి పరిస్థితి ఇదే తొలిసారి. అమెరికన్ సివిల్ వార్‌లో 7,00,000 మంది మరణించినప్పుడు గానీ, 'కోవిడ్-19 పెండెమిక్' సమయంలో గానీ అమెరికన్ జనాభా తగ్గుముఖం పట్టకుండా ఏటా పెరుగుతూనే వచ్చింది. కాగా, అమెరికాలో రాబోయే 30 ఏళ్ల వరకు జననాల రేటు 1.6గానే ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫ్యామిలీ స్టడీస్(ఐఎఫ్ఎస్) సంస్థ సర్వే తెలియజేస్తోంది. ఇది జనాభా సంఖ్య నిలకడగా కొనసాగడానికి ప్రతి మహిళకు ఉండాల్సిన పిల్లల సంఖ్య 2.1కన్నా తక్కువ. ట్రంప్ రెండోసారి పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత దాదాపు 20 లక్షల మంది వలసదారులు అమెరికాను వీడి వెళ్లిపోయారు.

## రైలులో పాప.. ఆస్పత్రిలో బాబు!

» ప్రయాణంలోనే కవలలకు జన్మనిచ్చిన తల్లి

» తొలుత రైల్వే డాక్టర్ చొరవతో ప్రసవం.. ఆస్పత్రికి తరలింపు



బిడ్డతో రైల్వే సిబ్బంది

ఆముదాలవలస, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణంలో ఉన్న ఓ తల్లి.. ఒక బిడ్డను రైలులో, మరో బిడ్డను ఆస్పత్రిలో ప్రసవించింది. ఇచ్ఛాపురం స్టేషన్లో జి.భాలక్ష్మి అనే గర్భిణి.. భర్త జానకిరాంతో కలిసి విశాఖ వెళ్లేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్ బీ-2లో ఎక్కారు. మార్గమధ్యంలో ఆమెకు నొప్పులు రావడంతో ఆముదాలవలస రైల్వేస్టేషన్‌లోని ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. రైలును స్టేషన్‌లో నిలపగా, రైల్వే డాక్టర్ కీర్తి వచ్చి గర్భిణి రైలులో ఉండగానే, ఆమె గర్భంలో ఇద్దరు బిడ్డలు ఉన్నట్లు నిర్ధారించి ప్రసవం చేశారు. ఒక శిశువు (ఆడబిడ్డ) జన్మించగా, మరో శిశువు ప్రసవం కష్టం కావడంతో రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను ఐసీయూలో ఉంచినట్లు సమాచారం అందిందని ఆర్పీఎఫ్ ఎస్ఐ అరుణ తెలిపారు.

## చోరీ చేసి.. అమ్మవారికి సారీ...!

» 45 రోజుల తర్వాత హుండీ సొమ్మును గుడిలో పెట్టేసిన దొంగలు



పోలీసుల సమక్షంలో సొమ్ము లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో హుండీ చోరీలు జరగడం చూస్తుంటాం. కానీ చోరీ చేసిన సొత్తును తిరిగి ఆలయంలోనే వదిలిపెట్టిన సంఘటనలు ఎక్కడా చూసి ఉండం! కానీ.. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలోని ముసలమ్మ కట్ట ఆలయంలో జూలై 21న చోరీ చేసిన హుండీ సొమ్మును దొంగలు తిరిగి 45 రోజుల తర్వాత అక్కడే వదేసి వెళ్లారు. డబ్బు మూటతోపాటు అమ్మవారిని క్షమాపణ కోరుతూ ఓ లేఖను రాసిపెట్టారు. పూజారి రామయ్య శుక్రవారం తెల్లవారు జామున ఆలయం తెరిచాక డబ్బుమూటను గుర్తించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డికి సమాచారమిచ్చారు. ఆయన పోలీసులను పిలిపించి, వారి సమక్షంలో సొమ్ము లెక్కించారు. ఆ మూటలో రూ.1,86,400 ఉన్నట్లు గుర్తించారు. లేఖలో.. 'క్షమించు తల్లీ.. నలుగురం కలిసి దొంగతనం చేశాం. అప్పటి నుంచి నా కొడుకు ఆరోగ్యం బాగాలేదు. పరిస్థితి విషమంగా ఉంది. దొంగతనం చేసిన సొమ్ములో కొంత ఆస్పత్రి ఖర్చుల కోసం వాడుకున్నాం..' అని వచ్చీరాని తెలుగులో రాసిన ఓ లేఖను ఆ మూటలో ఉంచారు. సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా వారిని గుర్తించే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారు.

## జీఎస్టీ తగ్గింపు లబ్ధి కచ్చితంగా ప్రజలకు అందాల్సిందే!

» కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: జీఎస్టీ హేతుబద్ధీకరణ ప్రయోజనాలను వినియోగదారులకు పూర్తిగా అందించాల్సిందేనని, ఈ అంశంపై నిఘా పెడతామని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. వివిధ రకాల వస్తువులపై తగ్గిన పన్నుల ప్రకారం వాటి ధరలను తగ్గిస్తామని పరిశ్రమవర్గాలు తనకు హామీ ఇచ్చాయని తెలిపారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 50% సుంకాలు విధించడంతోనే మోదీ సర్కారు జీఎస్టీ సంస్కరణల నిర్ణయం తీసుకుందన్న వ్యాఖ్యలను గోయల్ తిరస్కరించారు. రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, కార్యదర్శులు, కేంద్ర ఆర్థిక మంత్రి ఏడాదిపాటు సంప్రదింపులు జరిపాక ఈ నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. పన్నుల తగ్గింపు ఫలాలు వినియోగదారులకు పూర్తిస్థాయిలో అందేలా రాష్ట్రాలూ తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు.

### ఆస్పత్రుల్లో రోగులకు ఊరట దక్కేనా?

మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, డయాగ్నస్టిక్ కిట్లు, గ్లూకోమీటర్లు, టెస్ట్ స్ట్రిప్‌లపై ప్రస్తుతం ఉన్న 12% జీఎస్టీని కేంద్రం 5 శాతానికి తగ్గించింది. అయితే, భారీగా ఐసీయూ చార్జీలు వేసే ప్రైవేటు ఆస్పత్రులు ఆ ఊరటను రోగుల వరకు చేరుస్తాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## పన్ను తగ్గింపు ఫలాలు ప్రజలకు అందుతాయి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. "దేశంలో సాధారణ, మధ్య తరగతి వారి కనీస అవసరాలు, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకునే జీఎస్టీ సంస్కరణలు తెచ్చాం. ప్రస్తుతం 90 శాతానికిపైగా వస్తువులు 5శాతం పన్ను పరిధిలోకి వచ్చాయి. ఒకశాతం వస్తువులపై మాత్రమే 40% పన్ను ఉంది" అని చెప్పారు. పన్ను తగ్గింపు ఫలాలు సాధారణ ప్రజలకు కచ్చితంగా చేరుతాయన్న విశ్వాసంతో ఉన్నామని, ఇందు కోసం కొన్ని నెలలు పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ధరల తగ్గింపును క్షేత్రస్థాయిలో ఎంపీలు పర్యవేక్షిస్తారన్నారు. పన్ను తగ్గింపుతో కేంద్ర, రాష్ట్రాలకు ప్రస్తుతం ఆదాయం తగ్గుతుందని.. అయితే వినియోగం పెరగడం వల్ల తిరిగి ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

# తురకపాలెంలో హెల్త్ ఎమర్జెన్సీ!

**ఎయిమ్స్ వైద్య నిపుణుల సాయం తీసుకోండి**



ఆరోగ్య శాఖపై అత్యవసర సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి సత్యకుమార్, సీఎస్ విజయానంద్, ఎంటీ కృష్ణబాబు తదితరులు



తురకపాలెంలో జ్వర బాధితులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

- కొత్త కేసులు నమోదుకాకుండా చర్యలు తీసుకోవాలి
- ఆరోగ్య శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశం
- తురకపాలెం మరణాలపై అత్యవసర సమీక్ష

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ప్రబలిన అంతుచిక్కని జ్వరాల నేపథ్యంలో గ్రామంలో హెల్త్ ఎమర్జెన్సీగా భావించి విధులు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్య శాఖను ఆదేశించారు. రెండు నెలలుగా గుంటూరు జిల్లా తురకపాలెంలో అంతుచిక్కని వ్యాధితో సంభవిస్తున్న వరుస మరణాలపైనా, గ్రామంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వైద్యారోగ్య శాఖాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. జూలై, ఆగస్టు నెలల్లో ఈ గ్రామం నుంచి ఎక్కువ మంది చనిపోవడానికి గల కారణాలపై మొదట దృష్టి పెట్టాలని, అన్ని కోణాల్లోనూ పరిశీలించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. శని, ఆదివారాలు ప్రత్యేక వైద్య బృందాలతో తురకపాలెంలో అందరికీ నిర్దేశిత 42 వైద్య పరీక్షలు నిర్వహించి సోమవారం నాటికి అందరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ఆదేశించారు. అనారోగ్య తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని ఆస్పత్రుల్లో చేర్పించి అత్యవసర చికిత్స అందించాలని ఆదేశించారు.

### కేంద్ర వైద్య బృందాల సాయం తీసుకోవాలి

ఎయిమ్స్ సహా కేంద్ర వైద్య బృందాలను రప్పించాలని, అవసరమైతే అంతర్జాతీయ వైద్యుల సాయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గాలి, నీరు, ఆహారం, భూమి ద్వారా బ్యాక్టీరియా వ్యాపించే అవకాశం ఉందని, తురకపాలెంలో అందరికీ సురక్షిత తాగునీరు అందించాలని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం, ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ రోగిని వైద్య పర్యవేక్షణలో ఉంచాలని, కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, తురకపాలెంలో ప్రస్తుతం ఉన్న కేసులను పరిశీలిస్తే 'మెలియోయిడోసిస్' లక్షణాలు ఉన్నట్టు వైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేశారు. బ్లడ్ శాంపిల్స్ ల్యాబ్‌లకు పంపామని, 72 గంటల్లో రిపోర్టులు వస్తాయని ముఖ్యమంత్రికి తెలిపారు.

### మెలియోయిడోసిస్‌గా అనుమానం...

మెలియోయిడోసిస్ ప్రధానంగా భూమి, నిల్వ నీరు, తడి నేలలో ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో, వరదల సమయంలో వ్యాప్తి చెందుతుంది. డయాబెటిస్, కిడ్నీ, లివర్ సమస్యలు ఉన్నవారు... వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు.. రైతులు, నీటిలో ఎక్కువగా పనిచేసేవారు ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్పారు.

### ఉన్నత స్థాయి విచారణ కమిటీ ఏర్పాటు: మంత్రి సత్యకుమార్

తురకపాలెంలో వరుస మరణాల విషయంలో వైద్యపరమైన పర్యవేక్షణ లోపం ఏమైనా ఉందా..? ఉంటే బాధ్యులెవరు..? అని నిర్ధారించేందుకు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డాక్టర్ అట్టాడ సిరి నేతృత్వంలో ఉన్నతస్థాయి విచారణ కమిటీ ఏర్పాటు చేసినట్టు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తురకపాలెంలో పర్యటించారు. మెలియోయిడోసిస్ జ్వరాల వల్ల మరణాలు జరిగినట్లు వార్తలొచ్చాయని, ఇప్పటివరకు రక్తనమూనాల పరీక్షల ఫలితాల్లో ఇంకా ఆ విషయం నిర్ధారణ కాలేదని అన్నారు.

### కలుషిత నీరు కారణం కాదు: కేంద్ర మంత్రి పెమ్మసాని

తురకపాలెం మరణాలకు కలుషిత నీరు కారణం కాదని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలో బాధిత కుటుంబాలను శుక్రవారం ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. కాగా, గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో మరణించిన ఏడుగురు రోగుల కేస్ షీట్లను వైద్య నిపుణులతో పరిశీలన చేయించాలని డీఎంఈ డాక్టర్ రఘునందన్‌ను వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదేశించారు.

## అవి 'మెలియోయిడోసిస్' జ్వరాలే..!

- తురకపాలెంలో 9 మందికి బ్యాక్టీరియా పాజిటివ్
- 44 రక్త నమూనాలల్లో 9 మందిలో నిర్ధారణ
- ఏ బ్యాక్టీరియానో నిర్ధారించేందుకు మరింత సమయం
- ప్రైవేటు వైద్యనిపుణుల సాయం కోరిన ఆరోగ్యశాఖ

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన తురకపాలెం వరుస మరణాలకు మెలియోయిడోసిస్ జ్వరాలే కారణమని తెలుస్తోంది..! ఈ మరణాలకు కారణమైన బ్యాక్టీరియా ఏమిటో నిగ్గు తేల్చేందుకు ఆరోగ్య శాఖ అధికారులు తురకపాలెంలో 44 మంది జ్వర బాధితుల నుంచి రక్తనమూనాలు సేకరించి గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ ల్యాబొరేటరీలో పరీక్షించారు. ఈ 44 మందిలో 9 మందికి అనుమానిత బ్యాక్టీరియా పాజిటివ్‌గా వచ్చినట్టు తెలిసింది. బ్యాక్టీరియా కాలనీ గ్రోత్ మరింత పెరిగిన తర్వాతే అది ఏ బ్యాక్టీరియానో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. అయితే ఇది బర్కోల్డేరియా సూడోమల్లీ బ్యాక్టీరియానే అని వైద్య వర్గాలు అనుమానిస్తున్నాయి. దీనివల్లే ప్రమాదకరమైన మెలియోయిడోసిస్ జ్వరాలు వస్తాయన్న విషయం తెలిసిందే. గ్రామంలో నమోదైన 9 పాజిటివ్ కేసుల్లో 8 మంది మహిళలు కావడం గమనార్హం. ఇవి కాకుండా తురకపాలెంలో మరో 59 మందికి నిర్వహించిన బ్లడ్ కల్చర్ పరీక్ష ఫలితాలన్నీ సాధారణంగానే వచ్చినట్టు తెలిసింది. ఈ రిపోర్టులు శనివారం వెల్లడించే అవకాశం ఉంది. ఈ ఫలితాలు వస్తేనే తురకపాలెంలో ఇన్ఫెక్షన్‌కు దారి తీసిన కారణాలపై స్పష్టత వస్తుందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఇవికాక గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో శుక్రవారం తురకపాలేనికి చెందిన పి.నరసింహారావు(40) జ్వరం, కీళ్ల నొప్పులు, దగ్గు, ఆయాసంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో చేరారు. ఆయనకు నిర్వహించిన బ్లడ్‌కల్చర్ పరీక్షలో బర్కోల్డేరియా సూడోమల్లీ బ్యాక్టీరియా నిర్ధారణ అయ్యింది. ఇదే ఆస్పత్రిలో గత రెండు నెలల్లో నాలుగు మెలియోయిడోసిస్ కేసులు నమోదయ్యాయని వారంతా కోలుకున్నారని పల్మనాలజిస్టు డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



వార్డర్‌పై సుత్తితో దాడి చేస్తున్న రవికుమార్

## సబ్ జైలు నుంచి ఇద్దరు రిమాండ్ ఖైదీలు పరారీ

- జైలు వార్డర్‌పై సుత్తితో దాడి చేసి ఉడాయింపు
- ఒకరు పంచాయతీ కార్యదర్శి, మరొకరు చోరీ కేసుల్లో నిందితుడు

చోడవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా చోడవరం సబ్ జైలు నుంచి శుక్రవారం సాయంత్రం ఇద్దరు రిమాండ్ ఖైదీలు తప్పించుకున్నారు. పరారైన ఖైదీల్లో ఒకరు నక్కా రవికుమార్ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ కార్యదర్శి. ప్రభుత్వ సామాజిక పింఛన్ల సొమ్మును మాయం చేసిన కేసులో ఏప్రిల్ 25న అనంతగిరి పోలీసులు అరెస్టు చేశారు. మరో రిమాండ్ ఖైదీ మాడుగులకు చెందిన బెజవాడ రాము వివిధ చోరీ కేసుల్లో నిందితుడు. రెండు నెలల క్రితం మాడుగుల మండలంలో జరిగిన బంగారం దొంగతనం కేసులో జూలై 23న మాడుగుల పోలీసులు అరెస్టు చేయడంతో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం వంట పనుల్లో సాయం చేసేందుకు వీరిద్దరినీ సెల్ నుంచి బయటకు వదిలారు. వంట పనిలో సాయం చేస్తున్నట్టుగా నటిస్తూ రవికుమార్.. అక్కడ ఉన్న సుత్తి తీసుకుని సమీపంలో విధి నిర్వహణలో ఉన్న జైలు వార్డర్ బి.వీరరాజుపై దాడి చేశాడు. వీరరాజు పడిపోవడంతో అతని వద్ద ఉన్న తాళాలు లాక్కుని ఇద్దరూ జైలు గేటు తెరచుకుని పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సబ్ జైలుకు చేరుకుని వివరాలు సేకరించారు. బృందాలుగా ఏర్పడి పరారైన ఖైదీల కోసం గాలింపు చేపట్టారు. వార్డర్ వీరరాజును చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం రాత్రి సబ్ జైలును సందర్శించి సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు.

## చివరి మజిలీకీ కష్టాలే!

- శ్మశానవాటికపై రెండు గ్రామాల మధ్య రగడ
- సాయంత్రం వరకు రోడ్డుపైనే మృతదేహం
- మృతుడు ఒకప్పుడు కోట్ల ఆస్తులకు వారసుడు
- చివరికి అనాథలా అంతిమ సంస్కారాలు




రోడ్డుపైనే ఉండిపోయిన కాకర్లపూడి చిరంజీవిరాజు మృతదేహం

కొత్తవలస, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్మశానంలో దహన సంస్కారాల విషయమై రెండు గ్రామాల మధ్య తలెత్తిన వివాదంతో మృతదేహం శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నడిరోడ్డు మీదే ఉండిపోయింది. చివరకు పెద్దల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. విజయనగరం జిల్లా జామి మండలం అలమండలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాకర్లపూడి చిరంజీవి రాజు ఒకప్పుడు రూ.వందల కోట్ల ఆస్తులకు వారసుడు. తండ్రికి ఈయన ఒక్కడే కొడుకు. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో మిస్సమ్మ బంజరులో వాటాదారు. కాలక్రమంలో ఆస్తులన్నీ కరిగిపోయి. భూములు కూడా పోయాయి. ఒంటరిగా మిగిలిపోయిన చిరంజీవి రాజు గురువారం ఆయన మృతి చెందగా, అంతిమ సంస్కారాలకు కొంతమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. చిరంజీవిరావు మృతదేహాన్ని తమ్మన్న మెరక శశ్మాన వాటికకు తీసుకెళ్లడానికి యత్నించగా.. తమ శ్మశానంలో చేయడానికి వీలు లేదంటూ తమ్మన్నమెరక గ్రామస్థులు అడ్డుకున్నారు. చివరికి రెండు గ్రామాల పెద్దలు మాట్లాడుకున్న తర్వాత చిరంజీవిరాజు మృతదేహానికి తమ్మన్న మెరక శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## చిరుమామిళ్లలో 30 పడకల సీహెచ్‌సీ

- రూ.5 కోట్ల విరాళం ఇచ్చేందుకు 'గోల్కొండ' గ్రూప్స్ అధినేత రామిరెడ్డి అంగీకారం



రామిరెడ్డి

నాదెండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(కమ్యూనిటీ హెల్త్ సెంటర్) నిర్మించనున్నారు. ఈ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత, చిరుమామిళ్ల గ్రామస్థుడు నడికట్టు రామిరెడ్డి రూ.5 కోట్లు విరాళంగా ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. ఈ క్రమంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదేశాల మేరకు ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ నాయక్‌తో పాటు అధికారులు, రామిరెడ్డి నిర్మాణ స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. 2013లో సుమారు నాలుగు ఎకరాల స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి రామిరెడ్డి విరాళంగా అందజేశారు. ఈ క్రమంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 కోట్ల అంచనా వేయగా రూ.4.5 కోట్లకు టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. రామిరెడ్డి ఇవ్వనున్న రూ.5 కోట్ల విరాళంతో ఆరోగ్య కేంద్రంపై అదనపు ఫ్లోర్, కాంపౌండ్ వాల్ నిర్మించనున్నారు. కాగా.. గ్రామీణ పేదలతో పాటు రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగ పడుతుందని రామిరెడ్డి తెలిపారు.

## ఉద్యాన వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా గోపాల్ కొనసాగేనా?

- పదవీ విరమణ వయసు పెంపుపై లేఖ
- ఇంతవరకూ నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- హైకోర్టును ఆశ్రయించిన ఇన్‌చార్జి వీసీ
- ప్రొఫెసర్‌గా పదవీ కాలాన్ని పొడిగిస్తేనే వీసీగా అవకాశం!

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వాలు చేస్తున్న జాప్యానికి న్యాయపరమైన చిక్కులు తప్పడం లేదు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ బి.గోపాల్ విషయమే ఇందుకు నిదర్శనం. ఆగస్టు 31న ఆయనకు 62 ఏళ్లు పూర్తి కావడంతో ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ చేయాలి. ఉద్యోగ విరమణ చేస్తే ఇన్‌చార్జి వీసీగా కొనసాగే అవకాశం లేదు. దీంతో ప్రొఫెసర్‌గా తన పదవీ కాలాన్ని పొడిగించాలంటూ మూడు నెలల కిందటే గోపాల్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై ప్రభుత్వం ఇంతవరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. వాస్తవానికి ఉన్నత విద్యా సంస్థల్లో పనిచేసే అధ్యాపక సిబ్బంది పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచుతూ నాటి వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఉన్నత విద్యా సంస్థల చట్ట నిబంధనల్లోనూ ఈ 65 ఏళ్ల ప్రస్తావన ఉంది. దీనిపై బి.గోపాల్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ ఈనెల 11న జరగనుంది. గోపాల్ ఇప్పటికీ ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతుండగా.. ఆయన ప్రొఫెసర్ పదవీ కాలంపై హైకోర్టులో కేసు నడుస్తుండటం విశేషం. కాగా, వైసీపీ హయాంలో అప్పటి వీసీ జానకిరామ్‌ను రెండోపర్యాయం కొనసాగించడంలో నిబంధనలు పాటించలేదంటూ నియామకాన్ని హైకోర్టు రద్దు చేసింది. బి.గోపాల్ విషయంలోనూ కూటమి ప్రభుత్వం అదే తప్పు చేస్తోందనే చర్చ నడుస్తోంది.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి శుక్రవారం వేకువజామున అభిషేక సేవలో పాల్గొని తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.






సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి దంపతులు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందనరావు దంపతులు దర్శించుకున్నారు.

టీటీడీ ఆరోగ్య వరప్రసాదినికి

## రూ.కోటి విరాళం

తిరుమల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి శుక్రవారం రూ.కోటి విరాళంగా అందింది. బెంగుళూరుకు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు రూ.1,00,50,000 విరాళం డీడీని టీటీడీ చైర్మన్‌కు అందజేశారు.





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# న్యాయం దక్కేనా?

దేశరాజధానిలో ఐదేళ్ళనాటి అల్లర్లకేసులో నిందితులుగా ఉన్న ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ ఇత్యాదులకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో పౌరసత్వ సవరణ చట్టంపై నిరసనలు హింసాత్మకంగా మారి, యాభైమందికి పైగా మరణించిన ఘటన విస్మరించలేనిది. వీరిలో అధికులు ముస్లింలేనన్న విషయాన్ని అటుంచితే, ఈ అల్లర్లకు బాధ్యులుగా, కుట్రదారులుగా 15మంది మీద చట్టవ్యతిరేక కార్యకలాపాలచట్టం (ఊపా) కింద కేసు నమోదైంది. ఖలీద్, షర్జీల్ బెయిల్ పిటిషన్లు మూడేళ్ళనుంచీ పెండింగ్‌లో ఉండగా, తాజావిచారణలో ధర్మాసనం వాటిని తోసిపుచ్చింది. దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిమీద ఏ మాత్రం జాలిపడనక్కరలేదంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వ్యాఖ్య సముచితమైనది. కుట్రలు చేసినవారిని వదిలిపెట్టమని ఎవరూ అనరు. వారిని శిక్షించవలసిందే. అయితే, ప్రభుత్వమూ, శక్తిమంతమైన దాని యంత్రాంగమూ, దాని న్యాయవాదులు, చివరకు న్యాయమూర్తులు ఏకరీతిగా, ఏకమాటగా నిందితులందరూ సంఘవిద్రోహ శక్తులని అంతగట్టిగా నమ్ముతున్నా కూడా ఆ నిరూపణ ప్రక్రియ ఇప్పటి వరకూ ఆరంభం కాకపోవడం మరింత ఆశ్చర్యపరుస్తోంది. బెయిల్ పొందడానికి కూడా అనర్హులనీ, నిర్దోషులుగా తేలేవరకూ జైల్లో మగ్గడమే సరైనదంటూ అంత ఆగ్రహంగా ఊగిపోతున్న సొలిసిటర్ జనరల్ ఈ నిందితులందరినీ దోషులుగా నిరూపించేందుకు ఇంతవరకూ ఎందుకు ప్రయత్నించలేదో తెలియదు. ఐదేళ్ళుగా విచారణ జరపకుండా, బెయిల్ మంజూరు చేయకుండా నేరనిర్ధారణకు ముందే వారంతా శిక్షలు అనుభవించేట్టుగా చేయడం సామాన్యులను సైతం ఆశ్చర్యపరుస్తోంది.

ఇక సర్వోన్నత న్యాయస్థానమే దిక్కు అంటున్నారు ఉమర్ జీవిత భాగస్వామి బనోజ్యోత్స్న లాహిరి. విచారణ మొదలు కాకుండా ఐదేళ్లపాటు జైల్లో ఉంచడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించి బెయిల్ ఇస్తుందని ఆమె ఆశించారు. బెయిల్‌కు అర్హతగా ఈ ఐదేళ్ళ అనధికారిక జైలుశిక్ష చాలదా? అంటున్నారామె. దిగువ కోర్టులు బెయిల్ ఇవ్వకపోవడం సరే, సర్వోన్నత న్యాయస్థానంలోనే గతంలో బెయిల్ పిటిషన్ రికార్డుస్థాయిలో వాయిదా పడింది. దాదాపు ఏడాదిన్నర జైలు జీవితం తరువాత, కర్కడుమా కోర్టు 2022 మార్చిలో తొలిసారిగా బెయిల్ నిరాకరించాక, అక్టోబర్‌లో ఢిల్లీ హైకోర్టు కూడా కాదన్నాక, ఉమర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. న్యాయవాదుల గైర్హాజరు, ప్రాసిక్యూషన్ అభ్యర్థన మేరకు వాయిదా, సమయం లేకపోవడం, సీనియర్ న్యాయవాదులు అందుబాటులోకి రాకపోవడం ఇత్యాది కారణాలతో ఒకే ఏడాదిలో పదిహేనుసార్లు ఉమర్ బెయిల్ పిటిషన్ పరిశీలనకు దూరంగా ఉండిపోయిన చరిత్ర ఉంది. చివరకు, గత ఏడాది ఫిబ్రవరిలో ఆయన దానిని ఉపసంహరించుకొని, ఇతరత్రా వాదనలతో, కారణాలతో మళ్ళీ దిగువస్థాయి నుంచి పోరాటం మొదలుపెట్టాడు.

బెయిల్ నియమం, జైలు మినహాయింపు అనే సూత్రం ఊపా వంటి కరుడుగట్టిన చట్టాలకు కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసి, తదనుగుణంగా నిందితులకు బెయిల్ కూడా ఇచ్చి ఉన్నతంగా వ్యవహరించింది. నేర స్వభావంతో నిమిత్తం లేకుండా నిందితుడి బెయిల్ హక్కును కాపాడవలసిందేనని కూడా వ్యాఖ్యానించింది. సమీపకాలంలో విచారణ పూర్తికాబోదన్న సత్యం తెలిసికూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నవారి విషయంలో న్యాయస్థానాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఎలా వ్యవహరించగలుగుతున్నాయో తెలియదు.

ఉమర్‌ఖలీద్ అరెస్టులో రాజకీయకుట్ర ఉందని ఆయన అభిమానులు, న్యాయవాదులు అంటారు. ఆయన శాంతియుతంగానే నిరసనలు వ్యక్తం చేశాడని, పౌరసత్వ చట్టానికే కాదు, పాలకులు భవిష్యత్తులో చేపట్టబోయే ఏకపక్ష, మైనారిటీవ్యతిరేక నిర్ణయాలపై ఎవరి గొంతూ లేవకుండా చేయడానికే ఈశాన్యఢిల్లీ ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా విరుచుకుపడిందని వారి వాదన. ఇక, జేఎన్‌యూ విద్యార్థిసంఘం నాయకుడుగా ఉన్నప్పటి నుంచీ ఆయనమీద పాలకులు కక్షకట్టారని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. సీఏఏ, ఎన్ఆర్‌సీ, ట్రిపుల్ తలాఖ్, కశ్మీర్ ఇత్యాది అంశాల్లో ఉమర్, ఆయన మిత్రబృందం తీవ్రమైన భాషతో ప్రభుత్వాన్ని నిలదీసిన మాట నిజం. ఘాటైన ప్రసంగాలు చేసినంతమాత్రాన దేశద్రోహులు అయిపోరు. ఉమర్ ఖలీద్ దీర్ఘకాల అక్రమ నిర్బంధం ద్వారా ప్రశ్నించడం దేశద్రోహం, విమర్శించడం విప్లవం, నిరసించడం నేరం అని ప్రజలను అదుపాజ్ఞల్లో ఉంచడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో నిందితులందరికీ బెయిల్ ఇవ్వడంతో పాటు, నిర్దిష్టకాలపరిమితిలోగా విచారణ ముగిసేట్టుగా సర్వోన్నత న్యాయస్థానం చర్యలు తీసుకోవాలి.

# వాణిజ్య మైత్రితో సరిహద్దు వైరం తీరేనా?

ఇద్దరు వ్యక్తులు నాట్యం చేయడానికి సిద్ధమవుతున్నారు. సంగీతం అస్ఫుటంగా వినిపిస్తోంది. గాయకుడు ఎవరైందీ ఇంకా కనిపించడం లేదు. అయితే ఆ గాయకుడు భారత ప్రధానమంత్రి మాత్రం కాదు. ఇది స్పష్టాతి స్పష్టం. మహాబలిపురంలో చైనా అధ్యక్షుడు క్సీ జిన్‌పింగ్‌తో కలిసి ఊయల ఊగిన రోజుల నుంచి నరేంద్ర మోదీ చాలా దూరం వచ్చారు. జూన్ 15, 2020న గల్వాన్ లోయలో చైనా, భారత్ సైనిక దళాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల్లో 20 మంది భారత జవాన్లు మరణించారు. ఆ ఘటన నాలుగురోజుల అనంతరం జరిగిన అఖిలపక్ష సమావేశంలో 'బయటివారెవ్వరూ భారత భూ భాగాల్లోకి చొరబడలేదు, ఏ బయటి వ్యక్తీ భారత భూభాగంలో లేడు' అని మోదీ గంభీరంగా ఉద్ఘాటించారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అయితే కొద్ది వారాలలోనే రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి మోదీ మాటకు విరుద్ధమైన ప్రకటనలు చేశారు. సైనికాధికారుల స్థాయి చర్చల్లో సరిహద్దుల్లో సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు భారత్ త్రివిధ చర్యలను ప్రతిపాదించింది. అవి: ఉపసంహరణ, ఉద్రిక్తతల సడలింపు, నిస్సైనికీకరణ. భారత్‌తో చర్చలలో చైనా పాల్గొన్నది. తన సైనిక దళాలను వెనక్కి తీసుకువెళ్లింది. అయితే ఉద్రిక్తతల సడలింపునకు, నిస్సైనికీకరణకు నిరాకరించింది. గల్వాన్ సరిహద్దు ప్రాంతంలో చైనా సైనిక దళాలను పెద్ద ఎత్తున సమీకరిస్తున్నట్టు, సైనిక శకటాలను మోహరిస్తున్నట్టు, 5జి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్టు, కొత్త రహదారులు నిర్మించినట్టు, తన సైనిక దళాలకు కొత్త ఆవాసాలను నిర్మిస్తున్నట్టు ఉపగ్రహాలు తీసిన ఛాయాచిత్రాలు స్పష్టం చేశాయి. భారత్, చైనాల మధ్య ఘర్షణలకు గల్వాన్ ఒక్కటే కేంద్రం కాదు. డెప్సాంగ్, డెమ్‌చోక్ వివాదాలు అపరిష్కృతంగా ఉన్నాయి. వాస్తవాధీనరేఖకు ఈవల వైపు భారత్‌లో ఉన్న ఈ కీలక ప్రదేశాలలో చైనా సైనిక దళాలు తిష్ట వేసి ఉన్నాయి. డిసెంబర్ 2024లో కూడా 'ఉభయ దేశాల మధ్య సంబంధాలు 2020 నుంచి మామూలుగా లేవని' భారత విదేశాంగ మంత్రి చెప్పారు. ఈ ఏడాది జూన్‌లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య నాలుగురోజుల యుద్ధం జరిగినప్పుడు భారత్‌ను దెబ్బతీసేందుకు చైనా పరోక్షంగా ప్రయత్నించింది.

చైనాతో అన్ని రంగాలలో సంబంధాలను తెంచుకునే విషయమై భారత్ మాట్లాడింది కానీ అది ఆచరణలో అంత తేలిక కాదని రుజువయింది. చైనాతో భారత్ వస్తూత్పత్తుల వాణిజ్య లోటు ఏటా పెరుగుతూనే ఉంది. 2024–25లో ఈ వాణిజ్యలోటు 10,000 కోట్ల డాలర్లుగా ఉన్నది. పలు కీలక వస్తువుల విషయంలో భారత్ పూర్తిగా చైనాపై ఆధారపడి ఉన్నది. భారత్‌లో రిజిస్టర్ అయిన చైనా కంపెనీలు 174 కాగా 3,560 భారతీయ కంపెనీల మేనేజిమెంట్ బోర్డులలో చైనీస్ డైరెక్టర్లు ఉన్నారు. భారత్–పాకిస్థాన్ యుద్ధం తరువాత టిక్‌టాక్ తదితర చైనీస్ మొబైల్ యాప్స్‌ను భారత్ నిషేధించింది. భారత్‌లో చైనా పెట్టుబడులపై ఆంక్షలు విధించింది.



షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా నరేంద్ర మోదీ, క్సీ జిన్‌పింగ్ మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశం చరిత్రాత్మకమైనది. ఉభయ దేశాల మధ్య సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవడానికి పెద్దగా ఉపయోగపడకపోయినా వాణిజ్యం, పెట్టుబడుల విషయంలో తీవ్రమైన విభేదాలు, వ్యత్యాసాలను తొలగించుకునేందుకు అది తోడ్పడే అవకాశమున్నది. ఇదే సంభవిస్తే భారత్–చైనా సంబంధాలు మేలు మలుపు తిరుగుతాయి.

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ)కు క్సీ జిన్‌పింగ్ మొదటి నుంచీ చాలా ప్రాధాన్యమిస్తున్నారు. 2019, 2022, 2024 ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సుల సందర్భంగా జిన్‌పింగ్, మోదీల మధ్య ద్వైపాక్షిక సమావేశాలు జరగలేదు. ఈ దృష్ట్యా టియాంజిన్ సదస్సు సందర్భంగా ఇరువురి మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశం చరిత్రాత్మకమైనది. సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవడంలో అవరోధాలను అధిగమించేందుకు అది పెద్దగా ఉపయోగపడదు. అయితే ఇటీవలి కాలంలో వాణిజ్యం, పెట్టుబడుల విషయంలో తీవ్రమైన విభేదాలు, వ్యత్యాసాలను తొలగించుకునేందుకు గణనీయంగా తోడ్పడే అవకాశమున్నది. ఇదే సంభవిస్తే ఉభయ దేశాల మధ్య సంబంధాలు మేలుమలుపు తిరుగుతాయి.

భారత్, చైనా రెండూ తమ పాత వైఖరులను విడనాడి స్నేహపూరిత సంబంధాలను పెంపొందించుకోవాలని నిర్ణయించుకోవడానికి దారితీసిన పరిస్థితులు, కారణాలను మనం జాగ్రత్తగా విశ్లేషించాలి. డోనాల్డ్ ట్రంప్‌తో స్నేహానికి నరేంద్ర మోదీ ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. అయినప్పటికీ ట్రంప్ మోదీ స్నేహాన్ని తృణీకరించారు. ఫలితంగా భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలలో న్యూఢిల్లీకి చేదు అనుభవాలే మిగిలాయి. సుసంబంధ, పరస్పర ప్రయోజనకర ఆర్థిక సంబంధాల కంటే వ్యక్తిగత వ్యాపార లబ్ధికి, సంకుచిత రాజకీయ లక్ష్యాలకు ప్రాధాన్యమిచ్చే లావాదేవీల అధ్యక్షుడి నుంచి భారత ప్రభుత్వం ఒక క్రూర పాఠాన్ని నేర్చుకున్నది. మరే దేశంపై విధించని విధంగా భారత్‌పై ట్రంప్ అత్యధిక సుంకాలు విధించారు.

దీంతో చైనాతో సంబంధాలు మెరుగుపరచుకోవడం ద్వారా అమెరికా సృష్టించిన ఇబ్బందికరమైన పరిస్థితుల నుంచి బయటపడేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. చైనా తన వాణిజ్యాభివృద్ధికి, పెట్టుబడులను ఇతోధికంగా విస్తరింపచేసుకునేందుకు ఆరాటపడుతోంది. అందుకు అవసరమైన అవకాశాలు ప్రపంచ అతిపెద్ద మార్కెట్ అయిన భారత్‌లో ఉన్నాయనే వాస్తవాన్ని చైనా గుర్తించింది. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో తన ప్రభావాన్ని విస్తరింపచేసుకోవడం కూడా భారత్ లక్ష్యంగా ఉన్నది. ఈ కారణాల వల్ల నిన్నటిదాకా తన శత్రువుగా ఉన్న చైనాను తనకు అనుకూలం చేసుకునేందుకు పూనుకున్నది. అయితే వాస్తవాలను నిశితంగా పరిశీలిస్తే భారత్–చైనా సరిహద్దు ప్రాంతాలపై తన వాదనలను విడనాడడానికి గానీ, తాను ఉత్పత్తి చేసే సైనిక సామగ్రిని భారీ ఎత్తున కొనుగోలు చేస్తున్న పాకిస్థాన్ ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడానికి గానీ బీజింగ్ అంగీకరించదని స్పష్టమవుతున్నది. టియాంజిన్‌లో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో వాణిజ్యాన్ని పెంపొందించుకోవడం, ఉగ్రవాద నిర్మూలన అంశాలకు మోదీ అమిత ప్రాధాన్యమిచ్చారు. అయితే క్సీ జిన్‌పింగ్ చాలా తెలివిగా ఆ అంశాలకు ప్రాధాన్యమివ్వకుండా వ్యవహరించారు.

ఈ వాస్తవాల దృష్ట్యా భారత్ ప్రయోజనాలకు అనుకూలంగా మోదీ స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే పరిస్థితిలో లేరు. భారత్ ఎగుమతుల ప్రధాన గమ్యమైన అమెరికా, భారత్ భారీ దిగుమతులకు మూలదేశమైన చైనా మధ్య చిక్కుకున్నారు. క్వాడ్, ఎస్‌సీఓ/ఆర్ఐసీలలో దేనికి అగ్ర ప్రాధాన్యమివ్వాలనే విషయంలో కూడా ఆయనకు అన్నీ చిక్కులే. ట్రంప్ మాదిరిగా మోదీ కూడా తన రాజకీయ సహజాతాలు తిరుగులేని రీతిలో సక్రమమైనవని విశ్వసిస్తారు. ఆయన వైయక్తిక దౌత్యశైలికి ప్రధాన కారణం ఆ ప్రగాఢ విశ్వాసమే. ఇప్పటికే ఎన్నో వైఫల్యాలు ఎదురయ్యాయి. భారత్ ప్రయోజనాలు దెబ్బతింటున్నందున నరేంద్ర మోదీ తన వైయక్తిక దోస్తీ దౌత్యాన్ని విడనాడి, విదేశాంగ శాఖ అధికారులు, అనుభవజ్ఞులైన దౌత్యవేత్తల సలహా, సూచనల ప్రకారం వ్యవహరించాలి. అప్పుడు మాత్రమే భారత్ ప్రయోజనాలకు విశేషంగా దోహదం చేకూరుతుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# తొలి ప్రభాతంలో ఆధునిక నేపాల్

మధ్య తరగతి, ఆంగ్ల భాషా ప్రావీణ్య, వృత్తి నిపుణుల కుటుంబాల నేపథ్యమున్న భారతీయులు తమ మాతృభూమేతర దేశాల గురించి తెలుసుకోదలిచినప్పుడు సర్వసాధారణంగా వారి ఆసక్తి పాశ్చాత్య దేశాల పైనే ఉంటుంది. సహజంగానే అమెరికా, ఇంగ్లాండ్‌లను వారు ఎక్కువగా ఇష్టపడతారు. అలాగే ఫ్రాన్స్, ఇటలీ కూడా భారతీయుల శ్రద్ధకు నోచుకుంటాయి.


పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే నేను ఆ పాశ్చాత్య దేశాల గురించి చాలా తెలుసుకున్నాను. అదృష్టవశాత్తు నేను పెరిగిన పరిసరాలు నాకు సమీపంలో ఉన్న ఇతర దేశాలపై శ్రద్ధాసక్తులను జనింపచేశాయి. నేను తొలుత ప్రస్తావించిన నేపథ్యం నుంచి వచ్చిన భారతీయులు సాధారణంగా ఈ సమీప దేశాల పట్ల ఉదాసీనవైఖరి చూపడం కద్దు. ఉత్తరాఖండ్‌లోని ఇతర ప్రాంతాలతో పాటు నా స్వస్థలం డెహ్రాడూన్ కూడా 18వ శతాబ్ది తుదినాళ్లలో నేపాల్ గూర్ఖా రాజ్యం అధీనంలోకి వెళ్లాయి. గూర్ఖాల నుంచి ఉత్తరాఖండ్ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్న బ్రిటిష్ వారి అనేక సైనిక పటాలాలకు డెహ్రాడూన్ ప్రధాన స్థావరంగా ఉండేది. ఆ సైనికులలో అత్యధికులు నేపాలీలు. ఈ కారణంగా డెహ్రాడూడ్‌లో ఉన్న సైనిక పటాలాల పేర్లలో 'గూర్ఖా' అనే పదం తప్పనిసరిగా ఉండేది.

నా బాల్యంపై నేపాలీ ప్రభావం విస్తృతమైనది, విస్మరించలేనిది.

నేను చదివిన పాఠశాల, 1950ల్లో తమ స్వదేశం నేపాల్ నుంచి పరారై వచ్చిన కులీన రాణాలు స్థాపించింది. మా ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లే మార్గం పొడుగునా నేపాలీ భాషీయుల ఆవాసాలు ఉండేవి. క్రీడలలో నా తొలి ఆరాధ్యుడు నేపాలీ సంతతికి చెందిన ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ ఆటగాడు రామ్ బహదూర్ చెత్రి. ఫుట్‌బాల్ టోర్నమెంట్స్ ముగిసిన అనంతరం కలకత్తా నుంచి డెహ్రాడూన్‌కు వచ్చి మా బాబాయితో కలిసి ఏర్పాటు చేసిన క్రికెట్ క్లబ్‌ను ఆయనే నిర్వహిస్తుండేవారు. ఈ అనుబంధాల కారణంగా యవ్వనంలోను ఆ తరువాత నేను చాలాసార్లు నేపాల్‌ను సందర్శించాను. నా నేపాలీ స్నేహితులలో ఒకరు ఖాట్మండులో ఒక పత్రికా సంపాదకుడుగా ఉన్నాడు.

ఈ అనుబంధాల కారణంగానే, నేపాల్ చరిత్రపై ఇటీవల ప్రచురితమైన 'Nepal in the Long 1950s' చాలా ఆసక్తితో చదివాను. ప్రత్యోష్ అన్నా, లోక్‌రంజన్ పరజూలి, మార్క్ లైచ్టీ ఈ విశిష్ట గ్రంథ సంపాదకులు. రాణాల పాలన నుంచి నేపాల్ విముక్తమైన అనంతర కాలంలో ఆ హిమాలయ రాజ్యంలో సంభవించిన మార్పులను ఈ పుస్తకంలోని వ్యాసాలు వివరించాయి. 19వ శతాబ్దంలో నేపాల్ రాజకీయాలను శాసించిన రాణాలు స్వతంత్ర ఆలోచనా ధోరణులను, సృజనాత్మక స్వేచ్ఛను పూర్తిగా నియంత్రించారు. రాణాల పాలనా శృంఖలాల నుంచి బయటపడిన తరువాత నేపాల్‌లో చోటుచేసుకున్న సాంస్కృతిక వికాసాన్ని, సామాజిక మార్పులను ఈ పుస్తకం విపులీకరించింది.

ఖాట్మండులోని చరిత్రాత్మక టీ దుకాణం 'తిలౌరి మైలాకో పసల్' గురించి ప్రవాస్ గౌతమ్ రాసిన కథనం ఈ పుస్తకంలోని మొదటి వ్యాసం. తేనేటి సేవనం సంప్రదాయ నేపాలీ సంస్కృతిలో భాగం కాదు. ప్రపంచ యుద్ధాలలో సుదూర దేశాలకు వెళ్లిన గూర్ఖా సైనికులు తమకు అలవాటయిన తేనీటి సేవనాన్ని మాతృభూమికి పరిచయం చేశారు. ప్రస్తావిత టీ షాప్‌కు ప్రజాస్వామిక హక్కుల కార్యకర్తలతో పాటు ఫుట్‌బాల్ క్రీడాకారులు, వారి అభిమానులు నిత్యం వస్తుండేవారు. రాజకీయ పరిణామాల గురించి చర్చించేందుకు, తమ ఉద్యమ కార్యకలాపాలను నిర్ణయించుకునేందుకు ప్రజాస్వామిక హక్కుల కార్యకర్తలు 'తిలౌరి మైలాకో పసల్'కు వచ్చేవారు. ఇక ఫుట్‌బాల్ ఆటగాళ్లు, మ్యాచ్‌కు ముందు, మ్యాచ్ అయిపోయిన తరువాత విధిగా అక్కడకు వస్తుండేవారు. ఫుట్‌బాల్ మ్యాచ్‌లతో పాటు సినిమాల గురించి వారు మాట్లాడుకునేవారని గౌతమ్ రాశారు (ఖాట్మండులో సినిమా థియేటర్లు 1950ల తొలినాళ్లలో ప్రారంభమయ్యాయి).




నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాలను చులకనగా చూడడాన్ని, వాటి పట్ల అహంకారపూరిత వైఖరి ప్రదర్శించడాన్ని మన పాలకపక్ష రాజకీయవేత్తలు విడనాడాలని ఏడాది క్రితం ఇదే కాలమ్‌లో రాసిన వ్యాసంలో నేను వాదించాను. 'Nepal in the Long 1950s' చదివిన తరువాత ఆ వాదనకు ఇలా ముక్తాయింపు ఇవ్వదలిచాను: ఇరుగు పొరుగు దేశాల గురించి మరింత విస్తృతంగా, సమగ్రంగా మనం అధ్యయనం చేయాలి. తద్వారా, ఆర్థిక, విదేశాంగ విధాన ప్రయోజనాలతో సంబంధం లేకుండా భారతదేశమూ, భారతీయులూ విశేషంగా లబ్ధి పొందుతారు.

ఖాట్మండు లోయలోని ఇతర ప్రదేశాలలో టీషాప్‌ల వలే కాకుండా 'తిలౌరి మైలాకో పసల్' కస్టమర్లలో అన్ని కులాలవారు ఉండేవారు. దుకాణ యజమానులు అయిన సోదరులు ఉదార భావాలు ఉన్న ప్రగతిశీలురు. అది వారికి వ్యాపార లబ్ధిని సమకూర్చింది. అయినప్పటికీ సంప్రదాయ సామాజిక వివక్షలు కొనసాగుతూనే ఉండేవి. అగ్ర కులాల విద్యావంతులు ఆ విశాల టీ షాప్ లోపల రుచికరమైన తేనేటిని సేవిస్తుండగా కింది కులాల శ్రామికులు సాధారణంగా దుకాణం వెలుపలే టీ తాగి వెళ్లిపోతుండేవారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

1950ల్లో ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యమయిన తరుణంలో నేపాలీల ఆలోచనలను 'బికాస్' లేదా అభివృద్ధి భావన అమితంగా ప్రభావితం చేసిందని బన్దన గ్యావలీ తన వ్యాసంలో పేర్కొన్నారు. పొరుగున ఉన్న భారత్, వలసపాలన నుంచి విముక్తి పొందుతున్న అనేక ఆసియా, ఆఫ్రికన్ దేశాల వలే నేపాల్ కూడా మరిన్ని రహదారులు, మరిన్ని ఫ్యాక్టరీలు, విద్యుదుత్పాదన కేంద్రాలకు, మహానగరాల నిర్మాణానికి ఆరాటపడింది. వాటిని సమకూర్చుకోవడమే 'అభివృద్ధి' అని విశ్వసించింది. పెట్టుబడిదారీ అనుకూల, సామ్యవాద అనుకూల వర్గాలు రెండిటికీ ఇటువంటి దార్శనికతే కలిగి ఉండేవి. కాకపోతే పెట్టుబడిదారీ విధాన అనుకూలురు మార్కెట్ ఆధారంగానే అటువంటి అభివృద్ధి సిద్ధిస్తుందని విశ్వసించేవారు. సామ్యవాద సానుకూలురు కార్మికవర్గ రాజకీయ పక్షం నాయకత్వంలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో మాత్రమే సర్వతోముఖ అభివృద్ధి సాధ్యమని వాదిస్తుండేవారు (బన్దన ప్రస్తావించని ఒక విశేషం ఉన్నది. 1950ల్లోను, ఆ తరువాయి దశాబ్దంలోను అటు నేపాల్‌లోను, ఇటు భారత్‌లోను చాలా మంది తల్లిదండ్రులు తమ మగబిడ్డలకు బికాస్ లేదా దాని సంస్కృత రూపమైన వికాస్ అని నామకరణం చేసేవారు).

రాణాల పాలన ముగిసిన అనంతరం నేపాలీల మేధో వికాసం, నవ్య సాహిత్య జాగృతి గురించి ప్రత్యోష్ తన వ్యాసంలో వివరించారు. 'నేపాల్ సాంస్కృతిక్ పరిషద్' గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఈ సంస్థ ప్రచురించే ఒక పత్రికలో నేపాల్ చరిత్ర, సంస్కృతిపై విపుల, పరిశోధనాత్మక వ్యాసాలు వెలువడుతుండేవి. ఆ పత్రిక తొలి సంపాదకీయం ఇలా పేర్కొంది: 'నేపాల్‌లో కొత్త యుగం ఆరంభమయింది. జాతి తన స్వాభిమానాన్ని కాపాడుకునేందుకు, మరింత సమున్నత సంస్కృతిని సృష్టించేందుకు తమ పూర్వీకుల సాంస్కృతిక, సాహిత్య కృషి గురించి తప్పక తెలుసుకోవలిసిన అవసరమున్నది'.

నేపాల్‌లో తొలి ఆధునిక విశ్వవిద్యాలయం సంస్థాపన గురించి లోక్ రంజన్ తన వ్యాసంలో వివరించారు. రాజు త్రిభువన్ పేరిట ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటయింది. 'ఆరంభం నుంచి భారతీయులు, అమెరికన్లకు తమ అధికారాన్ని, ప్రభావాన్ని నెరపేందుకు ఈ విశ్వవిద్యాలయం ఒక నెలవు అయిందని వ్యాస రచయిత వ్యాఖ్యానించాడు. పట్నా విశ్వవిద్యాలయాన్ని ఆదర్శంగా తీసుకుని త్రిభువన్ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిపరచాలని పలువురు సూచించారు. అయితే ఈ సూచనను ఒక విద్యావేత్త తీవ్రంగా ఖండిస్తూ ఇరవయో శతాబ్ది తుదినాళ్లలో ఏర్పాటు చేసుకునే విశ్వవిద్యాలయాన్ని భారతీయ విశ్వవిద్యాలయాలను గుడ్డిగా అనుకరించడాన్ని భారతీయ విద్యావేత్తలు కూడా హర్షించరని పేర్కొన్నారు. ఖాట్మండులో విదేశీ పర్యాటకులకు సేవలు అందిస్తున్న ఒక హోటల్‌ను నిర్వహించే రష్యన్ వ్యాపారవేత్త గురించి ఒక ఆసక్తికరమైన వ్యాసమున్నది. భూ సంస్కరణలు, అమెరికా సహాయం గురించి కూడా విపుల వ్యాసాలు ఉన్నాయి.

ఈ పుస్తకాన్ని చదవడం ద్వారా ఆధునిక నేపాల్ గురించి నేను చాలా తెలుసుకున్నాను. 1950ల్లో భారత్‌లో సంభవించిన పరిణామాల గురించి కూడా అటువంటి పుస్తకం నొకదాన్ని తీసుకువస్తే బాగుంటుంది కదా అనే ఆలోచన నా మనసులో మెదిలింది. ఆ స్వాతంత్ర్య తొలి దశాబ్దంలో కలకత్తా, ఢిల్లీ, బాంబే, బెంగళూరులో కఫేలు, కాఫీ హౌస్‌లు మేధావుల సమావేశాలు, చర్చలకు నెలవులుగా ఉండేవి. అటువంటి నెలవులు గురించి అధ్యయనం చేయడం విలువైన చారిత్రక కర్తవ్య నిర్వహణ అవుతుంది. అలాగే నేపాలీ పత్రికల గురించి ప్రత్యోష్ రాసిన వ్యాసం ఉత్కృష్ట అధ్యయనాలకు ఉపథ నిర్దేశం చేసిన బాంబే జర్నల్ 'ఎకనమిక్ వీక్లీ' (తదనంతర కాలంలో ఇది ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీగా పునరుత్థానమయింది) చరిత్రను శోధిస్తే స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో మేధో చింతన ఆవిర్భావం, అది పరిణమించిన రీతులపై కొత్త వెలుగులు ప్రసరిస్తాయి. త్రిభువన్ విశ్వవిద్యాలయంపై వ్యాసం చదివిన తరువాత ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల ఏర్పాటు, భారతదేశ, విశాల ప్రపంచ ఆర్థిక జీవనంపై వాటి ప్రభావం గురించి పరిశోధనలు ఇంకా ఎందుకు జరగలేదని నేను ఆశ్చర్యపోయాను. అలాగే రష్యన్ వ్యాపారవేత్తపై వ్యాసం చదివిన తరువాత సుప్రసిద్ధ తాజ్, ఒబెరాయి హోటళ్ల చరిత్రపై పరిశోధనలు జరగవలసి ఉందనే భావన కలిగింది.

నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాలను చులకనగా చూడడాన్ని, వాటి పట్ల అహంకారపూరిత వైఖరి ప్రదర్శించడాన్ని మన పాలకపక్ష రాజకీయవేత్తలు విడనాడాలని సంవత్సరం క్రితం ఇదే కాలమ్ (ఆగస్టు 24, 'విశ్వమిత్ర భారత్‌కే ఇరుగు పొరుగు బలిమి')లో రాసిన వ్యాసంలో నేను వాదించాను. 'Nepal in the Long 1950s' చదివిన తరువాత ఆ వాదనకు ఇలా ముక్తాయింపు ఇవ్వదలిచాను: ఇరుగు పొరుగు దేశాల గురించి మరింత విస్తృతంగా, సమగ్రంగా మనం అధ్యయనం చేయాలి. తద్వారా, ఆర్థిక, విదేశాంగ విధాన ప్రయోజనాలతో సంబంధం లేకుండా భారతదేశమూ, భారతీయులూ విశేషంగా లబ్ధి పొందుతారు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

# మన కాలపు 'కల్చరల్ కమాండర్'

తెలుగు సాంస్కృతిక రంగాన్ని బహుజన విముక్తి దిశగా పదునెక్కించిన ప్రజావాగ్గేయకారుల్లో ముందువరసలో నిలిచే పేరు మాస్టార్జీ. తన ఏడుపదుల జీవితంలో అరవయ్యేళ్లను కళకే అంకితం చేసిన సాంస్కృతిక సేనాని. ఎర్రజెండా పాటకు దీటుగా బహుజన పాటను నిలబెట్టాడు మాస్టార్జీ. తెలుగు సమాజంలో లక్షలాదిమందికి బహుజన సోయిని అందించిన మహావాగ్గేయకారుడు. మూలాల్లోకి వెళ్లి, ఆ చరిత్రనంతా వందలాది పాటల్లోకి ఎక్కించి బహుజన రాజకీయాలు బోధించినవాడు. మూలవాసీ సిద్ధాంతాన్ని యాభై యేళ్ల క్రితమే తెలుగు నేలకు పరిచయం చేసిన దార్శనికుడు. విప్లవోద్యమ పాట పెద్దయెత్తున వెలువడుతున్న కాలంలో మాస్టార్జీ మాత్రం అంబేడ్కరిస్ట్ సాంస్కృతిక ఉద్యమానికి పునాదులు వేశాడు. నలుగురు నడిచే దారుల్లో ఎవ్వరైనా నడవగలరు. అలా కాకుండా కొత్త తొవ్వ వేయడం అందరి వల్లా కాదు. అలాంటి ప్రత్యేకతను కలిగినవాడు మాస్టార్జీ. ఆయన పాటందుకుంటే అందులో బహుజన రాజకీయ పాఠమే ఉంటుంది తప్ప, అలరించే నిష్ప్రయోజనత ఉండదు.

నలుగురు నడిచే దారుల్లో ఎవ్వరైనా నడవగలరు. అలా కాకుండా కొత్త తొవ్వ వేయడం అందరివల్లా కాదు. అలాంటి ప్రత్యేకతను కలిగినవాడు మాస్టార్జీ. ఆయన పాటందుకుంటే అందులో బహుజన రాజకీయ పాఠమే ఉంటుంది తప్ప, అలరించే నిష్ప్రయోజనత ఉండదు. అణగారిన బాధితుల పక్షాన నిజమైన ప్రజాస్వామికవాది ఆయన.

మాస్టార్జీ అసలు పేరు గంగాధరి శ్రీరాములు. తెలుగు నేల మీద చెరగని ప్రభావాన్ని వేసిన సాంస్కృతిక అధ్యాయం జననాట్యమండలి. దాని కళాకారులకు 'రగల్ జెండా' బ్యాలే, దీపారాధన, బాంగ్డా వంటి డ్యాన్సులు నేర్పడానికి మాస్టర్‌గా వెళ్లాడు. అట్లా ఆయనను అందరు మాస్టార్జీగా సంబోధించడంతో, అదే పేరు స్థిరపడిపోయింది. 1952 సెప్టెంబర్ 7న సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని బొల్లారంలో సాధారణ మాదిగ కుటుంబంలో సత్యమ్మ, రాజయ్య దంపతులకు జన్మించాడు. తండ్రి రాజయ్య కూడా వీధి భాగవతం చెప్పేవాడు. ఆ ప్రభావం మాస్టార్జీపైన చిన్ననాడే పడింది. ఇక తన మేనత్త చంద్రమ్మ పాడే జానపద పాటలు కూడా మాస్టార్జీని కళాకారునిగా తీర్చిదిద్దాయి. తన ఏడవ ఏటనే పాటలు రాసే పని మొదలుపెట్టాడు.

తెలుగు సమాజంలో విప్లవ గాలులు వీచడం మొదలయ్యాయి. అయినా సరే మాస్టార్జీ మాత్రం అంబేడ్కర్ మార్గంలో తన పయనాన్ని కొనసాగించాడు. అందుకు కారణం కులవివక్ష పట్ల ఆయనకు చిన్ననాటి నుంచి తీవ్ర వ్యతిరేకత ఉండడమే. మరోవైపు ఉత్తర భారతాన 1970వ దశకంలో బిహార్‌లోని బెల్చీలో 12 మంది దళితులను ఠాకూర్లు ఊచకోత కోశారు. అలాగే 1975లో భగల్పూర్ జైలులో నలుగురు దళితుల కళ్లు పీకేశారు. ఈ రెండు సంఘటనలు మాస్టార్జీపై తీవ్ర ప్రభావం చూపాయి. దళితుల విముక్తి జరగాలంటే కులనిర్మూలన జరగాలని నిర్ణయించుకున్నాడు ఆయన. అలా ఇప్పటికీ సుమారు 400లకు పైగా పాటలు రచించి బహుజనులను ఆలోచింపజేశాడు.



ఈ నేపథ్యంలోనే మాస్టార్జీ రాసిన 'అందుకో దండాలు... బాబా అంబేడ్కరా' పాట తెలుగు నేల దశదిశలకూ వ్యాపించింది. ఎక్కడ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరిగినా ఇప్పటికీ వినపడుతూ ఆ పాట చరిత్రను సృష్టించింది. అందుకే అది అనతి కాలంలోనే ఎనిమిది భారతీయ భాషల్లోకి సైతం అనువాదం అయ్యింది. ఈ క్రమంలో మాస్టార్జీ పేరు ఉమ్మడి రాష్ట్రంలో మార్మోగింది. అది కేవలం భారతదేశం వరకే ఆగిపోలేదు. 2001లో దక్షిణాఫ్రికాలో జరిగిన డర్బన్ సదస్సులో మాస్టార్జీ పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ సదస్సులో నల్లజాతి ప్రజలపైన మాస్టార్జీ ఆశువుగా రాసిన పాటే 'బ్లాక్ ఈజ్ బ్యూటీ'. ఈ పాటకు ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులంతా పులకించిపోయారు. అలాగే 2011లో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో సైతం విదేశీయులను మైమరపింపజేసింది మాస్టార్జీ పాట.

కళ ద్వారా బహుజనులను మేల్కొల్పాలని సంకల్పించాడు మాస్టార్జీ. అట్లా 1977లో విశ్వజన కళామండలిని స్థాపించాడు. ఇక సాహిత్యం వల్ల ప్రజల్లో కలిగే మార్పును ముందే గుర్తించాడు ఆయన. అందుకే తాను పాటల వరకే పరిమితం కాలేదు. తనలో ఆడి, పాడే కళ ఉంది. దానిని సానబెట్టి అనేక నృత్య రూపకాలు రచించి ప్రదర్శించాడు. వాటితో పాటు ప్రజలను ఆలోచింపజేయడానికి నాటకం మంచి వాహకమని నమ్మాడు. అందుకే "రిక్షా రాజయ్య, స్కోరెంత?, అఖండ విప్లవజ్యోతి అంబేడ్కర్, ఇందాకటిది ఉందా?, ఈ పిచ్చికి పేరు పెట్టండి, వంద గొంతులు వెయ్యి డప్పులు, ఔను మల్లా (వీధి నాటకం), కాముడు, అమ్మా..ఆవు" వంటి నాటికలు రచించి, ప్రదర్శించాడు. మట్టిపూలు అనే కవితా సంపుటిని ప్రచురించాడు. ఇక 'గుర్తుకొస్తున్నాయి' కథా సంపుటితో పాటు, అనేక పాటలను వివిధ సందర్భాల్లో పుస్తకాలుగా, సీడీలుగా వెలువరించాడు.

అంబేడ్కర్ అన్నట్టు "చరిత్ర తెలియనివారు చరిత్రను సృష్టించలేరు". అందుకే బహుజనులకు వారి చరిత్రను తెలియజేసేందుకు పాటను ఒక వాహికగా మార్చుకున్నాడు మాస్టార్జీ. పాట ద్వారా రాజకీయాలు బోధించాలనే సోయి ఆయనలో మెండుగా ఉంది. మనం ఎక్కడి నుంచి వచ్చాం, ఎటు పయనిస్తున్నాం, ఇప్పుడు మనమున్న ఈ దుస్థితికి చరిత్రలో ఎక్కడ మోసం జరిగిందో పాటలోనే విడమరిచి చెప్పడంలో మాస్టార్జీ నిష్ణాతుడు. అందుకే ఆయన లక్షలాదిమంది బహుజనులను ఆలోచింపజేయగలిగాడు. అంతేకాదు మాస్టార్జీ మూలవాసీ సిద్ధాంతాన్ని తెలుగు నేలకు పరిచయం చేశాడు. చరిత్రను బహుజన కోణంలో స్పృశించాడు. ఎర్రజెండా పాటకు దీటుగా బహుజన పాటను సృజించాడు. ఇట్లా తన కాలంలో ముందుకు వచ్చిన ప్రతీ ఉద్యమానికి పాటల మద్దతు తెలియజేశాడు. అణగారిన బాధితుల పక్షాన నిజమైన ప్రజాస్వామికవాదిగా నిలిచాడు.

■ డా. పసునూరి రవీందర్
తెలంగాణ సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యులు

(రేపు రవీంద్ర భారతిలో మాస్టార్జీ జన్మదినం, ఆయన స్థాపించిన విశ్వజన కళామండలి 49వ వార్షికోత్సవం)

## 'రైతునేస్తం' అవార్డు దరఖాస్తులకు ఆహ్వానం

'రైతునేస్తం' 21వ వార్షికోత్సవం సందర్భంగా సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త 'పద్మశ్రీ' పురస్కృతులు స్వర్గీయ డా. ఐ.వి. సుబ్బారావు పేరిట వ్యవసాయ, అనుబంధ రంగాలలో విశేష సేవలందిస్తున్న శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ అధికారులతో పాటు అగ్రి ఇన్నోవేషన్స్‌ను అవార్డులతో సత్కరించనున్నారు. ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకునేవారు 'రైతునేస్తం' వెబ్‌సైట్ https://rythunestham.in/awards నుంచి అప్లికేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, దాన్ని పూరించి, దానికి వారి పరిశోధనా వ్యాసాలను, సాగు అనుభవాలను జతపరచి సెప్టెంబర్ 15వ తేదీలోగా 'ఎడిటర్, రైతునేస్తం, 6–2–959, దక్షిణ భారత హిందీ ప్రచారసభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్–500004. ఫోన్: 96767 97777 (లేదా) 'రైతునేస్తం', డోనెం. 8–198, పుల్లడిగుంట దగ్గర, కొర్నెపాడు పోస్టు, వట్టిచెరుకూరు మం., గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522017, ఫోన్: 97053 83666 చిరునామాలకు పంపగలరు లేదా editor@rythunestham.inకు ఇ-మెయిల్ చేయవచ్చు. రెండు తెలుగు రాష్ట్రాలవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే.

– యడ్లపల్లి వేంకటేశ్వరరావు
ఛైర్మన్, రైతునేస్తం ఫౌండేషన్



మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని వన్‌టౌన్ పంజా సెంటర్‌లో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ కేశినేని చిన్ని, టీడీపీ ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ తదితరులు పాల్గొన్నారు. ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 6



## ప్రతిభకు పురస్కారం

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఎ.కన్వెన్షన్ హాల్లో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో కలిసి సీఎం చంద్రబాబు.. ఉపాధ్యాయులు, అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకుంటున్న జిల్లాకు చెందిన గొల్లేరు శ్రీనివాసరావు (నిడమానూరు ఎంపీ స్కూల్), బీవీ శ్రీధర్‌బాబు (నరసాపురం జెడ్పీహెచ్ఎస్), జీజే దేవరాజ్ (విస్సన్నపేట ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్), కె.నరసింహారావు (విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజీ), ఎన్.లక్ష్మి (విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ), జి.దుర్గాదేవి (విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ), ఎస్.సాంబశివరావు (ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ కాలేజీ), కోపూరి అరుణ(విజయవాడ ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కాలేజీ) - విజయవాడ సిటీ



పెద్దవరం సహకార సంఘం భవనం

# పెద్దవరం సొసైటీలో పెద్దమాయ

## ఆడిట్‌లో బయటపడుతున్న నిజాలు

- రుణాల చెల్లింపులు, రసీదుల్లో అక్రమాలు
- రూ.లక్షకు రూ.10 వేలే చెల్లింపులు
- నకిలీ రసీదులిచ్చి.. రైతులను మభ్యపెట్టి..
- సొసైటీ కార్యదర్శి సస్పెన్షన్
- పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు తేలే అవకాశం

నందిగామ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నందిగామ మండలం పెద్దవరం సహకార సంఘంలో రూ.కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన ఆడిట్‌లో కొంతమేర అవినీతి బయటపడింది. ఈ అవినీతిపై ఆడిట్ అధికారులు బ్యాంక్‌కు నివేదిక ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సుమారు 20 మంది రైతులు ఒక్కసారిగా సొసైటీ వద్దకు వెళ్లి తమ రుణాలను పరిశీలించుకున్నారు. తాము చెల్లించిన సొమ్ముకు, జమైన సొమ్ముకు తేడా ఉండటం గమనించి విస్మయం చెందారు. లక్ష రూపాయల రుణానికి రూ.10 వేలే జమచేసిన అధికారులు రూ.లక్షకు నకిలీ రసీదులు ఇచ్చినట్లు స్పష్టమైంది. బాధ్యులపై చర్యలు తీసుకోనీయకుండా కేడీసీసీ అధికారులపై గత పాలకులు కొందరు ఒత్తిడి తెచ్చినట్లు విమర్శలు వస్తున్నాయి. తాము చెల్లించిన సొమ్ము విషయంపైనా, నకిలీ రసీదులపైనా ఉన్నతాధికారులెవరూ కనీస భరోసా కోసం ప్రకటనలు చేయకపోవడం రైతుల్లో అసహనాన్ని కలిగించింది. నెలలు గడుస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడంతో కొందరు రైతులు నేరుగా సీఈవోకు, డీజీఎం, ఏజీఎంకు ఫోన్లు మిగతా 6లో..



# విహంగామా

## గన్నవరం విమానాశ్రయంలో పక్షులతో ఇబ్బందులు

## విమానాల ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో అడ్డుగా..

- చెత్తకుప్పలతో నిండిపోతున్న ఎయిర్‌పోర్టు పరిసరాలు
- వర్షపు నీరు నిల్వ ఉండి.. చెరువులుగా మారి..
- భారీగా తరలివస్తున్న పెద్ద సైబీరియా పక్షులు
- బోర్డులు పెట్టి చేతులు దులుపుకొన్న పంచాయతీ
- గురువారం ఎయిరిండియా విమానానికి తప్పిన ప్రమాదం



విమానాశ్రయం ప్రహరీ వద్ద చెరువుగా నిలిచిపోయిన వర్షపు నీరు (ఇన్‌సెట్‌లో) జాతీయ రహదారి పక్కన వ్యర్థాలు

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో విహంగాలు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ఎయిరుపోర్టు చుట్టుపక్కల వ్యర్థాలు పేరుకుపోవడం, వర్షపు నీరు.. చెరువుల మాదిరిగా నిల్వ ఉండటం, వాటిలో చేపలు పెరుగుతుండటంతో పక్షులు భారీగా వస్తున్నాయి. విమాన టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో ఎదురుగా వస్తున్నాయి. విమానాశ్రయ చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేయించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో వందలమంది ప్రయాణికుల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : గన్నవరంలోని విజయవాడ విమానాశ్రయం నుంచి విమానాలు టేకాఫ్, ల్యాండింగ్ చేయడానికి పైలెట్లు భయపడాల్సి వస్తోంది. ఎక్కడ పక్షులు ఢీకొంటాయేమోనని ఆందోళన చెందాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో విమానాశ్రయం రన్‌వే పరిధిలో పక్షులు ఎగరటం పరిపాటిగా మారింది. పక్షుల కారణంగా విమానాలు ల్యాండింగ్ కాకుండా ఆకాశంలోనే చక్కెర్లు కొట్టిన ఉదంతాలు కూడా ఉన్నాయి. గురువారం ఓ పక్షి ఢీకొనడంతో ఏకంగా విమాన సర్వీసే రద్దయ్యింది.


### ఎయిర్‌పోర్టు అధికారుల వినతులు పట్టించుకోరా?

ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నప్పటి నుంచే ఈ సమస్యను గుర్తించిన ఎయిర్‌పోర్టు అధికారులు ఆ చుట్టుపక్కల ఆహార వ్యర్థాలను మిగతా 6లో..

### విమానాశ్రయం చుట్టూ ఆహార వ్యర్థాలు, చెత్తాచెదారం

విమానాశ్రయం చుట్టూ ఆహార వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ఎక్కువగా వేస్తున్నారు. ఎయిర్‌పోర్టు నాలుగువైపులా గన్నవరం, దావాజీగూడెం, అల్లాపురం, బుద్దవరం, అజ్జంపూడి, కేసరపల్లి పంచాయతీలు ఉన్నాయి. ఈ ఆరు గ్రామాల పరిధిలోని పంచాయతీ పాలకవర్గాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయి. గన్నవరం పంచాయతీ పనితీరైతే ఘోరంగా ఉంది. రోడ్లపై చెత్తకుండీలు, పక్కనే వ్యర్థాలు ఉంటున్నాయి. గన్నవరంలోని హోటళ్ల నిర్వాహకులు, కొబ్బరిబొండాల దుకాణాలవారు, కూరగాయలు విక్రయించేవారు, మాంసం షాపులవారు తమ దగ్గర ఉన్న వ్యర్థాలన్నింటినీ గన్నవరం చివర.. అంటే విమానాశ్రయానికి సమీపంలో ఎన్‌హెచ్-16 పక్కనే డంప్ చేస్తున్నారు. ఆహార వ్యర్థాలతో పాటు దుకాణాల్లోని చెత్తాచెదారం అంతా కూడా ఇక్కడే డంప్ అవుతోంది. దీంతో కాకులు, కొంగలు, ఇతర పక్షులు ఆహారం కోసం వస్తున్నాయి. పక్షుల సంచారం వల్ల విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌కు సమస్య ఏర్పడుతోంది. విమానాలు ల్యాండ్ అయ్యే ముందు, టేకాఫ్ అయ్యే సమయంలో పక్షులు ఉంటే పారిపోవటానికి వీలుగా బాంబులు పేలుస్తారు. కానీ, ఇటీవల కాలంలో సైబీరియా నుంచి కొంగలు వస్తున్నాయి. ఇవి శబ్దాలకు పారిపోవట్లేదు.

ఇంద్రకీలాద్రిపై దొంగలు ఎక్కువగా సంచరించే ప్రాంతం



# కొండంత నిఘా

## దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రి చుట్టూ సీసీఎస్ భద్రత

- నేరాల కట్టడికి ప్రణాళిక సిద్ధం చేసిన పోలీసులు
- కొండ చుట్టూ 35 హాట్‌స్పాట్ల గుర్తింపు
- గత ఉత్సవాల కంటే పెరిగిన పాయింట్లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దసరా శరన్నవ రాత్రుల్లో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వచ్చేవారు భక్తులైతే.. దర్శనానికి వచ్చినట్టుగా వ్యవహరిస్తూ చేతివాటాలు చూపించేవారు దొంగలు. భక్తుల హడావిడిని అవకాశంగా మార్చుకుని కనిపించిన వస్తువులను మాయం చేస్తుంటారు. వారికి అడ్డుకట్ట వేయడానికి సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్) అధికారులు ప్రణాళిక రూపొందించారు. అందుకు అనుగుణంగా రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇంద్రకీలాద్రి చుట్టుపక్కల మొత్తం 35 హాట్‌స్పాట్లను అధికారులు గుర్తించారు. గత శరన్నవ రాత్రుల్లో గుర్తించిన హాట్‌స్పాట్ల కంటే ఈ ఏడాది వాటి సంఖ్య పెరిగింది. గతంలోని ఘటనలను బేరీజు వేసుకుని ఈ పాయింట్లను పిన్ చేశారు.

### వినాయకుడి ఆలయం నుంచి..

ఈ ఉత్సవాల్లో కెనాల్‌రోడ్డులోని వినాయకుడి ఆలయం నుంచి క్యూలైన్లు ప్రారంభమవుతాయి. ఈ లైన్లలో వెళ్లిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మిగతా 6లో..



పాత వే బిల్లులతో చోడవరం స్టాక్‌యార్డు నుంచి తరలిస్తున్న ఇసుక

# ఇసుక మేత

## ఇసుక స్టాక్ పాయింట్లలో యథేచ్ఛగా దందా


### కృష్ణానదిలో అక్రమ తవ్వకాలు.. సొంత పాయింట్లకు తరలింపు

- ఎక్కడికక్కడ ప్రైవేట్ పాయింట్ల ఏర్పాటు.. కొన్నిచోట్ల డంప్
- అధికారులను ప్రసన్నం చేసుకుని ఇష్టానుసారంగా అక్రమాలు
- నిబంధనలు పట్టించుకోరు.. ఎన్‌జీటీ ఆదేశాల ఊసెత్తరు..!
- అధికార స్టాక్ పాయింట్ల నుంచి పాత వే బిల్లులతో రవాణా
- క్యూఆర్ కోడ్‌తో గుట్టురట్టు అవుతున్నా పట్టని యంత్రాంగం

నిబంధనలను పట్టించుకోరు.. ఎన్‌జీటీ ఆదేశాలున్నా లెక్కచేయరు.. అక్రమంగా మైనింగ్ చేయటం.. సొంత స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసుకోవటం.. సొంత ధరలను నిర్ణయించటం.. ప్రభుత్వ స్టాక్ పాయింట్లను చెరబట్టి పాత వే బిల్లులతో ఇసుక అక్రమ వ్యాపారం సాగించడం.. కృష్ణాజిల్లాలో చోటుచేసుకుంటున్న ఇసుక అక్రమాలివి. అధికార యంత్రాంగాలను మంచి చేసుకుని అక్రమార్కులు సాగిస్తున్న ఈ అరాచకాలు నేడు శ్రుతిమించుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణాజిల్లాలో ప్రస్తుతం చోడవరం, మద్దూరు, నార్త్ వల్లూరు, రొయ్యూరు (2), పటమటలంక, శ్రీకాకుళం.. ఇలా ఏడుచోట్ల అధికారికంగా ఇసుక స్టాక్ పాయింట్లు నిర్వహిస్తున్నారు. తోట్లవల్లూరు మండల పరిధిలో మాత్రం ఇసుక అక్రమాలు భారీగా జరుగుతున్నాయి. కృష్ణానదిలో వరదలకు ముందు భారీగా ఇసుకను తోడారు. ఈ ఇసుకను రొయ్యూరు, వల్లూరుపాలెంలోని ప్రైవేట్ ప్రాంతాల్లో పెద్ద మిగతా 6లో..

# తారాతీరం




## విజయవాడ ఉత్సవ్‌లో సినీ సందడి

- పున్నమిఘాట్‌లో ప్రత్యేక కార్యక్రమాలకు ప్రణాళిక
- ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు మెగా ఈవెంట్స్
- చిరంజీవి, బాలకృష్ణ, పవన్ కల్యాణ్ సినిమా ఫంక్షన్లు
- ప్రముఖ సంగీత దర్శకులు, గాయకులతో మ్యూజిక్ మజా
- మిస్ విజయవాడ, మారథాన్, కృష్ణానదిలో పడవ పోటీలు
- ప్రకాశం బ్యారేజీపై క్రాకర్స్ ఫైరింగ్, సోషల్ మీడియా అవార్డ్స్




(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరా ఉత్సవాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించే 'విజయవాడ ఉత్సవ్'లో తారలు తళుక్కుమననున్నారు. ఈ ఉత్సవ్‌లో అగ్ర కథానాయకుల మూవీ ఈవెంట్స్ జరగనుండటం విశేషం. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా పాటల లాంచ్ ఈ ఈవెంట్‌లో జరగనుంది. అలాగే, యువరత్న బాలకృష్ణ నటిస్తున్న అఖండ-2 సాంగ్ లాంచ్, పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న 'ఓజీ' ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా దసరా ఉత్సవ్‌లో మిగతా 6లో..

### ఆకట్టుకునే ఈవెంట్స్ ఎన్నో..

నగరంలోని కాలేజీ యువతులకు 'మిస్ విజయవాడ' పోటీలు జరగనున్నాయి. 'విజయవాడ ఐడల్' పేరుతో సంగీత కార్యక్రమాలు, 'విజయవాడ ప్రీమియర్ లీగ్' పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు. విజయవాడ మారథాన్, మెగా యోగా, హస్తకళాఖండాల పోటీలు జరుగుతాయి. ఇవికాకుండా అగ్ని అవార్డులు, సోషల్ మీడియా అవార్డులు ప్రత్యేకం.

### పున్నమిఘాట్‌లో కార్యక్రమాలు

పున్నమిఘాట్, గొల్లపూడి, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాలలో 'విజయవాడ ఉత్సవ్' కార్యక్రమాలు జరగనున్నాయి. పున్నమిఘాట్‌లో దేవీ పెండాల్, డ్రోన్ షో, దాండియా అరీనా, హస్తకళల స్టాల్, సెల్ఫీ బూత్ ఏర్పాటు చేస్తారు. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. వాటర్ స్పోర్ట్స్‌లో భాగంగా పడవల పోటీలు, ప్రకాశం బ్యారేజీ దగ్గర బాణాసంచా పేలుళ్లు, గీతామాధురి లైవ్‌బ్యాండ్, సందీప్ నారాయణ్ కార్యక్రమాలు ఉంటాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాలలో 11 రోజుల పాటు అన్‌లిమిటెడ్‌గా క్లాసికల్ డ్యాన్సులు, నాటకాలు, బుర్రకథలు, ప్రముఖుల ప్రవచనాలు, లోకల్ టాలెంట్ క్లాసికల్ డ్యాన్సులు, లోకల్ టాలెంట్ కల్చరల్ కార్యక్రమాలు, యంగ్ కిడ్ డ్రమ్స్ వంటివి నిర్వహిస్తారు.

# మత్తు మూలం తీయండి

## ఇన్‌స్పెక్టర్లకు సీపీ ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మాదకద్రవ్యాలను కొంటున్న వారికే కాకుండా వాటిని సరఫరా చేస్తున్న చేతులకూ సంకెళ్లు వేయాలని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. కొనుగోలుదారులు, వారితో సంబంధాలు ఉన్నవారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాక దర్యాప్తును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపొద్దని స్పష్టం చేశారు. డ్రగ్‌ను తీసుకెళ్తూ దొరికిన వారితో పాటు ఇచ్చిన వారినీ బోనులో నిలబెట్టాలన్నారు. కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లతో శుక్రవారం ఆయన సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అజ్ఞాతవాసులు' కథనంపై చర్చించారు. ఇప్పటి వరకు నమోదైన డ్రగ్ కేసుల్లో అసలు మూలాలను బయటకు తీసుకురావాలని సంబంధిత ఇన్‌స్పెక్టర్లను, టాస్క్‌ఫోర్స్ అధికారులను ఆదేశించారు. కథనాన్ని చదువుతూ దానికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించినట్టు తెలిసింది. డ్రగ్స్ తయారీదారులు సిమ్‌లు మార్చి సాగిస్తున్న వ్యాపారంపైనా సీపీ చర్చించారు. అన్ని మార్గాల్లోనూ దర్యాప్తు చేయాలని ఆదేశాలిచ్చారు. ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.



## అడవి అందాలు చూసొద్దాం..

- కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు సందర్శకుల తాకిడి
- కనువిందు చేస్తున్న జలపాతాలు

6

## రాంగ్ టర్న్..!

- జాతీయ రహదారిపై హెచ్చరిక బోర్డులు లేకుండా యూటర్న్





మూలపాడు నగరవనంలో సందర్శకులు, కొండపల్లి రిజర్వు ఫారెస్టులో జలపాతం, వెదురువనం సమీపంలో నీటి ఊటపాయలో యువత కేరింత

# అడవి అందాలు చూసొద్దాం..

» కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు సందర్శకుల తాకిడి

» కనువిందు చేస్తున్న జలపాతాలు » సెలవు రోజుల్లో సందడే సందడి

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి)

నిత్యం బిజీ బిజీగా గడిపే నగరప్రజలు మూలపాడు నగరవనంలోని, కొండపల్లి రిజర్వు ఫారెస్టు అందాలను చూసేందుకు క్యూ కడుతున్నారు. సెలవు రోజుల్లో, పండుగల వేళ సందర్శకులు పెద్దఎత్తున మూలపాడు నగరవనం, కొండపల్లి ఖిల్లా తదితర పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. ఇక్కడ సహజసిద్ధంగా ఉన్న జలపాతాలు సందర్శకులకు కట్టిపడేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొండపల్లి రిజర్వు ఫారెస్టులో పలుచోట్ల జలపాతాలను తిలకించేందుకు వస్తున్న యువత, చిన్నారులు పచ్చిన వనంలో స్వచ్ఛమైన నీటిలో కేరింతలు కొడుతున్నారు. పర్యాటకులను వెదురువనం అందాలు అలరిస్తున్నాయి. పార్క్‌లో ఆట వస్తువులు పిల్లలు, పెద్దలను ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన నెమలి బొమ్మ పార్కుకే కొత్త అందాలను అద్దింది. మొత్తం మీద సెలవు రోజుల్లో పలు పాఠశాలల విద్యార్థులతో ఉపాధ్యాయులు వచ్చి పార్క్‌లో ఎంజాయ్ చేస్తున్నారు. సందర్శకులను ఆకర్షించేందుకు పర్యాటక, అటవీ శాఖ అధికారులు నగరవనాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.





ఏపీ, టీఎస్ రాష్ట్రాల ప్రధాన ఆదాయపు పన్ను కమిషనర్ అనిల్ కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

## దుర్గమ్మ సేవలో ఆదాయపు పన్ను కమిషనర్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రధాన ఆదాయపు పన్ను కమిషనర్ ఎం.అనిల్‌కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో వీకే శీనానాయక్ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆయనకు ఆశీస్సులు.. లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.



మిలాద్ ఉన్ నబి ఊరేగింపులో పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని, బుద్దావెంకన్న, ఫతావుల్లా, ఎంఎస్ బేగ్ తదితరులు

## మహ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శం

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త జీవితం సర్వమానవాళికి ఆదర్శమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు (మిలాద్ ఉన్ నబి) పురస్కరించుకుని వన్‌టౌన్ పంజా సెంటర్‌లో జరిగిన వేడుకల్లో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలందరూ కులమతాలకు అతీతంగా మత సామరస్యం పాటిస్తూ అన్ని పండగలు చాలా ఘనంగా నిర్వహించుకుంటారన్నారు. మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. అనంతరం పంజా సెంటర్ నుంచి కాశేశ్వరరావు మార్కెట్ సమీపంలోని మసీదు వరకు ఊరేగింపులో ఎంపీతో పాటు టీడీపీ ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, ఎంఎస్ బేగ్, ఎండీ ఫతావుల్లా, ముస్లిం మతపెద్దలు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రణభేరి

గవర్నర్‌పేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఎంజీ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రణభేరి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రణభేరి కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులను పోరాటానికి సిద్ధం చేసి సెప్టెంబరు 25న విజయవాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 5 దళాలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సన్నద్ధం చేసే కార్యక్రమానికి యూటీ ఎఫ్ శ్రీకారం చుట్టిందన్నారు. ఈనెల 25న వేలాది మంది ఉపాధ్యాయులను సమీకరించి విజయవాడలో బహిరంగ సభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేటమ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## పాలసీలపై జీఎస్టీ రద్దును స్వాగతిస్తున్నాం

» ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్

గవర్నర్‌పేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలపై 18 శాతంగా ఉన్న జీఎస్టీని రద్దు చేస్తూ కౌన్సిల్ సమావేశం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ బాబు అన్నారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దశాబ్దకాలంగా అసోసియేషన్ చేసిన పోరాటం విజయం సాధించిందన్నారు. జీఎస్టీ రద్దు కోరుతూ ఇన్సూరెన్స్ ఉద్యోగులు లక్షలాది పాలసీదారుల సంతకాలను సేకరించి ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు అందజేశారని తెలిపారు. ఇన్సూరెన్స్ వ్యాప్తికి దోహదపడే విధంగా ప్రభుత్వ నిర్ణయాన్ని యూనియన్ స్వాగతిస్తోందన్నారు. సమావేశంలో యూనియన్ సహాయ కార్యదర్శి ఎన్ఎంకె. ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఈవీ తులసీరావు, సిహెచ్ కళాధర్, డి. వాసు, పి. కృష్ణ, ఎంఎస్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడి మండపాన్ని సందర్శించిన చలసాని ఆంజనేయులు

## వెల్లివిరిసిన మతసామరస్యం

» గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో ముస్లిం కుటుంబం

(ఆంధ్రజ్యోతి, ఘంటసాల) : అన్ని మతాల సారాంశం ఒక్కటే అన్న భావనతో ఐక్యతను చాటుకుంటున్నారు కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబం. హిందువుల పూజలు చేస్తూ అందరి మన్ననలు పొందారు. గ్రామానికి చెందిన షేక్ అక్బర్ బాషా, భార్య షర్మిల కుమారుడు హుస్సేన్‌లు వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేసి భక్తి భావాన్ని చాటుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో గణనాథునికి తొమ్మిది రోజులుగా పూజలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందారు. షేక్ అక్బర్ బాషాను కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ప్రవాస భారతీయులు గొర్రెపాటి రంగనాథ్‌బాబులు అభినందించి సత్కరించారు.

# రాంగ్ టర్న్..!



హైదరాబాద్-విజయవాడ యూటర్న్ తీసుకుని వెళుతున్న వాహనం

» జాతీయ రహదారిపై హెచ్చరిక బోర్డులు లేకుండా యూటర్న్

» ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని స్థానికుల ఆందోళన

» వెంటనే యూటర్న్ మూసేయాలని విజ్ఞప్తి

(జగ్గయ్యపేట రూరల్, ఆంధ్రజ్యోతి)

జాతీయ రహదారిపై అంతర్రాష్ట్ర సరిహద్దు గరికపాడు వద్ద యూటర్న్ ప్రమాదకరంగా ఉన్నా ఆర్ అండ్‌బీ అధికారులు, స్థానిక పోలీసులు పట్టించుకోకపోవటంపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రహదారిని ఆరు వరుసలుగా విస్తరిస్తున్న నేపథ్యంలో సూర్యాపేట జిల్లా రామాపురం క్రాస్ రోడ్డు వద్ద నూతనంగా ఫ్లై ఓవర్ నిర్మిస్తుండటంతో తెలంగాణ, ఆంధ్రలోని పలు ప్రాంతాలకు వెళ్లే రహదారిని మూసేశారు. ఈ నేపథ్యంలో అటుగా వెళ్లే వాహనాలు రాష్ట్రంలోకి వచ్చి అనధికారికంగా ఏర్పాటు చేసిన యూటర్న్ వినియోగిస్తుండటంతో హైదరాబాద్-విజయవాడ వైపు వచ్చే వాహనాలతో పాటు విజయవాడ-హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది. గతేడాది పాలేటికి వరదలు వచ్చినప్పుడు హైదరాబాద్-విజయవాడ రోడ్డుమార్గంలో బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు కోతకు గురవటంతో రెండో బ్రిడ్జిపై నుంచి వాహనాలు రాకపోకలు సాగించాయి. ఆ సమయంలో జరిగిన ప్రమాదంలో తల్లీ కుమారుడు మృతి చెందటంతో అధికారులు యుద్ధప్రాతిపదికన డివైడర్ తొలగించి యూటర్న్ ఏర్పాటు చేశారు. బ్రిడ్జి పూర్తయినా యూటర్న్‌ను మూయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఆంధ్ర-తెలంగాణలోని వివిధ సిమెంట్ కార్మాగారాలు, చిన్న కర్మాగారాలకు హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు గరికపాడు వద్దనున్న యూటర్న్ తీసుకుని తెలంగాణలోకి వెళ్తుండటంతో రెండు వైపులా ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి యూటర్న్ మూసేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూటర్న్‌ను మూసి 500 మీటర్ల దూరంలోని తక్కెళ్లపాడు ఫ్లై ఓవర్ కిందగా వచ్చి వెళ్లేలా చూడాలని వారు కోరుతున్నారు.



విజయవాడ-హైదరాబాద్ రహదారిలో యూటర్న్

# తారాతీరం

(5వ పేజీ తరువాయి)

ప్రధాన ఆకర్షణ కానుంది. నటుడు సిద్దూ నటించిన 'తెలుసు కదా' మూవీ టీమ్ ఈ ఉత్సవ్‌ను సందర్శించనుంది. వీటితో పాటు ఆహా నిర్వహిస్తున్న 'తెలుగు ఇండియన్ ఐడల్' కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించటానికి సంగీత దర్శకుడు తమన్, గాయకుడు కార్తీక్ రానున్నారు. అలాగే, గాయనీ గాయకులు శంకర్ మహదేవన్, ఆర్పీ పట్నాయక్, సునీత, గీతామాధురి, రాహుల్ సిప్లిగంజ్, రోల్ రిడా, సమీరా భరద్వాజ్, చిన్మయి, కృష్ణ, రమ్య బెహరా, దామిని, హారిక, రోహిత్ సందడి చేయనున్నారు. ర్యాప్ మ్యూజిక్ కోసం కాప్రికో మ్యూజిక్ బ్యాండ్ రానుంది. వాటర్ అండ్ కేరళ డ్రమ్స్ మ్యూజిక్ ట్రూప్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

### ఉత్సవ్ లోగో సిద్ధం

విజయవాడ ఉత్సవ్ లోగో ఖరారైంది. నిర్వాహక కమిటీ శుక్రవారం దీనిని విడుదల చేసింది. ఈ ఈవెంట్‌లో ఏమేం ఉంటాయన్న దానిపై రెండు రోజుల్లో భారీగా సన్నాహక ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'వన్ సిటీ.. వన్ సెలబ్రేషన్' అనే క్యాప్షన్‌తో దుర్గమ్మ బంగారు గోపురం, ప్రకాశం బ్యారేజీ చిత్రాలతో లోగోను తీర్చిదిద్దారు.

# కొండంత నిఘా

(5వ పేజీ తరువాయి)

శివాలయం వైపున ఉన్న మెట్లమార్గం నుంచి కనకదుర్గానగర్‌లోకి ప్రవేశిస్తారు. కొండ ఎక్కే ప్రాంతం కంటే దిగే ప్రాంతంలో రద్దీ ఎక్కువ ఉంటుంది. ఇక్కడే అన్నప్రసాద వితరణ జరుగుతుంది. శరన్నవరాత్రులు ఆరంభం రోజే స్థానిక దొంగలు, స్థానికేతర దొంగలు ఇంద్రకీలాద్రి చుట్టూ వాలిపోతారు. కొంత మంది క్యూలైన్లలో నడుచుకుంటూ కొండపైకి వస్తుంటారు. అవకాశం దొరికినప్పుడు భక్తులకు సంబంధించిన ఏదో ఒక వస్తువును మాయం చేస్తారు. పని పూర్తికాగానే క్యూ మధ్యలో నుంచి బయటకు వచ్చేస్తుంటారు. కొంతమంది శివాలయం వైపున ఉన్న మెట్లమార్గం వద్ద కాపుకాసి భక్తులను అనుసరిస్తూ చోరీలు చేస్తారు. గత ఏడాది పోలీసులకు అందిన ఫిర్యాదుల్లో సెల్‌ఫోన్ల చోరీకి సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. నగదుకు సంబంధించినవి రెండో స్థానంలో ఉన్నాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వినాయకుడి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రి వరకు ఒక ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించారు. కుమ్మరిపాలెం వైపు నుంచి పాలఫ్యాక్టరీ, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ వరకు మరో ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించారు. మొత్తం 35 ప్రదేశాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి అక్కడ సీసీఎస్ సిబ్బందిని నియమించడానికి మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఈ పాయింట్లలో సీసీఎస్ సిబ్బందితో పాటు వివిధ జిల్లాల నుంచి బందోబస్తుకు వచ్చిన సిబ్బందిని కేటాయిస్తారు.

## చంద్రగ్రహణం నాడు శివాభిషేకం మంచిదే

» విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో ఆదివారం సంభవించనున్న చంద్రగ్రహణం నాడు అన్ని రాశుల వారు శివాభిషేకం కార్యక్రమంలో పాల్గొనడం మంచిదని వేదపండితుడు విష్ణుభొట్ల సూర్యనారాయణశర్మ తెలిపారు. రాత్రి 9.57కు చంద్రగ్రహణం ప్రారంభమవుతుందని, 11 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం కనబడుతుందని, 11.41కు మధ్యకాలం, 7వ తేదీ రాత్రి 12 గంటలకు విడుపు ప్రారంభమవుతుందని, 8వ తేదీ తెల్లవారుజామున 1.26కు చంద్రగ్రహణం ముగుస్తుందన్నారు. చంద్రగ్రహణ కాలంలో అన్ని రాశుల వారు శివార్చనలు, భగవద్గీత పారాయణలు, విష్ణుసహస్రనామ పారాయణలు చేయడం సముచితమన్నారు.

# పెద్దవరం సొసైటీలో పెద్దమాయ

(5వ పేజీ తరువాయి)

చేశారు. వారి నుంచి సరైన స్పందన రాకపోవడంతో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాంకు, ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్యకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వారిద్దరూ సీఈవోకు ఫోన్ చేసి మండిపడినట్లు సమాచారం. వారి చొరవ మేరకు గురువారం సాయంత్రం పెద్దవరం కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ కేడీసీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

### మా సొమ్ము సంగతేంటి?

కార్యదర్శిని సస్పెండ్ చేయడంతోనే తమ సమస్య పరిష్కారం కాదని, నకిలీ రసీదులపై విచారణ జరిపి తాము చెల్లించిన రుణాలను తీసేయాలని రైతులు కోరుతున్నారు. తమ పేర్లతో ఇంకా ఏమైనా దొంగ రుణాలు ఉన్నాయో లేదోనన్న విషయం నిగ్గు తేల్చాలని కోరుతున్నారు. నకిలీ రసీదులకు బదులుగా నిజమైన రసీదులు తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు మరోమారు సొసైటీని పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

### పాలకవర్గాల ప్రభావంతోనే..

సహకార సంఘాల్లోని పాలకవర్గాల ఆర్థిక క్రమశిక్షణ లేమి వల్లే అధికారులు కూడా అక్రమాలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో సుదీర్ఘకాలంగా కొందరు వ్యక్తులే సహకార సంఘాలకు అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. వారిలో కొందరు సొసైటీ సొమ్మును అనామతుగా తీసుకుని సొంత సొమ్ములా వాడుకుంటున్నారు. ఆ అలుసుతో సిబ్బంది కూడా వారి స్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్నారు.

# విహంగామా

(5వ పేజీ తరువాయి)

అరికట్టాలని, చెత్తకుప్పలను వేయించొద్దని జిల్లా యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు. ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ సమావేశాల్లో కూడా ఈ అంశం చర్చకు దారితీసింది. అప్పట్లో తాత్కాలిక చర్యలు తీసుకున్నా ఆ తర్వాత వదిలేశారు. పంచాయతీలు బోర్డులు ఏర్పాటుచేసి చేతులు దులుపుకొన్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుని విమాన ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### సైబీరియా పక్షులతో సమస్య

గన్నవరం విమానాశ్రయం రన్‌వే ప్రహరీవైపు లోతట్టు ప్రాంతాలు ఉన్నాయి. వర్షాలు కురవటం వల్ల ఇవన్నీ చెరువులుగా మారుతున్నాయి. వాస్తవానికి ఈ నీరు హైవే పక్కన డ్రెయిన్ మార్గంలో కేసరపల్లి మీదుగా సాగుతూ బుడమేరులో కలవాలి. కానీ, డ్రెయిన్ పూడుకుపోవటం, ఆక్రమణల కారణంగా నీరు ఎటూ పోవట్లేదు. అవన్నీ క్రమేణా చెరువులుగా మారుతున్నాయి. వీటిలోని చేపలు తినటానికి సైబీరియా కొంగలు వస్తున్నాయి. ఈ కొంగలు పరిమాణంలో పెద్దగా ఉంటాయి. ఈ వృథా నీటిని మళ్లించేందుకు పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. దావాజీగూడెం, అల్లాపురం, బుద్ధవరం, అజ్జంపూడి గ్రామాల్లో అయితే పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లు జరిగినప్పుడు ఆహార వ్యర్థాలన్నింటినీ రోడ్ల పక్కనే పడేస్తున్నారు. ఫలితంగా విమానాశ్రయ పరిసరాలు పక్షులకు ఆవాసంగా మారుతున్నాయి. గతంలో అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక విమానం ల్యాండ్ అయినపుడు రన్‌వే ప్రహరీ బయట నల్లటి పొగ వ్యాపించింది. చెత్త తగలబడటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది.

# ఇసుక మేత

(5వ పేజీ తరువాయి)

ఎత్తున నిల్వ చేశారు. ఒక రకంగా ఇవి ప్రైవేట్ స్టాక్ పాయింట్లుగా మారాయి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు అక్టోబరు 15 వరకు కృష్ణానదిలో ఇసుకను తోడటానికి వీల్లేదు. అయినా అక్రమార్కులు వరదల ముందు రాత్రిపూట ఎక్స్‌కవేటర్ల ద్వారా భారీగా తవ్వి, టిప్పర్ల ద్వారా ప్రైవేట్ స్టాక్ పాయింట్లకు తరలించారు. చోడవరం, ఐనవూరులో డంప్ ఏర్పాటు చేశారు.

### చర్యలు శూన్యం

కృష్ణానదిలో తవ్వకాలు జరపటం ఒక ఎత్తయితే, అనధికారిక స్టాక్ పాయింట్లు, ఇసుక డంప్‌ల నుంచి భారీగా ఇసుకను తరలించటం మరో ఎత్తు. ఈ వ్యవహారాలు స్థానిక ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు అధికారులకు తెలిసినా మిన్నకుండిపోతున్నారు. ఆయా శాఖలకు వాటాలు వెళ్తుండటం వల్లే ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదన్న ఆరోపణలూ లేకపోలేదు. రొయ్యూరులోని అధికారిక స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను బయటకు తరలిస్తున్నా.. అందులోని పరిమాణంలో మాత్రం పెద్దగా మార్పు ఉండట్లేదు. వందల సంఖ్యలో లారీల్లో తరలిస్తున్న ఇసుకంతా ఎక్కడిది? అనే అనుమానం కలుగుతోంది. వరదలకు ముందే కృష్ణానదిలో అనధికారికంగా తవ్వి ఉండాలి. లేదా వరదలు తగ్గిన ప్రతిసారీ నదిలో తవ్వుతూ అధికారిక పాయింట్‌లో డంప్ చేసి ఉండాలి. లేదా ముందే నిర్ణీత పరిమాణం కంటే ఎక్కువ డంప్ చేసి ఉండాలి. ఈ మూడింటిలో ఏదో ఒకటి కచ్చితంగా జరిగి ఉంటుంది. ఈ వ్యవహారంలో స్థానిక పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారుల హస్తం కూడా ఉండబట్టే ఈ తరహా అక్రమాలు సాధ్యమవుతున్నాయి.

### పాత వే బిల్లులతో..

తోట్లవల్లూరులో కొందరు అక్రమార్కులు ఏకంగా అధికారిక స్టాక్ పాయింట్లనే చెరబట్టారు. పాత వే బిల్లులతో ఇసుకను బయటకు తరలిస్తున్నారు. 2024 నాటి వే బిల్లులు చూపిస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఆర్డర్ ఐడీ, ట్రిప్ నెంబర్, కస్టమర్ పేరు, మొబైల్ నెంబర్, ఇసుక పరిమాణం, సప్లయి పాయింట్, డిస్పాచ్ డేట్, డ్రైవర్ పేరు, డ్రైవర్ మొబైల్ నెంబర్, వెహికల్ నెంబర్, అడ్రస్ వంటివన్నీ చూస్తే అది అసలైన ఓచర్ అనుకుంటారు. డిస్పాచ్ డేట్‌ను పరిశీలిస్తే.. ఆరోజే ఇసుకను పంపిణీ చేసినట్టుగా ఉంటుంది. ఓచర్‌ను ఎవరు చూసినా అది నిజమే అనుకుంటారు. ఇక్కడ అసలైన రహస్యం మరొకటి ఉంటుంది. అందులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కిందటి ఏడాది అని ఇట్టే తెలిసిపోతుంది. చోడవరం స్టాక్ పాయింట్ నుంచి పల్నాడు జిల్లా మాచర్లలోని నెహ్రూనగర్‌కు తరలించిన ఓ ఇసుక లోడు ఓచర్‌ను పరిశీలించగా, అది 2024లో జారీ చేసిందని తేలింది.

# పెసర రైతు కుదేలు!



ఆరబోసిన పెసలు

» ఆశాజనకంగా పంట దిగుబడి

» గిట్టుబాటు ధర లేక రైతుల ఆందోళన

» మద్దతు ధరకు కొనని ప్రైవేటు వ్యాపారులు

» మార్క్‌ఫెడ్ కేంద్రాలు ప్రారంభించాలని వినతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పెసల రైతు పరిస్థితి దారుణంగా తయారైంది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించటం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 8వేలకు పైగా ఉండగా, వ్యాపారులు రూ. 6 వేలకు కొనటం గగనంగా మారింది. మార్కెట్ ధర రూ.2వేలకు పైగా వ్యత్యాసం ఉండటంతో ఎక్కువ మంది రైతులు పంటను శీతల గిడ్డంగులకు తరలిస్తున్నారు. పాలకులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర ఇప్పించి ఆదుకోవాల్సిందిగా రైతులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఈ ఏడాది తొలకరిలో రైతులు 10 వేల ఎకరాల్లో పెసర, మినుము పంటలు సాగుచేశారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, ఇతర ఆటుపోట్లను తట్టుకుని పంట బాగానే పండి ఆశాజనకమైన దిగుబడి వచ్చింది. కోతల సమయంలో పొడి వాతావరణంలో పంట ఏమాత్రం దెబ్బతినకుండా ఎకరానికి రెండు నుంచి నాలుగుబస్తాల వరకు దిగుబడి వచ్చింది. అయితే అధిక వర్షాలకు మినుము పంట మాత్రం 50 శాతం వరకు దెబ్బతిన్నది. పెసలు నాణ్యతాపరంగా బాగున్నా మార్కెట్ తీవ్ర నిరాశాజనకంగా ఉంది. క్వింటాకు రూ. 6,200 ధర మాత్రమే పలుకుతోంది. అంతకు మించి ధర పెట్టేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పెసలకు ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 8,768. మద్దతు ధరకు, మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం ఉంది. ప్రస్తుతం బయట మార్కెట్లో విక్రయిస్తే క్వింటాకు రూ. 2,500లకు పైగా రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతులు దక్కిందే ధర అన్నట్టుగా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పంటను అమ్ముకుంటున్నారు. ఎక్కువ మంది రైతులు మాత్రం శీతలగిడ్డంగుల్లో నిల్వ చేశారు. ఇంకొంత మంది ఇళ్లల్లోనూ, కంచికచర్ల మార్కెట్ యార్డు ఆవరణలోని ఓపెన్ గిడ్డంగుల్లో ఉంచారు.

### కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మద్దతు ధరకు పెసలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. 2025-26 ఖరీఫ్ సీజన్ మద్దతు ధర అక్టోబరు ఒకటి నుంచి అమల్లోకి వస్తుంది. ఈలోగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా రైతులు పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గత మూడేళ్లుగా మార్క్‌ఫెడ్ అధికారులు జిల్లాలో పెసలను కొనటం లేదు. నాణ్యత తక్కువని, నాఫెడ్ నుంచి ఆర్డరు రాలేదని ఇతరత్రా సాకులు చెపుతూ వచ్చారు. గత ఏడాది ఒక దశలో శాంపిల్స్ కూడా సేకరించారు. సీఎం యాప్‌లో కూడా రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. కొనుగోలు చేసే తేదీ తెలియచేస్తామంటూ రైతులకు యాప్ ద్వారా సమాచారం వచ్చింది. అయినప్పటికీ అధికారులు పెసలు కొనకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇది పునరావృత్తం కాకుండా పాలకులు ముందుగానే కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని, మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయించి ఆదుకోవాలని రైతులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.



కంచికచర్ల మార్కెట్ యార్డులో పెసల నిల్వలు

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 127,136, 147 |
| చికెన్ విత్ స్కిన్ | 240 |
| చికెన్ స్కిన్‌లెస్ | 250 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

## ఉత్తమ టీచర్‌గా రవికిరణ్‌కు అవార్డు



మొగల్రాజపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్‌ను కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపెటెన్సిస్ సంస్థ ఉత్తమ టీచర్‌గా ఎంపిక చేసింది. విద్యార్థులను తీర్చిదిద్దడటంతో ఎప్పటికప్పుడు సరికొత్త విధానాలను అమలు చేస్తూ పాఠ్యాంశాల బోధనలో మార్పులను అమలు చేయడం వంటి సేవలను పురస్కరించుకుని ఈ అవార్డును అందుకున్నందుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, ఉపాధ్యాయులు రవికిరణ్‌ను అభినందించారు.

## వృద్ధ దంపతులకు సరుకులు, దుప్పట్లు పంపిణీ

● మానవత్వం చాటుకున్న గద్దె క్రాంతి

కృష్ణలంక, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మ గుడి ప్రాంతంలో నివసిస్తున్న వృద్ధులైన సిహెచ్.వెంకటేశ్వరరావు దంపతుల కష్టాలను గుర్తించిన గద్దె కుటుంబం మరోసారి మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. శుక్రవారం ఉదయం గద్దె రామ్మోహన్ తనయుడు, యువ నాయకుడు గద్దె కాంత్రికుమార్‌ను వృద్ధ దంపతుల ఇంటికి పంపి వారికి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, చీరలు సహా ఖర్చుల నిమిత్తం రూ. వెయ్యి అందించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి వారికి సహాయం అందించడం జరిగిందన్నారు. వీరికి ప్రతినెలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గద్దె క్రాంతితో పాటు టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, పెద్ది అన్నారావు, కేశనం భావన్నారాయణ, భార్గవ్, ధీరజ్ తదితరులు ఉన్నారు.

## వీపీఎల్‌కు ప్లేయర్ల ఎంపిక గడువు పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో కేశినేని శివనాథ్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించే విజయవాడ ప్రీమియర్ లీగ్‌కు క్రికెట్ ప్లేయర్ ఎంపిక కోసం క్వాలిఫయర్ టోర్నమెంట్ ఎంట్రీ రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లాలోని క్రికెట్ ప్లేయర్ల అభ్యర్థనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారుల వివరాలను ఈ నెల 30న గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.






పోస్టర్‌ను విడుదల చేస్తున్న సైబర్ క్రైమ్ ఐజీ రవికృష్ణ తదితరులు



సిద్ధార్థ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌కు బహుమతి అందిస్తున్న విద్యార్థులు



సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో విద్యార్థుల సందడి

## ఘనంగా గురుపూజోత్సవం

మొగల్రాజపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఐజీ, ఈగల్ ఫోర్సు హెడ్ ఎకె రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై నాటిక ప్రదర్శించారు. మత్తు పదార్థాల వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ ఎస్పీ మురళీ, సిద్ధార్థ అకాడమీ సంయుక్త కార్యదర్శి లలిత్ ప్రసాద్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.● మొగల్రాజపురం సిద్ధార్థ నగర్‌లో లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో డైరెక్టర్ డాక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ సుధాప్రవీణ, డైరెక్టర్ ఫణి ప్రసాద్‌లను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

**సిద్ధార్థ వైద్య కళాశాలలో ..**

మాచవరం: విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో శుక్రవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి బహుమతి అందించారు. విద్యార్థులనుద్దేశించి పలువురు ప్రసంగించారు. ప్రిన్సిపాల్ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో**

విజయవాడ: సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో కాలేజీలో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవంతో పాటు ఓనం పండుగను నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు కేరళ వస్త్ర ధారణతో కాలేజీ ఆవరణ సందడిగా మారింది. ప్రాంగణాన్ని పూలతో అలంకరించి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కోలాటం, కథాకళి నృత్యాన్ని ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ అరవింద్ బాబు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## చవితి పందిరిలో పూజలు...అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అడపా శేషు

లబ్బీపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక ద్వారకానగర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ అడపాశేషు ప్రారంభించగా 1000 మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కెర తిరుపతయ్య, వేముల దుర్గారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **19వ డివిజన్‌లో:** లబ్బీపేట 19వ డివిజన్‌లో బొజ్జ గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో శుక్రవారం కృష్ణలంక సీఐ నాగరాజు, టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి, బొప్పన భవకుమార్, భాగం సాయి ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**చవితి పందిరిలో కుంకుమ పూజలు**

కృష్ణలంక: స్థానిక సత్యం హోటల్ సెంటర్‌లో శ్రీ గణేష్ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి పందిరిలో శుక్రవారం జరిగిన సామూహిక కుంకుమ పూజలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. శనివారం అన్నదానం, లడ్డూ వేలంపాట, తదనంతరం వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జనం చేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అన్నే రమణ, తుమ్మల శ్రీకాంత్, వెలివోలు రవి, పట్నాల గంగా వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

**వెల్లివిరిసిన మత సామరస్యం**

పటమట: 11వ డివిజన్ వివేకానంద కాలనీ తంగిళ్ళముడి వారి వీధిలో ఎఫ్‌సీ యూత్ బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిర్వహించే వినాయకుడి పూజలో ముస్లిం మహిళ షేక్ సమీర ప్రతిరోజు స్వయంగా నైవేద్యాలు తయారుచేసి గణేశుడికి సమర్పిస్తూ పూజలు నిర్వహిస్తోంది. ఎఫ్‌సీ యూత్ ఆధ్వర్యంలో జరిగిన మహా అన్నదానాన్ని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవినేని అపర్ణ, బొప్పన భవకుమార్, చెన్నుపాటి గాంధీ, పటమట సీఐ వల్లభనేని పవన్‌కిషోర్, ఎస్సైలు పాల్గొన్నారు.







సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు, పూజా కార్యక్రమాల్లో కృష్ణలంక సీఐ నాగరాజు, బొప్పన, గద్దె క్రాంతి,పూజలు నిర్వహిస్తున్న షేక్ సమీర



## పేదలకు మరింత మేలు చేసేలా సంక్షేమం

● ఎమ్మెల్యే గద్దె



రిక్షా అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు మరింత మేలు చేసేలా తమ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం 14వ డివిజన్ దర్శిపేట మర్రిచెట్టు సెంటర్లో గద్దె రామ్మోహన్ పర్యటించారు. నిరుపేద కుటుంబానికి చెందిన దేవిరెడ్డి గణపతికి రూ.27వేలు విలువ చేసే రిక్షా బండిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు గొప్ప పథకానికి స్వీకారం చుట్టారని, రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు రూ.25లక్షలు విలువ చేసే ఇన్సూరెన్స్ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. కిడ్నీ, క్యాన్సర్ వంటి జబ్బులకు అధికమొత్తంలో నగదు ఖర్చు అవుతుందని, అటువంటి వారికి ఇన్సూరెన్స్ బాగా ఉపయోగపడుతుందన్నారు. వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, నర్రా కిషోర్, రమేష్, యడ్లపల్లి నాగరాజు, యార్లగడ్డ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా వినాయక నిమజ్జనాలు



యలమంచిలి హైట్స్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న మహిళలు

పటమట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయకుడి నిమజ్జనాలు పటమట పలు ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీరామచంద్ర నగర్ యలమంచిలి హైట్స్‌లో భిన్న మతాలు, కులాలకు చెందిన వారు 82 కుటుంబాలు ఉంటున్నాయి. భిన్నత్వంలో ఏకత్వంలా స్థానిక నివాసితులు కొల్లిపల రామ్మోహనరావు ఆధ్వర్యంలో వినాయకచవితి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు కుంకుమ పూజలు, హోమాలు, ప్రసాదాల పంపిణీ, తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వామివారి నిమజ్జనంలో అపార్ట్‌మెంట్‌లో నృత్యం చేస్తూ గణేశుని సాగనంపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎన్ఆర్ చౌదరి, రవీంద్ర, ఆంజనేయులు, రవి, కృష్ణమోహనరావు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## చెత్త తొలగించక పాట్లు



రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ శ్మశాన వాటిక దగ్గర చెత్తను సరిగా శుభ్రపరచడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివలన ఈగలు, దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, కలరా, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదముందని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నరికిన చెట్లను రోడ్డు పైన వేయడం వలన వాహన రాక పోకలకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులకు చెప్పినా వాటిని తొలగించడం లేదంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తకుండీల వద్ద ఎప్పటికప్పుడు శుభ్రపరిచే దిశగా చర్యలు చేపట్టాలని, రోడ్డు పక్కన పడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఫుడ్‌కోర్టు ప్రక్షాళనకు అధికారులు సిద్ధం

● నిబంధనలు అతిక్రమిస్తే చర్యలంటూ మైక్ ప్రచారం



లబ్బీపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న ఫుడ్‌కోర్టు వివాదాలకు వేదిక కావడం అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో ఫుడ్‌కోర్టు ప్రక్షాళనకు నడుం బిగించినట్లు కనిపిస్తోంది. దీనిలో భాగంగా అధికారులు నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని మైక్ ప్రచారంలో హెచ్చరించారు. ఇటీవల ఫుడ్‌కోర్టులో రెండురోజులు వ్యర్థాలను తొలగించపోవడంతో ఏర్పడిన ఇబ్బందులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి వెళ్లడంతో ఫుడ్‌కోర్టు వ్యాపారులతో సమవేశం ఏర్పాటు చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించడంతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలు అంశాలు చర్చించడంతో పాటు ఫుడ్‌కోర్టు నిర్వహణ పూర్తిగా కార్పొరేషన్ చేపట్టాలని, ప్రైవేటు వ్యక్తుల జోక్యంతో ఇబ్బందులు పడుతున్నామని అధికారుల వద్ద నిర్వాహకులు మొరపెట్టుకున్నారు. స్పందించిన అధికారులు విషయాన్ని కమిషనర్ దృష్టిలో ఉంచి చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాత్రి 9గంటల నుంచి ఒంటి గంట వరకు ఫుడ్‌కోర్టు ఉండేలా వెసులుబాటు ఇస్తున్నట్లు ప్రకటించడం పై వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పోలీసుశాఖకు స్పష్టమైన సమాచారం అందించాలని కోరడంతో అందుకు అధికారులు సమ్మతించారు. ఆహార నాణ్యత, శానిటేషన్ విషయంలో మార్పు రాకపోతే కారకుల బండ్లు సీజ్ చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం. కాంప్లెక్స్‌లో షాపుల ముందు అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఫుడ్ వ్యాపారాలు తొలగించాలని లేని పక్షంలో తామే చర్యలు తీసుకుంటామని అధికారులు మైక్ ప్రచారం చేస్తున్నారు.

## రాష్ట్రంలో లయోల నంబర్‌వన్ కళాశాలగా గుర్తింపు

భారతీనగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాల ఎన్ఐఆర్ఎఫ్ ఇండియా ర్యాంకింగ్స్ 2025లో జాతీయస్థాయిలో 151-200 బ్యాండ్‌లో ర్యాంక్ సాధించి రాష్ట్రంలో నెంబర్ వన్ కళాశాలగా గుర్తింపు పొందిందని కరస్పాండెంట్ డాక్టర్ రెక్స్ ఏంజెలో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది గర్వకారణమైన క్షణం, ఉన్నత ప్రమాణాల కోసం కృషి చేయడమే బాధ్యత అని డాక్టర్ రెక్స్ ఏంజెలో అభివర్ణించారు. ఎన్ఐఆర్ఎఫ్ ప్రక్రియను విజయవంతంగా నడిపించినందుకు కళాశాల జి.ఎం.శ్రీరంగంకు కృతజ్ఞతలు తెలిపారు. అధ్యా పకులు, సిబ్బంది, విద్యార్థుల అంకితభావం కృషి వల్లే సాధ్యమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ రెక్స్ మెల్చియర్ ప్రశంసించారు.

## సిద్ధార్థ వర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవం

కానూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అక్షరదాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎంఎస్ఆర్ మూర్తి హాజరై మాట్లాడారు. వర్సిటీ ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్, డాక్టర్ పాండురంగారావు, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



దుర్గగుడిలో రెండు మంచినీటి ప్లాంట్లను ప్రారంభించిన ఈవో శీనా నాయక్ దంపతులు, అర్చకులు, దివీస్ ప్రతినిధులు

### దివీస్ లేబొరేటరీస్ సహకారంతో

## రెండు జలప్రసాద కేంద్రాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దివీస్ లాబొరేటరీస్ సహకారంతో భక్తుల సౌకర్యార్థం దుర్గగుడి ఆవరణలో రెండు తాగునీటి శుద్ధి ప్లాంట్‌లను శుక్రవారం ఈవో శీనానాయక్ దంపతులు ప్రారంభించారు. దుర్గగుడి ప్రాంగణంలోని అద్దాల మండపం సమీపంలోని శివాలయం వద్ద ఒకటి, కొత్త పూజా మండపాల సమీపంలోని గోపికా కృష్ణుల విగ్రహాల వద్ద మరొక ప్లాంట్లను శీనానాయక్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రెండు నీటి ప్లాంట్‌ల ఏర్పాటుకు సహకరించిన దివీస్ లాబొరేటరీస్ వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దివీస్ లేబొరేటరీస్ యాజమాన్యం మొత్తం రూ.80 లక్షలతో ఐదు జల ప్రసాదాల కేంద్రాల ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చి గతంలో రెండు, ఇప్పుడు రెండు జల ప్రసాదాల ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చారన్నారు. మిగిలిన ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని నిర్ణయించారన్నారు. వైదిక కమిటీ సభ్యులు శ్యావాస్య మహర్షి, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, ఈఈ కోటేశ్వరరావు, దేవస్థానం అధికారులు, దివిస్ ప్రతినిధులు బి.కిషోర్, సి.హెచ్.శ్రీనివాసులు, ఎస్.సాయి కృష్ణ పాల్గొన్నారు.

## తిరిగి కృష్ణానదిలోకి వినాయక విగ్రహాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : వేదాద్రి వద్ద కృష్ణానది వరద తగ్గటంతో నిమజ్జనం చేసిన విగ్రహాలు ఒడ్డుకు చేరాయి. నీరులేక.. శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన ఫొటో కథనానికి అధికారులు తక్షణం స్పందించారు. ఒడ్డుకు చేరిన విగ్రహాలను ఎక్స్‌కవేటర్‌తో నదిలోకి పంపించారు.



బైక్‌లో పాము చేరడంతో గుమిగూడిన జనం

## బైక్‌లో తాచుపాము..ట్రాఫిక్ స్తంభన

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చిల్లకల్లులో బైకులో పాము దూరి ట్రాఫిక్ జామ్ అయిన ఘటన శుక్రవారం జరిగింది. వత్సవాయి మండలానికి చెందిన ప్రజలు తమ వాహనాల ను చిల్లకల్లు ఫ్లైఓవర్ కింద పార్కింగ్ చేసుకుని పనులు ముగించుకుని తిరిగి వాహనాలను తీసుకుని వెళ్తుంటారు. ఏపీ16డీబీ 3160 నంబరు బైకులో తాచుపాము దూరటం గమనించిన స్థానికులు వాహనం నుంచి పామును బయటకు తీసి చంపారు. సంఘటనను చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు గుమిగూడడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది.

## ప్రసన్నగణపతి సేవలో జబర్దస్త్ టీం

నందిగామ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు నందిగామ పట్టణంలో వైభవంగా జరుగుతున్నాయి. శ్రీవాసవీ మార్కెట్‌లో గణనాథుడికి భక్తులు రూ.3.20 కోట్ల నోట్లతో అలంకరించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా జబర్‌దస్త్ టీమ్ ఆది, షైనింగ్ శాంతి తదితరులు శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ కృష్ణకుమారి తదితరులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

## పేలుడు ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జూపూడి శివారు భీమేశ్వరకాలనీలో ఈనెల 3వ తేదీన జరిగిన పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన గోడ గోపి (29) విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాలనీలో రెంటపల్లి కోటమ్మ ఇంటికి చుట్టూ ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు నిమి త్తం వెల్డింగ్ చేస్తుండగా ఒక్క సారిగా పేలుడు సంభవించి ఇల్లు ధ్వంసం అయ్యింది. ఈప్రమాదంలో వెల్డర్ మహేష్‌తో పాటు హెల్పర్ గోపి తీవ్రంగా గాయపడ్డాడు. మహేష్ ప్రాణాపాయం నుంచి బయటపడగా, గోపి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. చందర్లపాడు మండలం కూనాయిపాలెం గ్రామానికి చెందిన గోపికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాదానికి గ్యాస్ బండ పేలడమే కారణం అని ప్రాథమికంగా అంచనా వేసినా పేలుడుకు ప్రధాన కారణం మాత్రం ఇంట్లో బాణా సంచా తయారీ వస్తువులు ఉన్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది. పేలుడుగు గల కారణాలు తెలియాల్సి ఉంది.



స్వరఝురి కార్యక్రమంలో గాత్ర కచేరీ చేస్తున్న శ్రీలత

## అలరించిన స్వరఝురి

విజయవాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వెలిగండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం హేమాద్రి మ్యూజిక్ అకాడమీ, స్వరఝురి సంస్థల సంయుక్త అధ్వర్యంలో జరిగిన సంగీత కార్యక్రమం శ్రోతలను అలరించింది. ప్రముఖ గాయకులు మూలా శ్రీలత ఆలపించిన కృతికీర్తన శ్రోతలకు వీనుల విందు చేసింది. గద్దె రామకుమారి జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ ప్రత్యేక సంగీత కార్యక్రమంలో 'ధన్యుడెవ్వడో', 'పరమాత్ముడు వెలిగే' వంటి కృతులు భక్తి రసాన్ని పంచాయి. వయోలిన్‌తో మల్లాది సింధురాంగేశ్వరి, ఘటంతో శ్రీ కుందుర్తి అరవింద్ సహకారం అందించారు. 'ధన్యుడెవ్వడో' (మలయమారుత రాగం)లోని భక్తిరస ప్రవాహం, 'అఖిలాండేశ్వరి' (ద్విజావంతి)లోని ఆలాపనలో సౌందర్యం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమాన్ని మోదుమూడి సుధాకర్ పర్యవేక్షించారు.



హెచ్‌ఎం తిమ్మరాజు సీతారామ్, మల్లవోలు దుర్గా శ్రీలక్ష్మి, కూచి ప్రమీలారాణిలను సత్కరిస్తున్న మంత్రి సుభాష్, జేసీ గీతాంజలి శర్మ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

# మంచి సమాజం..ఉపాధ్యాయులతోనే సాధ్యం

● గురుపూజోత్సవంలో ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :, భావిభారత పౌరులను తీర్చిదిద్ది ఉత్తమ సమాజాన్ని నిర్మించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్ హాలులో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి మంత్రి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, జేసీ గీతాంజలి శర్మ, డీఈవో పివిజె రామారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మంత్రి సుభాష్ మాట్లాడుతూ, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బోధనలు, రచనలు తరతరాలుగా ప్రభావితం చేస్తున్నాయన్నారు. ప్రతి మనిషి జీవితంలో ఒక గురువు ఉంటారని, ఒక్కో దశలో వారు ఒక్కో విధంగా ప్రభావం చూపుతూ ఉం టారన్నారు. తన జీవితంలో గణపతి మాస్టారు ప్రభావితం చేశారని, తనలో నాయకత్వ లక్షణా లు ఉన్నాయని, సేవ చేసే గుణం ఉందని, కోపం కాస్త తగ్గించుకోవాలని, బీఎల్ చేయాలని, బం గారు భవిష్యత్ ఉంటుందని మార్గ నిర్దేశం చేశారన్నారు. ఆయన ఆశీస్సులు వల్ల ఈ స్థాయికి చేరుకున్నానని, వారిని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటానన్నారు. ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తి కంటే గొప్ప వృత్తి మరొకటి లేదని ప్రశంసించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల పరిపాలనలో 13 డీఎస్సీలను నిర్వహించారని, సుమారు 1,80,208 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. సీఎం చంద్రబాబుకు విద్యావ్యవస్థ పట్ల ఎంత గౌరవం ఉందనడానికి ఇదే నిదర్శనమన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి షైనింగ్ స్టార్స్ పేరుతో జిల్లాలో 161 మంది విద్యార్థులకు 20 వేల రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇచ్చామన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా మాట్లాడుతూ, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఉపాధ్యాయులు ఎంతగానో తోడ్పడతారన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు ఎవరూ సాటి రారన్నారు. రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ, అక్షర రూపంలో ఉన్న ఒక సిరా చుక్క లక్ష మంది మెదడులకు పదును పెడుతుందని మహాకవి కాళోజి చెప్పినట్లు అక్షరాలను మాలలుగా చేసి విద్యార్థుల మెడలో వేసి ఆ బిడ్డల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దే గొప్ప వ్యక్తులు ఉపాధ్యాయులన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, ఒకే జీవితంలో అన్నీ సాధించడం ఎవరి వల్లా కాదని డాక్టర్ సర్వేపల్లి రోజుకు 20 గంటలు కష్టపడి ఉంటారని, అందుకే ఆయన ఉపాధ్యాయ జీవితంతో మొదలుపెట్టి దేశాధ్యక్ష పదవికి ఎదగగలిగారన్నారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు, డీఈవో పీవీజే రామారావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, డిప్యూటీ డీఈవోలు శేఖర్‌సింగ్, పద్మారాణి, రవికుమార్, ఏడీలు రవూఫ్, విద్యాలత, జిల్లా సైన్ అధికారి మహమ్మద్ జాకీర్ అహ్మద్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా 23 మంది టీచర్లను మంత్రి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ, ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, జిల్లా ఎస్పీ గంగాధరరావు, డీసీఎంఎస్ చైర్మన్ రామకృష్ణ, జేసీ గీతాంజలిశర్మ, డీఈవో రామారావు ఘనంగా సత్కరించారు.

### యూరియా కొరత లేదు : మంత్రి సుభాష్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూరియా కొరత, కొరత అంటూ దుష్ప్రచారం చేయడం వల్ల రైతులు ఆందోళన చెంది అవసరానికి మించి యూరియా కొనుగోలు చేశారన్నారు. ఎక్కువగా యూరియా వేస్తే భూమి దెబ్బతింటుందని, దీన్ని రైతులందరూ గమనించాలన్నారు. రైతుల్లో లేనిపోని అపోహలను, అలజడి సృష్టించి వైసీపీ నాయకులు తప్పుదారి పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని మంత్రి సుభాష్ సూచించారు. జిల్లా యంత్రాంగం ఎంతో అప్రమత్తంగా ఉందని, యూరియా కొరత లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుందన్నారు. రైతులు యూరియా తీసుకోవడానికి క్యూలో నిలబడితే దాన్ని నేరంగా చూపడం సమంజసం కాదన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్లకుమారరాజా, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యం పెంపుతోనే ఎదుగుదల




స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో మాట్లాడుతున్న ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ

ఉంగుటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభా పాటవాలతోపాటు నైపుణ్యం పెంపుతోనే ఏ రంగంలోనైనా రాణిస్తారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని స్వశక్తి గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జిల్లా లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ సహకారంతో ఆగస్టు 28న ప్రారంభమైన ట్రావెల్ అండ్ టూరిస్ట్ గైడ్ శిక్షణ శనివారంతో ముగియనున్న నేపథ్యంలో కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులనుద్దేశించి మాట్లాడారు. ట్రావెల్, టూరిజం రంగాల్లో నైపుణ్యాలు మెరుగుపరచుకున్న అభ్యర్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఔత్సాహికులకు టూరిజం, ట్రావెల్ గైడ్ అంశాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తేవడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. నవ్య రాజధాని అమరావతికి ముఖద్వారమైన విజయవాడ, ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో గ్రామీణ స్వయంఉపాధి శిక్షణ కేంద్రం( యూబీఆర్‌ఎస్‌ఈటీఐ) డైరెక్టర్ వి.అమరేశ్వర్‌రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి ఏ.శిల్ప, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ ప్రతినిధులు, శిక్షణా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

### పలువురికి డైరెక్టర్ పదవులు

వన్‌టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లకు శుక్రవారం రాత్రి బోర్డు డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన బత్తుల వెంకటేశ్వరరావు(జనసేన), మైలవరం నియోజకవర్గానికి చెందిన దుర్గామహాలక్ష్మి(టీడీపీ), జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన పార్వతమ్మ తాళ్లూరి(టీడీపీ), ఏపీ నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన బంక నాగమణి (టీడీపీ), బెవర సాయి సుధాకర్(టీడీపీ), కరణం దివాకర్ బాబు (జనసేన), సుకాసి కిరణ్‌కుమార్ (టీడీపీ)లను నియమించారు. ఏపీ బ్రా హ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు గుడివాడ నియోజకవర్గానికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ వరప్రసాద్ (టీడీపీ)ను నియమించారు.

### ఆటో కార్మికుల ధర్నా

ధర్నాచౌక్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో శుక్రవారం ఆటో కార్మికులు ధర్నా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ర్యాపిడో, ఓలా, ఉబర్ బైక్ సర్వీస్‌లను రద్దు చేయాలని, ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవీ.రమణ, రవీంద్ర, ఆర్.కనకరావు, నాని, అర్జున్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 1998 డీఎస్సీ క్వాలిఫైడ్‌కు న్యాయం చేయాలి

డీఎస్సీ క్వాలిఫైడ్ 1998 బ్యాచ్‌లో మిగిలిన అభ్యర్థులను వెంటనే ఎంటీఎస్ పద్ధతిలో ఎస్‌జీటీలుగా నియామకాలు చేపట్టాలని ఓబీసీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, 1998 డీఎస్సీ రిమైనింగ్ క్యాండిడేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈపనగుండ్ల శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, అచ్చెన్నాయుడులకు వినతిపత్రాలు అందజేశామన్నారు.

### ఆపరేషన్ బుడమేరు నిర్లక్ష్యంపై 11న ధర్నా


గాంధీనగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది వరద సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రకటించిన ఆపరేషన్ బుడమేరు అమలు చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 11 విజయవాడలో ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దాసరిభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. విజయవాడ ఎగువన 250 ఎకరాలు బుడమేరు పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురైందన్నారు. సీపీఐ నేతలు దోనేపూడి శంకర్, నార్ల వెంకటేశ్వరరావు, కృష్ణ చైతన్య, జి.కోటేశ్వరరావు, గోవిందరాజులు పాల్గొన్నారు.



### డాక్టర్ సర్వేపల్లికి డీఎంహెచ్‌వో నివాళి

విజయవాడ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ డే సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి డీఎంహెచ్‌వో సుహాసిని నివాళులర్పించారు. ఉపాధ్యాయ వృత్తిని ఆయన అత్యున్నతమైనదిగా భావించారని వెల్లడించారు. డాక్టర్ బాలాజీ నాయక్, ఆఫీస్ సిబ్బంది రాజశేఖర్, నాంచారయ్య, రమేష్, పావని, శివకుమార్ పాల్గొన్నారు.

### జీడీఏపీ జిల్లా అధ్యక్షుడిగా కె.వి.ఎన్.ఎస్ అనిల్‌కుమార్



విజయవాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జీడీఏపీ) అధ్యక్షుడిగా మెటర్నల్, చిల్డ్రన్ హెల్త్ విభాగ అదనపు డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె.వి.ఎన్.ఎస్. అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సాయంత్రానికి మరే అభ్యర్థి నామినేషన్ వేయకపోవడంతో రిటర్నింగ్ అధికారి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ మహేష్ మాట్లాడుతూ, అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త యలమంచిలి సురేష్

## టీడీపీ కార్యకర్తపై వైసీపీ శ్రేణుల హత్యాయత్నం

● బొబ్బర్లంకలో ఘటన

మోపిదేవి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త యలమంచిలి సురేష్‌పై బొబ్బర్లంకలో వైసీపీ శ్రేణులు శుక్రవారం సాయంత్రం దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. యలమంచిలి సురేష్ కూలి పనులు చేసుకుంటూ, పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. బొబ్బర్లంక గ్రామంలో గణేష్ నిమజ్జనోత్సవానికి సమీప బంధువులు పిలవటంతో వెళ్లి ఊరేగింపు ముగించుకుని కొక్కిలిగడ్డలోని ఇంటికి వచ్చాడు. పాలు అమ్మకం చేసేందుకు బొబ్బర్లంక గ్రామానికి వెళ్లగా రహదారిపై అడ్డగించి వైసీపీ శ్రేణులు మైలా శివకుమార్, పీతా నవీన్ దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. సురేష్ చెయ్యి విరిగి మెడపై బలమైన దెబ్బలు తగిలాయి. గ్రామస్థులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చెయ్యి విరిగి, మెడ వద్ద బలమైన గాయమైనట్లు నిర్ధారించి, మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం రిఫర్ చేశారు. దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త సురేష్‌ను దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, బొబ్బర్లంక టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు దొప్పలపూడి జగదీష్, కోనేరు నాని పరామర్శించారు. గతంలో గ్రామంలో వివాదాలకు సంబంధించి ముద్దాయిలుగా శివకుమార్, నవీన్ ఉండగా, గ్రామస్థులు వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ముమ్మనేని అరవింద్ కొక్కిలిగడ్డ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చి శివకుమార్, నవీన్ అనే వ్యక్తులు త్వరలో తనను చంపేస్తారని వార్నింగ్ ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆవేదన వ్యక్తం చేశాడు.



కృష్ణా కరకట్టపై ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

### దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● కరకట్టపై టీడీపీ శ్రేణుల బైఠాయింపు

బొబ్బర్లంక గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సురేష్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై రౌడీషీట్ ఓపెన్‌చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టీడీపీ శ్రేణులు కృష్ణా కరకట్టపై బైఠాయించి ఆందోళనకు దిగారు. మోపిదేవి ఎస్సై వైవి.సత్యనారాయణ, పోలీసు ఉన్నతాధికారులు కరకట్టపై ఆందోళన చే స్తున్న టీడీపీ కార్యకర్తల వద్దకు వచ్చి ఆందోళన విరమించాల్సిందిగా కోరారు. రౌడీషీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకునేవరకూ విరమించేదిలేదంటూ గ్రామస్థులు నినాదాలు చేయగా, పోలీసుల హామీతో ఆందోళన విరమించారు.

# ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడి

## హారన్ కొట్టినా రోడ్డుకు అడ్డంగా ఆటో నిలిపి దూషణ



ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను కొడుతున్న ఆటో డ్రైవర్

వన్‌టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మీద ఫోన్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుకు అడ్డంగా ఉన్నందుకు హారన్ కొట్టిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను ఆటో డ్రైవర్ అసభ్యకరంగా దూషించి, బస్సులోకి ఎక్కి కొట్టిన సంఘటన శుక్రవారం సాయంత్రం జక్కంపూడి కాలనీలో జరిగింది. బాధిత బస్సు డ్రైవర్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యాధరపురం ఆర్టీసీ డిపోకి చెందిన రూట్ నెం.26 జక్కంపూడి - సిటీ బస్‌స్టేషన్ వెళ్లే బస్సు డ్రైవర్ అరుణ్ కుమార్ జక్కంపూడి నుంచి సిటీ బస్టాండ్‌కు బయలుదేరాడు. జక్కంపూడి కాలనీలో బస్సు ముందు వెళుతున్న ఓ ఆటో డ్రైవర్ డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడుతూ బస్సుకు అడ్డంగా ఉన్నాడు. బస్సు డ్రైవర్ అరుణ్ కుమార్ పలు సార్లు హారన్ కొట్టాడు. అప్పటికీ ఆటో డ్రైవర్ తప్పుకోకపోవటంతో మరోసారి హారన్ కొట్టాడు. దీంతో ఆటో డ్రైవర్ ఆటోను మధ్యలో నిలిపి బస్సు డ్రైవర్ అరుణ్‌కుమార్‌ను అసభ్యకరంగా దూషిస్తూ బస్సులోకి ఎక్కి అతనిని కొట్టాడు. బస్సులో ఉన్న ప్రయాణికులు అడ్డుకోవటానికి ప్రయత్నించినా ఆటో డ్రైవర్ దౌర్జన్యంగా బస్సు డ్రైవర్‌ను కొట్టడం ఆపలేదు. దీంతో బాధితుడు కొత్తపేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

## నర్సింగ్ విద్యార్థినులకు లైంగిక వేధింపులు

● మంత్రి సత్యకుమార్‌కు ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

నర్సింగ్ స్కూల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులు జరిగినట్లు ఆరోపణలు రావడం సంచలనం సృష్టిస్తోంది. తమపై జరుగుతున్న వేధింపుల విషయమై నర్సింగ్ విద్యార్థినులు కొందరు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేయటంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నర్సింగ్ స్కూల్‌లో తమకు భద్రత కల్పించాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ప్రభుత్వ జీఎన్‌ఎం నర్సింగ్ స్కూల్ నడుస్తోంది. విద్యార్థినులు వ్యక్తిగత వివరాలను బహిర్గతపరచవద్దని మంత్రిని ప్రాధేయపడుతూ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. క్యాంటీన్, భోజన సరఫరా సిబ్బందితమ భద్రతకు ముప్పు కలిగేలా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో పలుమార్లు సూపరింటెండెంట్, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకు వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదనిపేర్కొన్నారు భోజనం సరఫరా చేసే నిర్వాహకుడు ఒకరు ఒక విద్యార్థినిని తరచూ వెంబడిస్తూ ఒకానొక సందర్భంలో తన చేతిని కోసుకుని ఆమెను పెళ్లి చేసుకోవాలంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. నిర్వాహకుడు సోదరుడు కూడా మరో విద్యార్థినిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. క్యాంటీన్‌లో పనిచేసే మరో వ్యక్తి నర్సింగ్ స్కూల్‌లోని విద్యార్థినిని ప్రలోభపెట్టి తన వెంట తీసుకుని వెళ్లిపోయాడని పేర్కొన్నారు. వరుస ఘటనలతో తాము భయపడుతూ చదువుకోవాల్సి వస్తోందని తమ లేఖలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం



వంటిల్లు

# వామన చింతకాయలతో వెరైటీగా..!

పుల్లటి వామన చింతకాయలను చూడగానే నోరూరని వారుండరు. వాటితో పప్పు, పచ్చడి చేసుకుని ఇష్టంగా తింటూ ఉంటాం. అలాంటి వామన చింతకాయలతో చేసే రుచికరమైన వెరైటీ వంటకాలు మీ కోసం...

## చింతకాయ పులిహోర

### కావాల్సిన పదార్థాలు

చిన్న చింతకాయలు- 100 గ్రాములు, పొడి పొడిగా ఉడికించిన అన్నం- మూడు కప్పులు, పచ్చి మిర్చి- పది, అల్లం- చిన్న ముక్క, పసుపు- అర చెంచా, ఉప్పు- తగినంత, నూనె- మూడు చెంచాలు, పల్లీలు- తగినన్ని, మినపప్పు- ఒక చెంచా, పచ్చి శనగపప్పు- ఒక చెంచా, ఎండు మిర్చి- రెండు, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, ఇంగువ- చిటికెడు, జీడిపప్పు- కొద్దిగా, కరివేపాకు- కొద్దిగా, నెయ్యి- అర చెంచా

### తయారీ విధానం

- ముందుగా చింతకాయలను నీళ్లతో బాగా కడగాలి. తరవాత తొడిమలు తీసి చిన్న ముక్కలుగా కోయాలి. మిక్సీలో చింతకాయల ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం, పసుపు, ఉప్పు, కొన్ని నీళ్ల చుక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. పల్లీలు, జీడిపప్పు వేసి దోరగా వేపి పళ్లెంలోకి తీయాలి. తరవాత ఆ నూనెలో ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పచ్చి శనగపప్పు, మినపప్పు, ఎండు మిర్చి, కరివేపాకు వేసి దోరగా వేపాలి. ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న చింతకాయ పేస్టు కూడా వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలు వేగనిచ్చి నెయ్యి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.
- వెడల్పాటి గిన్నెలోకి ఉడికించిన అన్నం తీసుకోవాలి. అందులో వేయించిన పల్లీలు, జీడిపప్పు, చింతకాయ మిశ్రమం వేసి బాగా కలపాలి. ఉప్పు సరి చూసుకోవాలి. అంతే కమ్మని చింతకాయ పులిహోర రెడీ..!

**చిట్కాలు**

- చింతకాయలకు ఉన్న పీచును పూర్తిగా తీసివేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అప్పుడే పులిహోర రుచిగా ఉంటుంది.
- ఇష్టమైతే కొద్దిగా నువ్వుల పొడి కలుపుకోవచ్చు.

## చింతకాయ చికెన్

### కావాల్సిన పదార్థాలు

చిన్న చింతకాయాలు- 100 గ్రాములు, బోన్‌లెస్ చికెన్- పావు కేజీ, ఉల్లిపాయ- ఒకటి, పచ్చిమిర్చి- నాలుగు, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, కారం- తగినంత, ఉప్పు- తగినంత, పసుపు- చిటికెడు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, జీలకర్ర పొడి- ఒక చెంచా, గరం మసాల పొడి- ఒక చెంచా, కొత్తిమీర- కొద్దిగా, నూనె- మూడు చెంచాలు

### తయారీ విధానం


- ఉల్లిపాయను సన్నగా తరిగి పెట్టుకోవాలి. చింతకాయలను శుభ్రంగా కడగాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో చింతకాయలు వేసి అవి మునిగేవరకు నీళ్లు పోసి మెత్తగా ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. చింతకాయలను చేత్తో గట్టిగా పిండి పిప్పిని తీసివేసి గుజ్జును సిద్ధం చేసుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చి మిర్చి ముక్కలు, పసుపు, కారం, ఉప్పు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాల పొడి వేసి బాగా కలపాలి. అరగ్లాసు నీళ్లు పోసి మరిగించాలి. అయిదు నిమిషాల తరవాత చింతకాయ గుజ్జు వేసి కలపాలి. ఇది రెండు నిమిషాలు ఉడికిన తరవాత చికెన్ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న చింతకాయ చికెన్ వేడి అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

వామన చింతకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ని నివారిస్తాయి. వీటిని తినడం వల్ల గర్భిణుల్లో వాంతులు, వికారం తగ్గుతాయి. మహిళల్లో రుతు సమస్యలు రావు. వామన చింతకాయలతో చేసిన వంటకాలు తినిపిస్తే చిన్న పిల్లలకు కడుపులో నులిపురుగుల సమస్య తీరుతుంది.



**చిట్కాలు**

- కూర ఉడుకుతున్నప్పుడు కొద్దిగా జీడిపప్పు, పల్లీలు, గసగసాల పేస్టు వేసి కలిపితే కమ్మటి రుచి వస్తుంది.
- చికెన్ ముక్కలను తగుమాత్రం ఉడికిస్తే తినడానికి బాగుంటుంది.



## చింతకాయ పప్పుచారు

### కావాల్సిన పదార్థాలు

చిన్న చింతకాయలు- 150 గ్రాములు, కందిపప్పు- 200 గ్రాములు, పసుపు- అర చెంచా, కరివేపాకు- కొద్దిగా, పచ్చిమిర్చి- అయిదు, నూనె- మూడు చెంచాలు, కారం- ఒక చెంచా, ఉప్పు- తగినంత, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, ఎండు మిరపకాయలు- మూడు, ఉల్లిపాయలు- రెండు, ఇంగువ- పావు చెంచా, టమాటా- ఒకటి, కొత్తిమీర- కొద్దిగా

### తయారీ విధానం

- చింతకాయలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి చింతకాయలు వేసి అవి మునిగేవరకు నీళ్లు పోసి మెత్తగా ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. అందులో ఒక గ్లాసు నీళ్లు పోసి చేత్తో పిసికి రసం తీసుకోవాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో కందిపప్పు వేసి ఒక గ్లాసు నీళ్లు పోయాలి. తరవాత పావు చెంచా పసుపు, పచ్చిమిర్చి చీలికలు, ఒక చెంచా నూనె వేసి మూతపెట్టి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.

తరవాత కుక్కర్‌ను స్టవ్ మీద నుంచి దించి అది చల్లారాక మూత తీసి అందులో చింతకాయ రసం వేసి బాగా కలపాలి. తరవాత కారం, ఉప్పు, మరో రెండు గ్లాసుల నీళ్లు పోసి కలపాలి.

- స్టవ్ మీద మందపాటి పెద్ద గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పసుపు, కచ్చాపచ్చాగా దంచిన వెల్లుల్లి రెబ్బలు, ఎండు మిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత పప్పు-చింతకాయ రసం మిశ్రమాన్ని పోసి బాగా కలపాలి. పెద్ద మంటమీద పది నిమిషాలు మరిగించాలి. చివరగా కొత్తిమీర తరుగు వేసి స్టవ్ మీద నుంచి దించాలి.

**చిట్కాలు**

- కందిపప్పును పావుగంటసేపు నీళ్లలో నానబెడితే మెత్తగా ఉడుకుతుంది.
- ఆలుగడ్డ, సొరకాయ, కేరట్, బెండకాయ, మునక్కాడలు, ముల్లంగి లాంటి కూరగాయల ముక్కలను విడిగా ఉడికించి ఇందులో కలుపుకోవచ్చు.

భోజన కుతూహలం

# ఆకుజెముడు ఆకులతో ఆహార ఔషధం

రాతిబండలపై, నీటి వనరులు తక్కువగా ఉన్న పొడిబారిన నేలల్లో ఆకుజెముడు పొదలు పెరుగుతాయి. ఇది ఆముదం జాతికి చెందిన మొక్క. ఆకుజెముడును సంస్కృతంలో సేహుండా అని పిలుస్తారు. ఆయుర్వేదంలో దీనికి స్నుహి అనే శాస్త్రీయనామం ఉంది. తెలుగులో దీనిని ఆకుజెముడు లేదా కాడజెముడు అని పిలుస్తారు. ఆకుజెముడు ఆకులు, వేళ్లు, కాండం, కాండం నుండి వచ్చే పాలతో మధుస్నుహీరసాయనం లాంటి ఔషధాలు తయారవుతాయి. ఆకుజెముడు ఆకులు చాలా తీక్ష స్వభావం కలిగినవి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి ప్రయోజనాలివే..

- ఆకుజెముడు ఆకుల రసం లేదా గుజ్జు రుచిని పుట్టిస్తాయి. అజీర్ణాన్ని పోగొడతాయి. పొట్ట ఉబ్బరాన్ని తగ్గిస్తాయి.
- కీళ్లవాతం, సయాటికా, నడుము నొప్పి, మెడనొప్పి మొదలైన వాటికి ఈ ఆకులు మంచి మందు. ఆకుజెముడు ఆకులను వేడి చేసి నెప్పి ఉన్న ప్రాంతంలో కట్టు కడితే ఉపశమనం లభిస్తుంది.
- ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరుకోవటం, దగ్గు, జలుబు మొదలైన వ్యాధులకు ఇది మంచి మందు.
- చెవికి సంబంధించిన నరాల జబ్బులు, శరీరం వివిధ భాగాల్లో వచ్చే వాపులు, గడ్డలను తగ్గించటానికి కూడా ఈ ఆకులు ఉపకరిస్తాయి. ఈ ఆకుల రసాన్ని చెవిలో వేస్తే నెప్పి వెంటనే తగ్గుతుంది.
- బొల్లి వంటి చర్మవ్యాధుల నివారణకు ఇది గొప్ప మందు.
- లేత ఆకుల నుంచి పాలు కారుతూ ఉంటాయి. ఈ పాలు తీవ్రమైన మలబద్ధకం, రకరకాల విషప్రభావాలకు మంచి మందు.

- ఆకుజెముడు ఆకులను ముక్కలుగా కోసి మజ్జిగలో ఉడికించి.. పచ్చడిగా చేసుకొని తినవచ్చు.
- ఈ ఆకులను ఎండబెట్టి పొడిచేసి గ్రీన్‌టీ మాదిరిగా తాగవచ్చు.
- ఈ ఆకులు వేడి చేస్తాయి. అందువల్ల వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి.

• గంగరాజు అరుణాదేవి



సాధారణంగా మనం అరటిపండు తిని దాని తొక్కను పడేస్తూ ఉంటాం. అలాకాకుండా ఈ తొక్కతో ఫేస్‌ప్యాక్‌లు తయారుచేసుకుని వాడితే ముఖసౌందర్యం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆ ఫేస్‌ప్యాక్‌ల తయారీ గురించి తెలుసుకుందాం...

# అరటిపండు తొక్కతో ఇలా చేస్తే...

- ముందుగా అరటిపండు తొక్కను పసుపు నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత చిన్న ముక్కలుగా తుంచి మిక్సీలో వేసి కొన్ని నీళ్ల చుక్కలు చిలకరించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పేస్టుని గిన్నెలోకి తీసుకోవాలి. అందులో అరచెంచా బియ్యప్పిండి, అర చెంచా చక్కెర వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి మెల్లగా మర్దన చేయాలి. అర గంట తరవాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. అరటిపండుతొక్క... చర్మానికి తేమను అందిస్తుంది. దీంతో ముఖం మీద ఏర్పడిన నల్ల మచ్చలు, ఎండ వల్ల వచ్చే టానింగ్ లాంటివి తగ్గిపోతాయి. చక్కెర... మృత కణాలను తొలగించి చర్మాన్ని మెరిపిస్తుంది. బియ్యప్పిండి చర్మాన్ని బిగుతుగా మారుస్తుంది.



- అరటి తొక్క పేస్టులో ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తరవాత మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే ముఖం తాజాగా మెరుస్తూ కనిపిస్తుంది.
- అరటి తొక్క పేస్టులో రెండు చెంచాల పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంటసేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే చర్మ రంధ్రాలు పరిశుభ్రమవుతాయి. మొటిమలు, గుల్లలు రావు. చర్మం ఛాయగా మృదువుగా మారుతుంది.
- అరటి తొక్క లోపలి భాగంతో ముఖాన్ని కింది నుంచి పైకి మెల్లగా రుద్దాలి. పావుగంట తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడిగేసుకోవాలి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తూ ఉంటే నుదుటి మీద, పెదవుల చుట్టూ ఏర్పడిన గీతలు, ముడుతలు మాయమవుతాయి. చర్మం బిగుతుగా ప్రకాశవంతంగా మారుతుంది.

# అమ్మగా.. 'అమృతం' పంచుతున్నారు!



**అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లి పాలే ఆహారం. తల్లీబిడ్డల అనుబంధాన్ని పెంచి పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి కూడా తల్లి పాలే దోహదం చేస్తాయి. అలాంటి తల్లి పాలను ఎన్ఐసీయూ శిశువుల కోసం దానం చేస్తూ తన్న ఉదారతను చాటుకుంటున్నారు హైదరాబాద్‌కు చెందిన సమీరా షెరీఫ్. ఇటీవల ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చారు. బిడ్డ పుట్టిన తరవాత 50 రోజుల వ్యవధిలో 13 లీటర్ల చనుబాలను ఆమె దానం చేశారు తల్లిపాల ఉత్పత్తి, నిల్వ, దానం చేసే విధానాల గురించి ఎన్నో ఆసక్తికరమై అంశాలను ఆమె 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.**

"సాధారణంగా బిడ్డ పుట్టిన తరవాత కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు... తల్లి చుట్టూ చేరి "పాలు వస్తున్నాయా? బిడ్డకు పాలు సరిపోతున్నాయా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తుంటారు. అలా అడగడం మంచిది కాదని నా అభిప్రాయం. స్త్రీ శరీరం ఒక అద్భుతం. అందుకే భగవంతుడు పిల్లలను కనే బాధ్యతను ఆడవారికి అప్పగించాడు. పాలకోసం బిడ్డ ఏడిస్తే వెంటనే తల్లి మెదడుకు సంకేతాలు అందుతాయి. మెల్లగా రొమ్ములు పాలతో నిండుతాయి. బిడ్డ పుట్టిన తరవాత మొదటి రెండు రోజులు పాలు తక్కువగా వస్తాయి. క్రమంగా బిడ్డ తాగుతున్న కొద్దీ పాలు ఎక్కువగా వస్తుంటాయి. బిడ్డకు పాలు సరిపోకపోవడం అనేది ఉండదు.

### ఆలోచన ఇలా వచ్చింది...

కొవిడ్ సమయంలో మా పెద్దబ్బాయి పుట్టాడు. పుట్టిన వెంటనే బాబుకు కామెర్లు వచ్చాయి. చికిత్స చేస్తున్నప్పటికీ కామెర్లు తగ్గకపోవడంతో "బాబుకి తల్లిపాలు సరిపోతున్నాయా?" అని వైద్యులు ప్రశ్నించారు. బిడ్డ కడుపు నిండా పాలు తాగితేనే మూత్రం ద్వారా కామెర్లు తొలగిపోతాయని చెప్పారు. ఫొటోథెరపీ చేసి బాబుకి తల్లి పాలు సరిపోవడం లేదని తేల్చారు. తల్లి పాలలో కొన్ని ఫార్ములా పాలు కలిపి బాబుకి పట్టించారు. బాబు వెంటనే వాంతి చేసుకున్నాడు. వాడికి తల్లిపాలు మాత్రమే కావాలని నాకు అర్థమయింది. 'పాలు ఎక్కువగా కావాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి?' అనే విషయం గురించి అంతర్జాలంలో వెతికి, పుస్తకాలు చదివి చాలా విషయాలు తెలుసుకున్నాను. అలాగే బంధువుల్లో పెద్దవారిని అడిగి కొంత సమాచారం సేకరించాను. అలా నాకు నేనుగా ఒక పద్ధతిని అనుసరించడం ప్రారంభించాను. క్రమంగా పాలు పెరిగాయి. బాబు తాగిన తరవాత కూడా చాలా పాలు మిగిలి ఉండేవి. వాటిని అలాగే ఉంచితే రొమ్ములు బరువెక్కి నొప్పిగా అనిపించేది. మామూలుగా తల్లులందరూ ఇలా అదనంగా ఉన్న పాలను బాత్‌రూమ్‌లో పిండేస్తుంటారు. లేదంటే బిడ్డకు స్నానం చేసే నీటిలో కలిపేస్తుంటారు. ఎంతో అమూల్యమైన తల్లి పాలను వృథా చేయడానికి నాకు మనస్కరించలేదు. అప్పుడే చనుబాలను దానం చేయాలనే ఆలోచన వచ్చింది. సాధారణంగా ఎన్‌జీఓ సెంటర్లకు వెళ్లి తల్లులు పాలు దానం చేస్తుంటారు. నాకు హైదరాబాద్‌లో అలాంటి వెసులుబాటు కనిపించలేదు. కానీ నిలోఫర్ ఆసుపత్రిలోని మిల్క్ బ్యాంక్‌లో దానం చేయవచ్చని తెలిసింది. అప్పుడు రెండు నెలల వ్యవధిలో ఎనిమిది లీటర్ల తల్లిపాలను దానం చేశాను. ప్రస్తుతం అంకుర, రెయిన్‌బో ఆసుపత్రుల్లో కూడా తల్లిపాలను దానం చేసే వీలుంది. ఇప్పుడు రెండో బాబు పుట్టిన తరవాత 27 రోజుల వ్యవధిలోనే ఆరు లీటర్ల పాలను నిల్వ చేశాను. వీటితో కలిపి 50 రోజుల్లో 13 లీటర్ల చనుబాలను రెయిన్‌బో ఆసుపత్రిలో దానం చేశాను. బిడ్డ పుట్టిన తరవాత మొదటి వారం కొలెస్ట్రమ్ విడుదలవుతుంది. దాన్నే 'ముర్రుపాలు' అని కూడా అంటారు. వాటిలో చాలా ఔషధ గుణాలు ఉంటాయి. ఈ పాలను కూడా విడిగా తీసి ఆసుపత్రిలో ఇచ్చాను. ఇలా తల్లులు దానం చేసిన పాలను 'ఎన్ఐసీయూ' (నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లో ఉన్న శిశువుల కోసం వినియోగిస్తారు."

సమీర... ప్రముఖ తెలుగు నటి సన కోడలు. ఆమె భర్త సయ్యద్ అన్వర్ అహ్మద్. వీరికి అర్హాన్, అమీర్ అనే ఇద్దరు అబ్బాయిలున్నారు. సమీర కూడా పలు తెలుగు, తమిళ సీరియల్స్‌లో నటించారు. 'ఆడపిల్ల', 'అభిషేకం', 'భార్యామణి', 'మూడుముళ్ల బంధం', 'ప్రతిబింబం', 'మంగమ్మగారి మనవరాలు' సీరియల్స్ ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. సమీర సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటారు. తల్లిగా తన అనుభవాలను, బిడ్డలతో అనుబంధం, కుటుంబ సభ్యుల ప్రేమానురాగాలను ప్రతిబింబించే పలు వీడియోలను పోస్ట్ చేస్తూ ఉంటారు. చనుబాలను దానం చేసే విధానాన్ని వివరిస్తూ చేసిన వీడియోకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వచ్చింది.



### నేటి తల్లులు ఇవి తెలుసుకోవాలి...

పాలు తాగిన తరవాత కూడా బిడ్డ ఏడుస్తూ ఉంటే పాలు సరిపోవడం లేదనుకొని ఫార్ములా పాలు పట్టాలనే ఆలోచన చేస్తూ ఉంటారు. ఫార్ములా పాలు మంచివి కాదని నేను చెప్పను కానీ వాటి అవసరం బిడ్డకు రాదని నా అభిప్రాయం. బిడ్డకు కావాల్సినన్ని పాలు ఉత్పత్తి చేసే శక్తి తల్లికి ఉంటుంది. గ్యాలెక్ట్ గ్రాన్యూల్స్ అనే పౌడర్ మార్కెట్లో దొరుకుతుంది. దీన్ని ఒక చెంచా చొప్పున ఒక గ్లాసు పాలలో కలుపి... ఉదయం, సాయంత్రం తాగితే చనుబాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దాని రుచి చాలా బాగుంటుంది. తల్లి పాలలో యాంటీబాడీలు ఉంటాయి. వీటివల్లనే పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పిల్లలకు ఏవైనా అనారోగ్య సమస్యలు వస్తే వాటిని నిరోధించే విధంగా తల్లిపాలు ఉత్పత్తి అవుతాయి. పిల్లలకు ఉదయం, సాయంత్రం, రాత్రివేళల్లో ఉండే అవసరాలకు తగ్గట్టుగా చనుబాలు వస్తుంటాయి. పాలు రాకపోయినా నిపుల్‌ను బిడ్డ నోట్లో ఉంచితే కొంతసేపటికి పాలు ఉత్పత్తి అవుతాయి. రొమ్ములు పెద్దగా ఉన్నా చిన్నగా ఉన్నా; నిపుల్స్ చదునుగా ఉన్నా, కాస్త ఎత్తుగా ఉన్నా పాల ఉత్పత్తికి అవరోధాలు కావు. నిపుల్స్ చదునుగా ఉంటే మాత్రం నిపుల్ సక్కర్ వాడడం మంచిది. నిపుల్‌తోపాటు చుట్టూ ఉన్న ప్రాంతాన్ని కూడా కొద్దిగా బిడ్డ నోట్లో ఇమిడ్చి, సరైన విధానంలో బిడ్డ పాలుతాగేలా తల్లులు చూసుకోవాలి. పిల్లలకు కావాల్సినప్పుడల్లా ఒక రొమ్ములో పాలిస్తూ అదే సమయంలో రెండో రొమ్మునుంచి పాలు తీసి భద్రపరచి దానం చేస్తే పది మంది పిల్లలకు సహాయం చేసినవారవుతారు."

• పి. హిమబిందు

పిల్లలు అబద్దాలు చెబుతున్నారని తెలిసినప్పుడు తల్లిదండ్రులు ఆందోళన చెందడం సహజం. అలాంటప్పుడు తల్లిదండ్రులు శాంతంగా వ్యవహరిస్తూ పిల్లలను సరైన దారిలోకి ఎలా తీసుకురావాలో తెలుసుకుందాం...

# పిల్లలు అబద్ధాలు చెబుతున్నారా..?



- పిల్లలు నిజం చెప్పలేదని తెలిసినప్పుడు వెంటనే వారిమీద కోపంతో అరవకూడదు. భయపెట్టకూడదు. ప్రేమగా మాట్లాడుతూ అసలు విషయం రాబట్టే ప్రయత్నం చేయాలి.
- ఒక్కోసారి పిల్లలు తప్పు చేసినందుకు భయపడి అబద్ధం చెబుతారు. కొన్ని సందర్భాల్లో చేసిన తప్పు అమ్మానాన్నలకు తెలియకూడదనుకుంటారు. పిల్లలు ఏ ఉద్దేశంతో అబద్ధమాడుతున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయాలి.
- పిల్లలు అబద్ధం చెప్పారని తెలియగానే వాళ్లని దగ్గర కూర్చోపెట్టుకుని నిజం చెప్పడం ఎంత ముఖ్యమో వివరించి చెప్పాలి. అబద్దాలు చెప్పడం వల్ల కుటుంబ సభ్యులకు వారిమీద నమ్మకం పోతుందని తెలియజెప్పాలి.
- పిల్లలు అనుకోకుండా చేసే తప్పులకు కోప్పడి బెదిరిస్తే వెంటనే అబద్ధాలు చెప్పడం నేర్చుకుంటారు. అందుకే పిల్లల మీద అనవసరంగా అరవకూడదు. వాళ్లు ఏదైనా పొరబాటు చేస్తే మరోసారి అలా చేయవద్దని మెల్లగా నచ్చచెప్పాలి.
- కుటుంబంలో పెద్దలను చూసే పిల్లలు ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో పెద్దలు ఏ చిన్న అబద్ధం కూడా చెప్పకూడదు.

# పండ్లు, కూరగాయలను ఎలా శుభ్రం చేయాలంటే..!



మనం బజారు నుంచి తెచ్చుకున్న పండ్లు, కూరగాయలు తాజాగా కనిపిస్తున్నప్పటికీ వాటి మీద పురుగు మందుల అవశేషాలు, కొన్ని రకాల రసాయనాలు, దుమ్ము, ధూళి, క్రిమికీటకాల గుడ్లు లాంటివి ఉండవచ్చు. వీటివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఏర్పడుతుంటాయి. అందుకే పండ్లను తినేముందు, కూరగాయలను వండేముందు సరైన విధానంలో శుభ్రం చేయాలంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

- కూరగాయలను ముందుగా ఉప్పు, పసుపు కలిపిన నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాతనే ముక్కలుగా తరగాలి. ఒకవేళ వాటిని నిల్వ చేసుకోవాలనుకుంటే మాత్రం ముందుగా కడగకూడదు. అలా కడిగితే తేమ వల్ల బ్యాక్టీరియా పెరిగి కూరగాయలు తొందరగా పాడవుతాయి.
- ఆకుకూరలకు ముందుగా కాడలు తుంచి శుభ్రం చేయాలి. తరవాత ఆ ఆకులను జల్లి బుట్టలో వేసి పంపు నీళ్ల ధార కింద పెట్టి కడగాలి. ఇసుక, మట్టి లాంటివి పూర్తిగా పోయే వరకూ ఆకులను చేత్తో రుద్దుతూ కడగాలి. వర్షాకాలంలో మాత్రం ఆకులను కొద్దిసేపు ఉప్పునీటిలో నానబెట్టడం మంచిది.
- క్యాబేజీ, క్యాలీఫ్లవర్‌లను ఉప్పు నీళ్లలో పావుగంటసేపు ఉంచితే వాటిలోని పురుగులు బయటికి వచ్చేస్తాయి.
- బంగాళదుంప, చామదుంప, చిలకడ దుంప, కంద, ముల్లంగి, అల్లం, కేరట్‌లను మెత్తని బ్రష్ లేదా స్పాంజ్‌తో రుద్దుతూ కడిగితే వాటికి అంటుకుని ఉన్న మట్టి, బ్యాక్టీరియా తొలగిపోతాయి.

## యు ముంబా చేతిలో బుల్స్ చిత్తు



విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో భాగంగా ఇక్కడ జరిగిన పోరులో యు ముంబా ఘన విజయం సాధించింది. శుక్రవారం నాటి తొలి మ్యాచ్‌లో యు ముంబా 48-28తో బెంగళూరు బుల్స్‌ను చిత్తుచేసింది. ఈ సీజన్‌లో బెంగళూరుకిది వరుసగా మూడో ఓటమి. మ్యాచ్ ప్రారంభం నుంచే యు ముంబా ఆటగాళ్లు రైడింగ్, టాకిలింగ్‌లో వరుస పాయింట్లతో దూసుకెళ్లారు. ప్రథమార్ధంలో ముంబా రైడర్ అజిత్ చౌహాన్ అద్భుతమైన రైడ్‌లో ఒకేసారి ఆరు పాయింట్లు రాబట్టాడు. ఈ సీజన్‌లో ఒక రైడ్‌లో అత్యధిక పాయింట్లు రాబట్టిన రైడర్‌గా అజిత్ రికార్డు నెలకొల్పాడు. అజిత్ మొత్తంగా 13 పాయింట్లు సాధించాడు. ప్రథమార్ధాన్ని 29-12తో ముగించిన ముంబా.. ద్వితీయార్ధంలోనూ జోరు కొనసాగించింది. చివర్లో ముంబాను ఆలౌట్ చేసే అవకాశాలొచ్చినా బుల్స్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 37-32తో యూపీ యోధాస్‌పై గెలుపొందింది.

## అమ్మాయిలు.. అదిరేలా

### థాయ్‌లాండ్‌పై 11-0తో భారత్ విజయం

**మహిళల ఆసియా కప్ హాకీ**

హంగ్జౌ (చైనా): ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో సొంతగడ్డపై భారత పురుషుల జట్టు సత్తా చాటుతుంటే.. ఇదే జోరులో విదేశీ గడ్డపై మన అమ్మాయిలూ అదరగొడుతున్నారు. మహిళల ఆసియా కప్‌ను భారత జట్టు అద్భుత విజయంతో ప్రారంభించింది. పూల్-బిలో భాగంగా శుక్రవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 11-0తో థాయ్‌లాండ్‌ను చిత్తుగా ఓడించింది. ఉదితా దుహాన్ (30వ, 52వ), డంగ్ డంగ్ (45వ, 54వ) చెరో రెండు గోల్స్‌తో విజృంభించగా.. ముంతాజ్ (7వ), సంగీతా కుమారి (10వ), నవ్‌నీత్ కౌర్ (16వ), లాల్‌రేమ్సియామి (18వ), సుమన్ దేవి (49వ), షర్మిలా దేవి (57వ), రుతజా పిసల్ (60వ) తలో గోల్ కొట్టారు. భారత్ తన రెండో మ్యాచ్‌ను శనివారం జపాన్‌తో ఆడనుంది.

## ఫైనల్ బెర్త్ లక్ష్యంగా..

- పురుషుల హాకీలో చైనాతో భారత్ పోరు నేడు
- రాత్రి 7.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

రాజ్‌గిర్ (బిహార్): సొంతగడ్డపై చెలరేగుతున్న భారత పురుషుల హాకీ జట్టు ఆసియా కప్‌లో ఫైనల్ బెర్తే లక్ష్యంగా చైనాతో శనివారం అమీతుమీకి సిద్ధమైంది. సూపర్-4 దశలో తమ ఆఖరి మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాలన్న కసితో భారత్ బరిలో దిగనుంది. సూపర్-4లో భారత్.. మొత్తం నాలుగు పాయింట్లతో టాప్‌లో ఉంది. చైనా, మలేసియా చెరో మూడు పాయింట్లతో తర్వాతి స్థానంలో ఉండగా, కొరియా కేవలం ఒక పాయింట్‌తో చివర్లో ఉంది. ఈ నేపథ్యంలో చైనాతో మ్యాచ్‌ను కనీసం డ్రాగా ముగించినా, భారత్ ఫైనల్ చేరేందుకు అవకాశముంది. సూపర్-4లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది.

## ఆఖరి పోరులో సబలెంక x అమండా

**సెమీస్‌లో ఒసాక, పెగుల ఓటమి** | **యూఎస్ ఓపెన్**



అమండా

సబలెంక

న్యూయార్క్: టాప్ సీడ్ అర్యాన సబలెంక, ఎనిమిదో సీడ్ అమండ అనిసిమోవ యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంక (బెలారస్) 4-6, 6-4, 6-3తో నాలుగో సీడ్ పెగుల (అమెరికా)పై గెలుపొందింది. మరో సెమీఫైనల్లో లోకల్ స్టార్ అనిసిమోవ 6-7 (4), 7-6 (3), 6-3తో ఫ్లషింగ్ మెడోస్‌లో రెండుసార్లు చాంపియన్‌గా నిలిచిన నవోమి ఒసాక (జపాన్)ను చిత్తు చేసింది. ఈసారి అనిసిమోవ జోరు అలా ఇలా లేదు. క్వార్టర్‌ఫైనల్లో ఆరు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్, టైటిల్ ఫేవరెట్ స్వియటెక్‌కు షాకిచ్చిన అమెరికా యువ క్రీడాకారిణి సెమీఫైనల్లో..నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత నవోమి ఒసాకాకు ఝలకిచ్చింది. తద్వారా 24 ఏళ్ల అమండా వరుసగా రెండోసారి మేజర్ టోర్నీ తుదిపోరుకు చేరింది. వింబుల్డన్‌లోనూ అనిసిమోవ టైటిల్ ఫైట్‌కు చేరిన విషయం విదితమే. ముఖాముఖి పోరులో సబలెంకపై అనిసిమోవ 6-3తో ఆధిక్యంలో ఉండడం విశేషం. ఈ ఏడాది వింబుల్డన్ సెమీఫైనల్లో సబలెంకపై అమండాదే పైచేయి అయ్యింది. అనిసిమోవా-ఒసాక సెమీస్ తొలి రెండు సెట్లు నువ్వా..నేనా అనేలా సాగాయి. దాంతో రెండు సెట్లూ టైబ్రేకర్‌కు వెళ్లాయి. అయితే మొదటి సెట్‌ను ఒసాక సొంతం చేసుకోగా..రెండో సెట్‌ను అనిసిమోవ చేజిక్కించుకుంది. ఈనేపథ్యంలో నిర్ణాయక మూడో సెట్ హోరాహోరీగా సాగుతుందని అంచనా వేశారు. కానీ కీలక తరుణంలో నవోమి చేతులెత్తేసింది. ఫలితంగా ఆఖరి సెట్‌ను అలవోకగా కైవసం చేసుకున్న అనిసిమోవ మ్యాచ్‌ను ముగించేసింది. ఒసాక 15 ఏస్‌లతో విరుచుకుపడగా..అమండా 50 విన్నర్లతో ప్రత్యర్థిని బెంబేలెత్తించింది. ఇక..పెగులకు మరోసారి ఫ్లషింగ్ మెడోస్‌లో నిరాశ తప్పలేదు. గత సంవత్సరం ఫైనల్లోనూ పెగులపై సబలెంక విజయం సాధించడం గమనార్హం. ఈసారి సెమీస్‌లో సబలెంక ఎనిమిది ఏస్‌లు వేస్తే..పెగుల మూడింటికే పరిమితమైంది. ఇద్దరూ చెరో నాలుగు డబుల్‌ఫాల్ట్‌లు చేయగా..43 విన్నర్లతో ప్రత్యర్థిని సబలెంక ఉక్కిరిబిక్కిరి చేసింది.

**భాంబ్రి జోడీ ఓటమి**

కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరడం ద్వారా టైటిల్‌పై ఆశలు రేపిన భారత డబుల్స్ ఆటగాడు యుకీ భాంబ్రి ఫైనల్ మాత్రం చేరలేక పోయాడు. ఉత్కంఠ భరితంగా సాగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో భాంబ్రి/మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీ 7-6 (2), 6-7 (5), 4-6తో కుప్‌స్కీ/శాలిస్‌బరీ ద్వయం చేతిలో ఓటమి పాలైంది.

## పతకంపై జ్యోతి, దీపిక గురి

**నేటి నుంచి వరల్డ్ ఆర్చరీ**

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఇటీవలి కాలంలో నిలకడగా రాణిస్తున్న భారత స్టార్ ఆర్చర్ జ్యోతి సురేఖతో పాటు వెటరన్ దీపికా కుమారి శనివారం నుంచి జరిగే వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పతకమే లక్ష్యంగా బరిలోకి దిగనున్నారు. రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో భారత్ తరఫున పురుషులు, మహిళలు కలిపి 12 మంది ఆర్చర్లు పాల్గొంటున్నారు. జ్యోతి, పర్ణీత్, ప్రీతికలతో కూడిన మహిళల టీమ్‌పై ఈసారి కూడా భారీ అంచనాలున్నాయి. ఇక పురుషుల కాంపౌండ్‌లో ప్రథమేశ్, అమన్ సైనీ, రిషభ్ యాదవ్ ఈ ఏడాది అద్భుత ఫామ్‌లో ఉన్నారు. అయితే మహిళల రికర్వ్‌లో దీపిక, అంకిత, గథ ఖడకే సత్తా నిరూపించుకోవాల్సి ఉంది. శనివారం తొలి రోజు కాంపౌండ్ పోటీలు జరుగనున్నాయి.

## రాస్ టేలర్..మళ్లొచ్చాడు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ రాస్ టేలర్ తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. 2021, డిసెంబరులో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఈ 41 ఏళ్ల వెటరన్ తాజాగా సమోవా జట్టు తరఫున ఆడబోతున్నట్టు ప్రకటించాడు. టేలర్ తల్లిది సమోవా దేశం కావడంతో అక్కడి పాస్‌పోర్ట్ కూడా తనకు ఉంది. అంతేకాకుండా కివీస్ తరఫున ఆడి మూడేళ్లు పూర్తి కావడంతో టేలర్ మరో జట్టుకు ఆడడంలో ఎలాంటి ఇబ్బందీ లేదు. ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026లో చోటు కోసం ఆసియా-ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్స్‌లో సమోవా తరఫున టేలర్ బరిలోకి దిగుతాడు.

## అర్జున్ విజయం

సమర్‌ఖండ్: ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీ రెండో రౌండ్‌లో ఇరిగేసి అర్జున్.. ఆర్మేనియా ఆటగాడు మార్టిరోస్యన్‌పై విజయం సాధించాడు. అలాగే 15 ఏళ్ల ఇవాన్ జెమ్లాన్‌స్కీ (రష్యా)పై ప్రజ్ఞానంద నెగ్గాడు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ వైశాలి.. ఎలినే రోబర్స్ (నెదర్లాండ్స్)ను ఓడించింది. ఇక 14 ఏళ్ల చిచ్చరపిడుగు యాగిజ్ కాన్ (తుర్కియే)తో తలపడిన ప్రపంచ చాంపియన్ గుకేశ్ డ్రాతో సరిపెట్టుకున్నాడు. భారత ఆటగాళ్లు విదిత్ గుజరాతీ-అభిమన్యు మధ్య జరిగిన గేమ్ కూడా డ్రాగా ముగిసింది.

## 176 కి.మీ.. 44 గంటలు



**అత్యంత క్లిష్టమైన రేసును పూర్తిచేసిన తెలుగు రేసర్ విశ్వభరత్**

**ఈ ఘనత సాధించిన రెండో భారతీయుడిగా రికార్డు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన రేసుగా పేరుగాంచిన అల్ట్రా ట్రయల్ డు మోంట్ బ్లాంక్ (యూటీఎంబీ) వరల్డ్ సిరీస్ పరుగును ఆంధ్ర వెటరన్ అథ్లెట్ అల్లంశెట్టి విశ్వభరత్ విజయవంతంగా పూర్తి చేశాడు. పశ్చిమ ఐరోపాలో ఎత్తయిన పర్వత శిఖరమైన మోంట్ బ్లాంక్ మూడు దేశాల సరిహద్దుల నడుమ ఉంటుంది. 2018లో మనాలికి చెందిన షశ్వత్ తర్వాత ఈ రేసు పూర్తి చేసిన రెండో భారతీయుడు భరత్‌నే కావడం విశేషం. ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్లాండ్‌ల మీదుగా ప్రయాణించిన అనంతరం తిరిగి ఫ్రాన్స్‌లోని చమోనిక్స్‌లో రేసు ముగుస్తుంది. గత నెల 29న జరిగిన 176.5 కిలోమీటర్ల రేసును విశ్వభరత్ 44 గంటల 29 నిమిషాల్లో పూర్తి చేశాడు. రేసును 46 గంటల 45 నిమిషాల్లో పూర్తి చేయాల్సి ఉండగా నిర్దిష్ట సమయం కంటే ముందే భరత్ గమ్యానికి చేరుకొని, ఈ ఘనత సాధించిన రెండో భారతీయుడిగా ఖ్యాతి గడించాడు. ప్రాణ వాయువు తక్కువగా ఉండే ఎత్తయిన పర్వత శ్రేణులు, తీవ్రమైన గాలులు, శీతల వాతావరణం, ప్రతికూల పరిస్థితులను తట్టుకొని భరత్ ఈ రేసును ముగించాడు. రేసు మధ్యలో 81వ కి.మీ దగ్గర భరత్‌కు విపరీతమైన కాళ్ల నొప్పి వచ్చినా పట్టుదలతో పరుగును పూర్తిచేశాడు. ఫ్రాన్స్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న భరత్ స్వస్థలం గుంటూరు. కొవిడ్ లాక్‌డౌన్‌లో భరత్‌కు పరుగుపై ఆసక్తి కలగగా 2022 నుంచి ప్రొఫెషనల్ రన్నర్‌గా రేసుల్లో పాల్గొనడం ప్రారంభించాడు. 110 కిలోమీటర్ల యూటీఎంబీ వరల్డ్ సిరీస్ రేసులో ప్రతిభ ఆధారంగా ఈ 176 కిలోమీటర్ల రేసుకు అర్హత సాధించాడు. ఈ రేసుకు అర్హత సాధించడమే అత్యంత క్లిష్టమైన విషయమని విశ్వభరత్ చెప్పాడు. రెండేళ్ల ముందు నుంచే పలు క్వాలిఫయింగ్ ట్రయల్ రేసులను నిర్వహిస్తారని, అర్హత పాయింట్ల ఆధారంగా రన్నర్లకు ప్రధాన రేసుకు ఎంట్రీ లభిస్తుందని తెలిపాడు.

## బోణీ కొట్టిన సుమిత్, నీరజ్

### ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన సుమిత్ కుందు, నీరజ్ ఫొగట్ శుభారంభం చేశారు. సుమిత్ (75 కిలోలు) తొలి రౌండ్లో జోర్డాన్ బాక్సర్ మహ్మద్ అల్ హుస్సేన్‌ను ఓడించాడు. అలాగే మహిళల్లో నీరజ్ (65 కి) 3-2తో ఫిన్లాండ్‌కు చెందిన క్రిస్టా కొవలైనెన్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరింది. ఇక, మహిళల 70 కిలోల కేటగిరిలో సనమచా చాను 4-1తో డిటె ఫ్రోస్టోల్మ్ (డెన్మార్క్)పై గెలుపొంది ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.



## టైసన్..వన్స్‌మోర్!

### జూనియర్ మేవెదర్‌తో బౌట్

న్యూయార్క్: హెవీవెయిట్ ప్రపంచ మాజీ చాంపియన్ మైక్ టైసన్ మళ్లీ రింగ్‌లోకి అడుగు పెడుతున్నాడు. 'బాక్సింగ్ హాల్ ఆఫ్ ఫేమర్స్'లో భాగంగా వచ్చే ఏడాది టైసన్-ఫ్లాయిడ్ మేవెదర్ జూనియర్ మధ్య ఎగ్జిబిషన్ పోరు జరగనుంది. అయితే టైసన్, మేవెదర్ జూనియర్‌లను సంప్రదించాకే కచ్చితమైన తేదీ, వేదికను ఖరారు చేస్తారట.

# బిజినెస్

## జోరుగా తయారీ!

### జీఎస్‌టీ తగ్గించిన నేపథ్యంలో పండగ సీజన్ గిరాకీపై భారీ అంచనాలు



**ఉత్పత్తిని 25% వరకు పెంచిన కంపెనీలు**

న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో ఈసారి పండగ సీజన్‌లో వస్తు గిరాకీ భారీగా పెరగవచ్చని కంపెనీలు ఆశాభావంగా ఉన్నాయి. ఊపందుకోనున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా కంపెనీలు, ముఖ్యంగా కార్లు, ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల సంస్థలు తయారీని 25 శాతం వరకు పెంచినట్లు తెలిసింది. వస్తువుల తయారీకి అవసరమైన విడిభాగాల సమీకరణను సైతం గణనీయంగా పెంచాయి. తగ్గించిన జీఎస్‌టీ రేట్లు దుర్గా నవరాత్రుల ప్రారంభ రోజు (ఈ నెల 22) నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో పుంజుకోనున్న వస్తు గిరాకీ క్రిస్మస్ వరకు కొనసాగవచ్చని వ్యాపారులు భావిస్తున్నారు. సాధారణంగా కంపెనీలు పండగ సీజన్ కోసం ఆగస్టు-సెప్టెంబరులోనే ఉత్పత్తి పెంచుతాయి. అక్టోబరు-డిసెంబరు కాలంలో తమ పూర్తి తయారీ సామర్థ్యంలో 50-70 శాతాన్ని మాత్రమే వినియోగించుకుంటాయి. అధిక గిరాకీకి అనుగుణంగా సరఫరా చేసేందుకు ఈసారి ఏడాది చివరి వరకు ఉత్పత్తి సామర్థ్యాన్ని 100 శాతం ఉపయోగించుకోవాల్సి రావచ్చని చాలా వరకు కంపెనీలు భావిస్తున్నాయి.

### అదే బాటలో ఎలక్ట్రానిక్ కంపెనీలు

ప్రస్తుతం మార్కెట్లో 32 అంగుళాల కంటే అధిక సైజున్న టీవీలకే డిమాండ్ అధికంగా ఉంది. అన్ని సైజుల టీవీలు, ఏసీలు, మానిటర్లు, ప్రొజెక్టర్లు, డిష్‌వాషర్లపై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. దీంతో బడా సైజు టీవీల ధరలు కనీసం రూ.2,000 తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. కాబట్టి, ఈ పండగ సీజన్‌లో వీటి విక్రయాలు ఊపందుకోవచ్చన్న అంచనాలున్నాయి. భారీ టీవీల స్టాక్‌ను ఇప్పటికే సిద్ధం చేసుకున్న కంపెనీలు వచ్చే 2-3 నెలల్లో భారీగా లబ్ధి పొందనున్నాయని హాయర్ అప్లయెన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీశ్ అన్నారు. 32 అంగుళాల నుంచి అధిక సైజుకు మారాలనుకునే వారి కొనుగోళ్లు భారీగా పెరగవచ్చని, ఈ నేపథ్యంలో 43 అంగుళాలు, ఆపై సైజు టీవీల ఉత్పత్తిని 20 శాతం పెంచినట్లు ఆయన చెప్పారు. జీఎస్‌టీ తగ్గింపుతో తమ టీవీల ధరలను 8-10 శాతం మేర తగ్గించనున్నట్లు సోనీ ఇండియా తెలిపింది. రేట్ల తగ్గుదలతో డిమాండ్ 10 శాతం మేర పెరగవచ్చని కంపెనీ ఎండీ సునీల్ నయ్యర్ అన్నారు.

### ఏసీలకూ డిమాండ్

సాధారణంగా ఏసీల విక్రయాలు ఫిబ్రవరి నుంచి ఊపందుకుంటాయి. వీటిపై జీఎస్‌టీ గణనీయంగా తగ్గడంతో కస్టమర్లు ఈ పండగ సీజన్‌లోనూ ఏసీ కొనుగోళ్లకు ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి.

### చిన్న కార్ల తయారీ పెంపు

ప్రస్తుతం అన్ని కార్లపై జీఎస్‌టీ 28 శాతంగా ఉంది. కాగా, 4 మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లు, 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై జీఎస్‌టీని 18 శాతానికి తగ్గించారు. దీంతో పండుగ సీజన్‌లో చిన్న కార్లు, హ్యాచ్‌బ్యాక్‌లు, కాంపాక్ట్ ఎస్‌యూవీల కొనుగోళ్లు అనూహ్యంగా పెరగవచ్చని వాహన తయారీ సంస్థలు భావిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా కంపెనీలు ఈ మోడళ్ల ఉత్పత్తిని ఇప్పటికే పెంచినట్లు తెలుస్తోంది. పన్ను భారం తగ్గడంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ కార్ల విక్రయాలు 10 శాతం వరకు పెరగవచ్చని, ఈ ఏడాది ఇండస్ట్రీ విక్రయాల వృద్ధి 7-8 శాతానికి పెరగవచ్చని మారుతి సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ అన్నారు. జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణతో కార్ల డిమాండ్ ఒక్కసారిగా పెరగనుందని, అధిక గిరాకీ వచ్చే రెండు నెలల పాటు కొనసాగవచ్చని సిట్రోయెన్ కార్ల విక్రయ కంపెనీ స్టెల్లాంటిస్ ఇండియా ఆటోమోటివ్ బ్రాండ్స్ విభాగ డైరెక్టర్ కుమార్ ప్రియేష్ అన్నారు.

## 'ఆర్‌కామ్'ది మోసపూరిత ఖాతానే: బీఓబీ

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాను బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కూడా మోసపూరిత ఖాతాగా ప్రకటించింది. ఈ మోసంలో ఆ కంపెనీ మాజీ డైరెక్టర్ అనిల్ అంబానీ కూడా దోషి అని రెగ్యులేటరీ సంస్థలకు బ్యాంక్ తెలిపింది. ఫోరెన్సిక్ ఆడిట్ ఆధారంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఆర్‌కామ్‌కు రెండు విడతలుగా తాము రూ.2,462.5 కోట్ల రుణాలు మంజూరు చేస్తే, అందులో ఇప్పటికీ రూ.1,656.07 కోట్ల బకాయిలు చెల్లించలేదని పేర్కొంది. కాగా ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) ఇప్పటికే ఆర్‌కామ్ రుణ ఖాతాలను మోసపూరిత ఖాతాలుగా ప్రకటించాయి.

## వేదాంత చేతికి జేపీఎల్!

### రూ.17,000 కోట్లకు బిడ్

న్యూఢిల్లీ: జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్) దివాలా పరిష్కార ప్రక్రియ కొలిక్కి వచ్చిన సూచనలు కనిపిస్తున్నాయి. కంపెనీ రుణ దాతల కమిటీ (సీఓసీ) శుక్రవారం నిర్వహించిన చాలెంజ్ బిడ్డింగ్‌లో జేఏఎల్ ఆస్తులకు రూ.17,000 కోట్లు చెల్లించేందుకు అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంత గ్రూప్ బిడ్ దాఖలు చేసింది. అదానీ గ్రూప్ ఆఫర్ చేసిన రూ.12,505 కోట్ల కంటే ఇది రూ.4,495 కోట్లు ఎక్కువ. సీఓసీ ఈ బిడ్‌ను ఆమోదిస్తే జేఏఎల్ ఆస్తులు వేదాంత గ్రూప్ పరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు రూ.57,185 కోట్ల అప్పుల్లో ఉన్న జేఏఎల్.. రియల్టీ, సిమెంట్, పవర్, హోటల్స్, రహదారుల నిర్మాణ వ్యాపారాల్లో ఉంది.

## కేవీబీ వడ్డీ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) వడ్డీ రేట్లను తగ్గించింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు (0.10 శాతం) తగ్గించినట్లు ప్రకటించింది. అన్ని కాలపరిమితుల రుణాలకు ఇది వర్తిస్తుందని తెలిపింది. దీంతో ఏడాది కాలవ్యవధి కలిగిన ఆటో, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లు 9.55 శాతం నుంచి 9.45 శాతానికి తగ్గగా నెల, మూడు, ఆరు నెలల కాలానికి సంబంధించిన వడ్డీ రేట్లు 9.3 శాతం నుంచి 9.45 శాతం మధ్యన ఉంటాయని పేర్కొంది. తగ్గించిన వడ్డీ రేట్లు ఈ నెల 7 నుంచి అమల్లోకి వస్తాయని కేవీబీ వెల్లడించింది.

## విద్యపై పెట్టుబడితో వచ్చేదే అత్యుత్తమ రాబడి

**మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ట్రస్టీ రామ్‌దేవ్ అగర్వాల్**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యపై పెట్టే పెట్టుబడులపై వచ్చే రాబడులే అత్యుత్తమ రాబడులని మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ట్రస్టీ రామ్‌దేవ్ అగర్వాల్ అన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ (ఎంఓఈసీ) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఉద్దేశంతోనే ఐఎస్‌బీలో ఎంఓఈసీ ఏర్పాటుకు రూ.100 కోట్లు సమకూర్చినట్టు తెలిపారు. లెర్న్, ఎర్న్ (నేర్చుకో, సంపాదించు) అనేది తమ సిద్ధాంతమన్నారు. సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని మన జీవిత కాలంలోనే దేశానికి, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు ఇవ్వాలనే విషయాన్ని కూడా తాము ధృడంగా నమ్ముతామన్నారు. ఈ లక్ష్యంతోనే అనేక విద్యా సంస్థలకు మోతీలాల్ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూరుస్తున్నట్టు అగర్వాల్ తెలిపారు.

## సందేశాలపై తస్మాత్ జాగ్రత్త: సెబీ

న్యూఢిల్లీ: సెబీ పేరిట సామాజిక మాధ్యమ వేదికలపై సర్క్యులేట్ అవుతున్న సందేశాలు, నోటీసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్వెస్టర్లను సెబీ హెచ్చరించింది. అలాంటి మోసపూరిత సందేశాలకు స్పందించి వ్యక్తిగత సమాచారం ఏదీ పంచుకోవద్దని సూచించింది. ఇన్వెస్టర్లను తమ ఉచ్చులోకి లాగేందుకు మోసగాళ్లు సెబీ లోగో, లెటర్‌హెడ్, సీల్ కూడా కాపీ చేసిన సందర్భాలున్నట్టు తెలియచేసింది. భిన్న రకాల ఉల్లంఘనలపై రెగ్యులేటరీ చర్యలను నివారించుకునేందుకు పెనాల్టీలు లేదా ఫైన్ చెల్లించాలన్న బెదిరింపులు ఆ సందేశాల్లో వ్యాపింపచేస్తున్నట్టు తెలిపింది.

## మస్క్‌కు టెస్లా ట్రిలియన్ డాలర్ల ఆఫర్

### ప్రపంచ కార్పొరేట్ రంగంలో ఇదే అతిపెద్ద పారితోషిక ప్యాకేజీ

వాషింగ్టన్: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ టెస్లా సారథి ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే నం.1 ధనవంతుడన్న విషయం తెలిసిందే. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ డేటా ప్రకారం.. శుక్రవారం నాటికి ఆయన సంపద విలువ 378 బిలియన్ డాలర్లు. అంటే, 37,800 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో రూ.33.26 లక్షల కోట్ల పైమాటే. తాజాగా ఈ కుబేరుడికి ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ (లక్ష కోట్ల డాలర్ల సంపద కలిగిన వ్యక్తి)గా అవతరించే ఆఫర్ దక్కింది. వివరాల్లోకి వెళ్తే.. టెస్లా బోర్డు మస్క్‌కు భవిష్యత్‌లో ట్రిలియన్ డాలర్ల విలువ చేసే పనితీరు ఆధారిత భారీ పారితోషిక ప్యాకేజీని ఆఫర్ చేసింది. ప్రపంచ కార్పొరేట్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద ప్యాకేజీ. బీవైడీ, ఇతర చైనా కంపెనీల నుంచి పోటీ తట్టుకోలేక విక్రయాలు భారీగా తగ్గి డీలాపడిన టెస్లా.. ఈ ప్యాకేజీలో భాగంగా మస్క్‌కు అత్యంత భారీ లక్ష్యాలను నిర్దేశించింది.

కంపెనీ మార్కెట్ విలువను (క్యాపిటలైజేషన్) ప్రస్తుత 1.12 ట్రిలియన్ డాలర్ల నుంచి 8.5 ట్రిలియన్ డాలర్ల (8.5 లక్షల కోట్ల డాలర్లు) స్థాయికి చేర్చడం, కంపెనీ కార్ల వార్షిక విక్రయాలను గత ఏడాదిలో నమోదైన 20 లక్షల లోపు యూనిట్ల నుంచి 2 కోట్ల యూనిట్లకు పెంచడం, రోబో ట్యాక్సీలు, హ్యూమనాయిడ్ రోబోల అమ్మకాలను 10 లక్షల యూనిట్లకు పెంచడం అందులో ప్రధానమైనవి.

లక్ష్యాలన్నింటినీ చేరుకుంటేనే,ప్యాకేజీలో భాగంగా ఆఫర్ చేసిన 42.37 కోట్ల కంపెనీ షేర్లు మస్క్‌కు దక్కుతాయి. ప్రస్తుతం వాటి విలువ 8,780 కోట్ల డాలర్లు. పదేళ్లలో కంపెనీ మార్కెట్ విలువ 8.5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరితే ఆయన వాటా షేర్ల మొత్తం విలువ ట్రిలియన్ డాలర్లు దాటనుంది. ఈ ప్యాకేజీ ప్రయోజనాలు పూర్తిగా దక్కాలంటే, మస్క్ కంపెనీలో కనీసం ఏడున్నరేళ్లు కొనసాగాలి. పదేళ్లలో లక్ష్యాలన్నింటినీ సాధించాల్సి ఉంటుంది.

## హెచ్ఏఎల్‌కు తేజస్ యుద్ధ విమాన ఫ్యూజ్‌లేజ్

### అందజేసిన వేమ్ టెక్నాలజీస్


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయంగా అభివృద్ధి చేస్తున్న తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ ఎంకే 1ఏకి సంబంధించి రెండో సెంటర్ ఫ్యూజ్‌లేజ్ (ప్రధాన క్యాబిన్)ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న వేమ్ టెక్నాలజీస్ అందజేసింది. దేశీయ ఏరోస్పేస్ రంగంలో స్థానికంగా ఉన్న కంపెనీల ప్రాధాన్యం పెరుగుతుందనేందుకు ఇది సంకేతం. ఈ ఏడాది ఆరంభంలో హెచ్ఏఎల్‌కు ఎల్ అండ్ టీ.. కోయంబత్తూర్‌లోని తన ప్లాంట్ నుంచి ఏంకే 1ఏ కోసం వింగ్ అసెంబ్లీస్‌ను అందించింది. తాజాగా వేమ్ టెక్నాలజీస్ ఫ్యూజ్‌లేజ్‌ను అందించటం విశేషం. గడచిన మూడేళ్ల కాలంలో విమానాలకు సంబంధించి కీలక కాంపోనెంట్లు, కాంప్లెక్స్ సిస్టమ్స్ కోసం దేశీయ కంపెనీలకు హెచ్ఏఎల్ దాదాపు రూ.13,763 కోట్ల విలువైన కాంట్రాక్టులను అందించింది.

## ఆటుపోట్ల ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీ చెరోదారి

ముంబై: తీవ్ర ఆటుపోట్ల మధ్య సాగిన ట్రేడింగ్‌లో శుక్రవారం సెన్సెక్స్, నిఫ్టీ చెరోదారిలో ముగిశాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో షేర్లు అందించిన లాభాలను ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లు తుడిచిపెట్టాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 715 పాయింట్ల మేరకు ఊగిసలాడి ఒక దశలో 80,321.19 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరికి 7.25 పాయింట్ల నష్టంతో 80,710.76 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 6.70 పాయింట్ల లాభంతో 24,741 వద్ద ముగిసింది. వారం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే సెన్సెక్స్ 901.11 పాయింట్లు, నిఫ్టీ 314.15 పాయింట్లు లాభపడ్డాయి. శుక్రవారం ఈక్విటీ మార్కెట్ ఎలాంటి మార్పు లేకుండా తటస్థంగానే ముగిసినప్పటికీ ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి రికవరీ సాధించడం స్వల్ప సానుకూలతను సూచిస్తోందని విశ్లేషకులంటున్నారు.


**అదానీ పవర్ షేర్ల విభజన:** అదానీ పవర్ తన షేర్లను 1:5 నిష్పత్తిలో విభజించనుంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదారులు షేర్ల విభజనకు ఆమోదం తెలిపారని రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో అదానీ పవర్ తెలిపింది. తగినంత మెజారిటీతో వాటాదారులు ఈ తీర్మానాన్ని ఆమోదించినట్టు వెల్లడించింది. రిటైల్, చిన్న ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెంచేందుకు తీసుకున్న ఈ చర్య కింద రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరును రూ.2 ముఖ విలువ గల 5 షేర్లుగా విభజిస్తారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




| 6 తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 535 | విజయవాడ | 545 |
| వరంగల్ | 537 | గోదావరి | 545 |
| చిత్తూరు | 563 | విశాఖపట్నం | 555 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 98 | విజయవాడ | 127 |
| వరంగల్ | 98 | గుంటూరు | 115 |
| కరీంనగర్ | 98 | ఒంగోలు | 115 |
| మహబూబ్‌నగర్ | 98 | చిత్తూరు | 90 |
| కర్నూలు | 98 | నెల్లూరు | 95 |
| విశాఖపట్నం | 131 | అనంతపురం | 95 |
| గోదావరి | 127 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,07,620 ▲ | 98,650 ▲ | 1,36,500 ▼ |
| విజయవాడ | 1,10,300 ▲ | 1,04,000 ▲ | 1,27,000 ▼ |
| విశాఖపట్నం | 1,09,720 ▲ | 98,650 ▲ | 1,36,000 ▼ |
| రాజమండ్రి | 1,07,620 ▲ | 98,650 ▲ | 1,27,300 ▲ |
| ప్రొద్దుటూరు | 1,09,000 ▲ | 1,00,280 ▲ | 1,27,200 ▲ |
| ముంబై | 1,06,338 ▲ | 97,406 ▲ | 1,23,170 ▼ |

## 'టారిఫ్' బాధిత పరిశ్రమలకు కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: అమెరికా అడ్డగోలు సుంకాలతో ఇబ్బందులు పడుతున్న భారత పరిశ్రమలు, ఎగుమతిదారులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రం యోచిస్తున్నట్టు సమాచారం. ఎగుమతులపై ఆధారపడిన సంస్థలకు సులువుగా రుణాలు, మూల ధనం అందేలా చూడటం, కొత్త మార్కెట్లను అన్వేషించుకునేందుకు తోడ్పడటం వంటి చర్యలు చేపట్టనున్నట్టు తెలిసింది. కరోనా సమయంలో కుదేలైన చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు రూ.20 లక్షల కోట్లతో ఇచ్చిన రిలీఫ్ ప్యాకేజీ తరహాలో ఈ ప్యాకేజీ ఇవ్వనున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. సుంకాల దెబ్బకు ఎగుమతులు తగ్గిన సంస్థలు మూతపడకూడదని, ఉద్యోగాలేవీ పోకుండా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50శాతం సుంకాలు విధించడంతో.. మన దేశం నుంచి అమెరికాకు చేసే ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడిన విషయం తెలిసిందే. ముఖ్యంగా వస్త్రాలు, పాదరక్షలు, రసాయనాలు, యంత్ర పరికరాలు, రొయ్యలు, రత్నాలు-ఆభరణాల రంగాల పరిశ్రమలకు దెబ్బతగిలింది. కాగా, క్రెమ్లిన్‌కు భారత్ శుద్ధి కేంద్రంగా ఉపయోగపడుతోందంటూ ట్రంప్ వాణిజ్య సలహాదారు నవారో ఇటీవల చేసిన వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. నవారో వ్యాఖ్యలు తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జైస్వాల్ చెప్పారు. అమెరికాతో సంబంధాలు తమకెంతో ముఖ్యమని, రెండు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయన్నారు.

# భారత్, రష్యాను చైనాకు కోల్పోయాం

(మొదటి పేజీ తరువాయి)

ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేసి.. "చూడబోతే మనం (అమెరికా).. ఇండియాను, రష్యాను చీకటి దేశమైన చైనాకు కోల్పోయినట్టు కనిపిస్తోంది" అని పేర్కొన్నారు. అంతటితో ఆపలేదు.. 'ఆ మూడు దేశాలూ చిరకాలం వర్ధిల్లుగాక' అంటూ వ్యంగ్యాన్ని జోడించారు.

### అమెరికాలో ఎంత పెట్టుబడి పెడతారు?

యాపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా వంటి టెక్ దిగ్గజాల అధిపతులకు ట్రంప్ వైట్‌హౌస్‌లో గురువారం విందు ఇచ్చారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. "మీరంతా అత్యంత తెలివైన వ్యక్తులు. కచ్చితంగా ఇదొక హై-ఐక్యూ గ్రూప్. మీ అందరినీ చూసి నేను గర్విస్తున్నాను" అని ట్రంప్ పేర్కొన్నారు. తనవద్ద మైక్రోసాఫ్ట్ షేర్లున్నాయని.. అవి 28 డాలర్ల నుంచి 500కు పైగా డాలర్లకు చేరాయని చెబుతూ.. సత్య నాదెళ్ల బాగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. టిమ్ కుక్, బిల్‌గేట్స్, మెటా జుకెర్‌బెర్గ్, శామ్ ఆల్ట్‌మన్ తదితర టెక్ దిగ్గజాలు ఈ విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముందు.. ట్రంప్ భార్య మెలానియా ఒక సమావేశం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో సత్య నాదెళ్ల తర్వాత మాట్లాడిన బిల్‌గేట్స్.. తాను ఇప్పుడు జీవితంలో రెండో దశలో ఉన్నానని, సత్య నాదెళ్ల అద్భుతంగా పనిచేస్తుండడం వల్ల పెరుగుతున్న తన సంపదను దాతృత్వ కార్యక్రమాలకు ఖర్చుచేస్తున్నానని చెప్పినప్పుడు ట్రంప్ పెద్దగా నవ్వారు. 'రాబోయే రోజుల్లో అమెరికాలో ఎంత పెట్టుబడి పెడతారు?' అంటూ ట్రంప్ ఒక్కొక్కరిని ప్రశ్నించి, సమాధానాలు రాబట్టారు. అమెరికాలో గూగుల్ ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటోందని ప్రశ్నించగా.. దానికి సుందర్ పిచాయ్ వచ్చే రెండేళ్లలో 250 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.22 లక్షల కోట్ల) మేర పెట్టుబడులు పెడతామని చెప్పారు. అందుకు ట్రంప్ ఆయన్ను ప్రశంసించారు. మెటా, యాపిల్ సీఈవోలు 600 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని బదులిచ్చారు.



వైట్ హౌస్ విందులో జుకర్‌బర్గ్, ట్రంప్, మెలానియా, బిల్‌గేట్స్

### ఇండియా సారీ చెబుతుంది అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్

అధిక సుంకాలు విధిస్తే భారత్ దిగివస్తుందన్న భ్రమలు ఇప్పటికే పటాపంచలైనా.. అమెరికా అహం మాత్రం అణువంతైనా తగ్గలేదు! మరో నెలా, రెణ్నెల్లలో భారత్ తమకు సారీ చెప్పి వాణిజ్య ఒప్పందానికి అర్రులు చాస్తుందని ఆ దేశ వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ జోస్యం చెప్పారు. "నా ఉద్దేశం ప్రకారం.. నెల.. రెండు నెలల్లో భారతదేశం మాతో వాణిజ్య చర్చలకు కూర్చుని క్షమాపణ చెబుతుంది.. ట్రంప్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు.. రష్యా నుంచి చమురు కొనడం ఆపేయాలని, బ్రిక్స్‌లో భాగం కాకూడదని, అమెరికాకు, ఆ దేశ కరెన్సీ డాలర్‌కు మద్దతు తెలపాలని.. లేదా 50 శాతం సుంకాలను ఎదుర్కోవాలని రంకెలు వేశారు. చైనా, ఇండియా పరస్పరం తమ ఉత్పత్తులను అమ్ముకోలేవని.. రెండు దేశాలూ తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అమెరికాకు రావాల్సిందేనని వ్యాఖ్యానించారు. భారతదేశం గనక బ్రిక్స్ దేశాల నడుమ 'అచ్చు'లాగా (బ్రిక్స్ అనే ఆంగ్ల పదంలో ఇండియాను సూచించే 'ఐ' అనే అక్షరం సరిగ్గా మధ్యలో ఉంటుంది. దానికి ఎడమ పక్కన ఆర్ (రష్యా).. కుడిపక్కన సి (చైనా), అనే అక్షరాలు ఉంటాయి. అంటే రష్యా, చైనా దేశాలకు వారధిలాగా) ఉండాలనుకుంటే అలాగే ఉండొచ్చని.. అదెంతకాలం కొనసాగుతుందో తామూ చూస్తామని అహంకార పూరిత వ్యాఖ్యలు చేశారు.

## ఉక్రెయిన్‌కు మద్దతుగా దళాల్ని మోహరిస్తే సహించం!

- వాటిని కూడా లక్ష్యంగా చేసుకుంటాం
- మెక్రాన్ వ్యాఖ్యలపై పుతిన్ హెచ్చరిక

కీవ్, సెప్టెంబరు 5: ఉక్రెయిన్‌తో తమకు శాంతి ఒప్పందం కుదరటానికి ముందే ఆ దేశానికి మద్దతుగా ఎవరైనా సైనిక దళాలను మోహరిస్తే వాటిని కూడా తాము లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు మద్దతుగా శాంతి దళాల్ని మోహరించటానికి కట్టుబడి ఉన్నామని ఇటీవల పలు యూరప్ దేశాల అధినేతలు పునరుద్ఘాటించిన నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఉక్రెయిన్‌లో విదేశీ దళాల మోహరింపును తాము అంగీకరించబోమన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత దానికి రష్యా పూర్తిగా కట్టుబడి ఉంటుందని, ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదని పుతిన్ చెప్పారు. రష్యా-ఉక్రెయిన్‌లు ఒడంబడిక కుదుర్చుకొని యుద్ధాన్ని ఆపిన అనంతరం.. ఉక్రెయిన్‌పై మళ్లీ రష్యా దురాక్రమణకు పాల్పడకుండా ఆ దేశంలో సైనిక దళాల్ని మోహరించటానికి 26 దేశాలు అంగీకరించాయని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం ఓ సదస్సులో మాట్లాడుతూ, సెక్యూరిటీ గ్యారెంటీల అమలు (దళాల మోహరింపు?) ప్రారంభమైందని, వాటి వివరాలు వెల్లడించలేనని చెప్పటం గమనార్హం.

# చిత్రజ్యోతి


★ SINCE 1965 ★



## 'మంచు' ఆవిష్కరించిన చిరుగాలి పాట

నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్యారెడ్డి ప్రధాన పాత్రధారులుగా ఎం.నాగ రాజశేఖర్ రెడ్డి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ... చెలియా'. ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్ బేనర్‌పై రూపాశ్రీ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'నువ్వే చెప్పు చిరుగాలి' అంటూ సాగే పాటను మంచు మనోజ్ ఆవిష్కరించి చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. సుధీర్ బగడి సాహిత్యానికి ఎంఎం కుమార్ బాణీని అందించారు. సాయి చరణ్ ఆలపించారు. చిత్రం విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని యూనిట్ పేర్కొంది.

## 17 ఏళ్ల నాని!





హీరో నాని సినీ ప్రయాణం ప్రారంభించి 17 ఏళ్ల పూర్తయిన ప్రత్యేక సందర్భంగా ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'ద ప్యారడైజ్' చిత్రం నుంచి ఓ పవర్‌ఫుల్ స్టిల్ విడుదల చేశారు మేకర్స్. ఇందులో నాని కంప్లీట్ బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. ఈ పాత్ర కోసం నాని జిమ్‌లో బీభత్సంగా వర్కవుట్ చేస్తున్నారని ఈ స్టిల్ చూస్తే అర్థమవుతుంది. ప్రస్తుతం ప్యారడైజ్ చిత్రం టాకీ పార్ట్ షూటింగ్ ప్రత్యేకంగా వేసిన భారీ సెట్స్‌లో జరుగుతోంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 2026 మార్చి 26న మొత్తం ఎనిమిది భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

## ఓనమ్ స్పెషల్... దీపావళి విడుదల



యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం తాజా చిత్రం 'కె. ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్. కేరళ నేపథ్యంలో సాగే కథ కనుక ఓనమ్ పండగ సందర్భంగా ప్రత్యేక పోస్టర్ విడుదల చేశారు. సినిమాలో ఓనమ్ పండగ సెలబ్రేషన్స్‌తో సాగే పాటను ప్రత్యేకంగా చిత్రీకరించినట్లు నిర్మాతలు తెలుపుతూ దీపావళి సందర్భంగా అక్టోబర్ 18న చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తామని ప్రకటించారు. అలాగే మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ నెల 9న లవ్ మెలోడీ సాంగ్ 'కలలే.. కలలే' ను విడుదల చేస్తామని చెప్పారు. నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

## ఊహించని మలుపులతో అలరిస్తుంది




జేడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య, సీరత్‌కపూర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా జేడీ చక్రవర్తి మాట్లాడుతూ 'శివ మంచి నిర్మాణ విలువలతో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'జాతస్య మరణం ధ్రువం' అనే టైటిల్‌ను సూచించింది నేనే' అని చెప్పారు. శ్రవణ్ మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది' అని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి, పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని శివకుమార్ పేర్కొన్నారు.

## విడుదలకు సిద్ధం



రాజ్‌తరుణ్, సందీప్ మాధవ్ కథానాయకులుగా సీహెచ్ సుధీర్ రాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రామ్ భజరంగ్'. సిమ్రత్ కౌర్, మానసా రాధాకృష్ణన్ హీరోయిన్లు. స్వాతి సుధీర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. దీపావళికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సందీప్ మాధవ్, రాజ్ తరుణ్ మాస్ లుక్‌లో ఆకట్టుకున్నారు. 1980ల నాటి కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది, యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని దర్శకుడు తెలిపారు. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది అని నిర్మాత చెప్పారు.

## జిల్ జిల్





తమిళ చిత్రకథానాయకుడు విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వంలో రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ సినిమా నుంచి తాజాగా 'జిల్ జిల్' సాంగ్‌ను విడుదల చేశారు. భోలే షావలి రాసి పాడిన ఈ పాటను విజయ్ ఆంటోనీ స్వరపరిచారు. ఈ పాటలోని విజువల్స్ సినిమా మీద ఆసక్తి పెంచాయి. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ నెల 19న 'భద్రకాళి' చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తోంది. నటుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సపోర్ట్ కూడా ఉండడంతో ఈ ప్రాజెక్టుకు మరింత ప్లస్ అయింది. ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణసాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర తదితరులు నటించారు.

## వీర చంద్రహాస వస్తున్నారు



శివరాజ్‌కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న కన్నడ చిత్రం 'వీర చంద్రహాస'. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై ఎన్ఎస్ రాజ్‌కుమార్ నిర్మించారు. ఎంవీ రాధాకృష్ణ తెలుగులో విడుదల చేస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు రవి బస్రూర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 19న 'వీర చంద్రహాస'ను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. మహాభారతం నేపథ్యంలో కథ సాగుతుందని, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇస్తుందని మేకర్స్ తెలిపారు.

## చిన్న సినిమాకు పెద్ద విజయం



మౌళి తనుజ్, శివాని నాగరం జంటగా నటించిన 'లిటిల్ హార్ట్స్' చిత్రం శుక్రవారం విడుదలైంది. సాయిమార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్యా హసన్ నిర్మించిన చిత్రమిది. బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బన్నీ వాసు మాట్లాడుతూ 'చిన్న సినిమాకు ప్రేక్షకాదరణ ఎలా ఉంటుందో అనే సందేహం ఉంది, కానీ విడుదలైన అన్ని చోట్లా 'లిటిల్ హార్ట్స్' పాజిటివ్ టాక్‌తో కొనసాగుతోంది. చిన్న సినిమాకు ప్రేక్షకులు పెద్ద విజయం ఇచ్చారు' అని చెప్పారు. "సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత ఆ స్థాయి సక్సెస్‌ను అందుకుంటుందని అందరూ అభినందిస్తున్నారు' అని వంశీ నందిపాటి అన్నారు. 'పరిమిత బడ్జెట్‌తో ఓ మంచి లవ్ స్టోరీ తీస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మాను, 'లిటిల్ హార్ట్స్'తో ఆ నమ్మకం నిజమైంది' అని సాయిమార్తాండ్ తెలిపారు.

# మద్యం.. వద్దే వద్దు!

## మద్యపానంపై నిషేధం విధిస్తూ తీర్మానం.. తాగితే రూ.500, విక్రయిస్తే 10 వేల జరిమానా

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం నర్సింగపల్లి గ్రామం.. ఒకప్పుడు వలసల ఊరుగా పేరుండేది. ఉపాధి కోసం పెద్దయెత్తున ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడు వంశధార జలాలతో పరిస్థితి మారి, పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. మరోవైపు గ్రామాభివృద్ధి కోసం కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారు. తాజాగా ఒళ్లు, ఇళ్లను గుల్ల చేసే మద్యం రక్కసిని గ్రామం నుంచి తరిమికొట్టాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. మద్యం తాగినా, అమ్మినా.. జరిమానా విధించేలా తీర్మానం చేశారు. ఈ మేరకు అందరూ ప్రమాణం చేసి ఆదర్శంగా నిలిచారు.



మద్యపాన నిషేధ తీర్మానంపై చర్చించేందుకు సమావేశమైన గ్రామస్థులు

- శ్రీకాకుళం జిల్లా నర్సింగపల్లి గ్రామస్థుల ప్రమాణం

టెక్కలి రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని, కుటుంబాల ఆర్థిక పరిస్థితిని నాశనం చేస్తున్న మద్యాన్ని కట్టడి చేసేందుకు శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం నర్సింగపల్లి గ్రామస్థులు నడుంబిగించారు. బెల్ట్ షాపుల భరతం పట్టాలని సంకల్పించారు. గ్రామంలో మద్యపానాన్ని నిషేధిస్తూ ఇటీవల ఓ తీర్మానం చేశారు. మళ్లీ బుధవారంనాడు కొందరు పెద్దలు సమావేశమై గతంలో చేసిన మద్యపాన నిషేధ తీర్మానంపై చర్చించారు. గ్రామంలో ఎవరూ బెల్టు దుకాణాలు పెట్టొద్దని హెచ్చరించారు. మద్యం అమ్ముతున్నవారిని గుర్తించి జరిమానా విధించారు. వారి నుంచి మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

ఈ గ్రామంలో సుమారు 380 కుటుంబాలు ఉన్నాయి. గ్రామ ప్రజలు 1,300 మంది ఉంటారు. ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు కాగా.. ఆర్మీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. గ్రామానికి చెందిన చాలామంది సాటుసారా, మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. యువత తాగుడుకు అలవాటు పడి భవిష్యత్తును కోల్పోతున్నారు. తగాదాలతో కుటుంబాలకు దూరమవుతున్నారు. దీంతో గ్రామానికి చెడ్డపేరు వస్తుందని భావించి.. గ్రామస్థులంతా ఏకమై మద్యపానాన్ని నిషేధించాలని తీర్మానం చేశారు. గ్రామంలో బెల్టుషాపులు లేకుండా చూడాలని నిర్ణయించుకున్నారు. మద్యం తాగితే రూ.500, అమ్మినవారికి రూ.10 వేలు జరిమానా విధిస్తామని, వారిని పట్టించిన వారికి రూ.వెయ్యి బహుమతి అందిస్తామని తీర్మానం చేశారు. ఈ మేరకు అందరూ ప్రమాణం చేశారు.

**వలసల నుంచి అభివృద్ధి వైపు..**

నర్సింగపల్లికి వలసల గ్రామంగా పేరుండేది. సాగునీటి వనరులు లేక.. పంటలు పండక చాలా మంది హైదరాబాద్, విశాఖ, విజయవాడ తదితర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. గత టీడీపీ ప్రభుత్వం మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం మంజూరు చేసి ఈ ప్రాంతానికి వంశధార జలాలను అందిస్తుండడంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. దీంతో వలసలు తగ్గాయి.

### దాతల సహకారంతో గ్రంథాలయం

యువకులు చెడు వ్యసనాలకు బానిస కాకూడదనే ఉద్దేశంతో దాతల సహకారంతో 2017లో గ్రామంలో ఒక గ్రంథాలయాన్ని ప్రారంభించారు. పోటీ పరీక్షల పుస్తకాలను తెప్పించి నిరుద్యోగులకు అందించారు. గ్రంథాలయంలో చదువుకుని కొలువులు సాధించినవారు, వారి మొదటి జీతాన్ని గ్రంథాలయానికి ఇవ్వాలని నిర్ణయించారు. పదవీ విరమణ చేసిన కొంతమంది ఉద్యోగులు గ్రామాభివృద్ధి కమిటీగా ఏర్పడ్డారు.వీరు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంతోపాటు గ్రామస్థుల నుంచి విరాళాలు సేకరించి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. వీరి కృషితో యువకులు ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్నారు.

### చందాలు వేసుకుని టీచర్లకు జీతాలు

1995లో నర్సింగపల్లి గ్రామానికి జిల్లా పరిషత్ పాఠశాల మంజూరైంది. ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించకపోవడంతో గ్రామ కమిటీయే వలంటీర్లను ఏర్పాటు చేసింది. వారికి గ్రామస్థులు చందాలు వేసుకుని వారికి జీతాలు చెల్లించేవారు. 2005 వరకు ఈ పరిస్థితి ఉండేది. పదేళ్ల తర్వాత ప్రభుత్వం టీచర్లను నియమించింది. ఆతర్వాత కూడా పాఠశాలకు ఏం కావాలన్నా గ్రామస్థులే సమకూరుస్తున్నారు. దీంతో ఉత్తమ బోధన అందడంతో ప్రతి ఏడాది విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు.



నర్సింగపల్లి గ్రామం

### మా గ్రామం ఆదర్శంగా ఉండాలి



మా గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉండాలని నిత్యం తపిస్తుంటాం. అందుకే మద్యపానంపై నిషేధం విధించాం. దీనికి గ్రామస్థులు కూడా సహకరించడం ఆనందంగా ఉంది. కలిసికట్టుగా ఉంటే కలదు సుఖం అనే భావనలో మేమంతా ఉంటాం.

- పోలాకి షణ్ముఖరావు, మాజీ సర్పంచ్, నర్సింగపల్లి

### యువత చెడు మార్గంలో పడొద్దని..



గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామనే ఉద్దేశంతో అంతా కలిసికట్టుగా ఉంటాం. వలసల నుంచి అభివృద్ధి గ్రామంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. యువత చెడు మార్గంలో నడవకూడదనే ఉద్దేశంతో మద్యపాన నిషేధం విధించాం.

- దారపు పాపారావు, నర్సింగపల్లి

## నక్ష అమలుకు సమన్వయ కమిటీలు

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జి బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హేబిటేషన్ (నక్ష) అమలుకు రాష్ట్ర, పట్టణ స్థానిక సంస్థల సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీకి సీసీఎల్ఏ ఛైర్‌పర్సన్‌గా, సీడీఎంఏ, డీటీసీపీ, డైరెక్టర్ ఆఫ్ సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏపీ, తెలంగాణ జియో స్పేషియల్ డైరక్టరేట్ డైరెక్టర్, జీఐఎస్ టెక్నికల్ నిపుణులు, జీఐఎస్ ఇంజనీర్‌లు సభ్యులుగా, అడిషనల్ సీసీఎల్ఏ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు.

## స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్లు నియామకం

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు బోర్డు ఆఫ్ డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభిరాం ఉన్నారు. తాజాగా డైరెక్టర్లుగా ఆరుద్ర భూలక్ష్మి(మంగళగిరి), బొమ్మనయాని లక్ష్మణరావు(పార్వతీపురం), ఎం.నాగలక్ష్మి (విశాఖపట్నం), ముప్పాల వెంకటరమణ, ఎస్.పర్వీన్ బాను(కదిరి), బోలెం నాగమణి (అవనిగడ్డ), పరుచూరి భావని రవికుమార్(అనంతపురం), సలాది పట్టాభిరామయ్య(రామచంద్రపురం), బుచ్చ రాము (విశాఖపట్నం దక్షిణ), రెడ్డివారి మంజునాథ్ (పెనుకొండ), సానారెడ్డి కల్పనారెడ్డి(సర్వేపల్లి), చిన్ని శ్రీనివాసరావు(అద్దంకి), టంగుటూరి నాగమ్మ(తాడిపత్రి), కూచిపూడి ఉదయ భాస్కర్(గోపాలపురం)లను నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

## పదోన్నతులు పొందిన ఎంపీడీఓలకు పోస్టింగ్‌లు

కూటమి సర్కార్ వచ్చిన తర్వాత పంచాయతీరాజ్‌శాఖలో పదోన్నతుల ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే పలు కేడర్లకు పదోన్నతులు కల్పించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఇటీవల పలువురు డిప్యూటీ ఎంపీడీఓలు, మండలం/జడ్పీల్లో ఉన్న ఏఓలు, డీఎల్‌పీఓ కార్యాలయంలోని ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించారు. వారికి జిల్లాలను కేటాయిస్తూ కమిషనర్ కృష్ణతేజ తాజాగా ఆదేశాలిచ్చారు.

## నాలా ఆదాయం ఇక పంచాయతీలకే!

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994ను సవరిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. దీని ప్రకారం రెవెన్యూ శాఖ వసూలు చేస్తున్న నాలా ఫీజును ఇకపై పంచాయతీల అభివృద్ధికి కేటాయిస్తారు. ఇందుకోసం ఏపీ పంచాయతీరాజ్ సవరణ చట్టం 2025ను అమల్లోకి తెచ్చింది.

## సీపీడీసీఎల్‌లో 57 మందికి పదోన్నతులు

సీపీడీసీఎల్‌లో రెండున్నర దశాబ్దాలుగా పదోన్నతులకు నోచుకోని జూనియర్ ఇంజనీర్ల నిరీక్షణ ఫలించింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జూనియర్ ఇంజనీర్లు 57 మందికి సహాయక ఇంజనీర్లుగా పదోన్నతలు కల్పించారు. కూటమి ప్రభుత్వ చొరవతో తమకు పదోన్నతులు లభించాయని ఏపీ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కి, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డికి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ 'రణభేరి'

ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'రణభేరి' కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులను పోరాటానికి సిద్ధంచేసి 25న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్‌లు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో వారు 'రణభేరి' గోడపత్రికను ఆవిష్కరించారు.

## ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టండి: రామకృష్ణ

రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి రైతుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా యూరియా సక్రమ సరఫరాకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి అచ్చెన్నాయుడికి వినతిపత్రం అందజేశారు.

## ఉద్యోగుల బకాయిలు చెల్లించండి: బొప్పరాజు

నెల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావాల్సిన కోట్లాది రూపాయల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం నెల్లూరులో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు రూ.30 వేల కోట్లకుపైబడి బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. బకాయిల చెల్లింపులకు చర్యలు తీసుకోకపోతే త్వరలో జరిగే ఏపీజేఏసీ రాష్ట్రస్థాయి సమావేశంలో అందరితో చర్చించి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు.

## రాజకీయ వ్యవస్థల్లో మార్పు రావాలి: నారాయణ

కర్నూలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుత రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయి. రాజకీయ వ్యవస్థల్లో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ దివంగత సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణసభ కర్నూలు జడ్పీ సమావేశ భవనంలో శుక్రవారం జరిగింది. రాజ్యసభ మాజీ ఎంపీ, ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ వెంకటేశ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ... 'కర్నూలు జిల్లాతో సురవరానికి విడదీయరాని అనుబంధం ఉంది. ఎన్నికల ముందు మేనిఫెస్టోలు రాసుకునే రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చాక వాటిని పక్కన పడేస్తున్నాయి. మేనిఫెస్టో పక్కాగా అమలు చేయాలి. సురవరానికి, సీఎం చంద్రబాబుతో కూడా మంచి సాన్నిహిత్యం ఉండేది. రాజకీయ ప్రత్యర్థే తప్పా వ్యక్తిగతంగా విభేదాలు లేవు' అని వివరించారు. మాజీ ఎంపీ, ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ... కమ్యూనిస్టు నాయకులను చూస్తే తనకు భయం ఉండేదని, అయితే సురవరంని చూస్తే ఏమాత్రం భయం ఉండేది కాదని అన్నారు.

# నిధులున్నా ఖర్చు చేయరు

## గిరిజన సంక్షేమ శాఖలో దుస్థితి.. కూటమి ప్రభుత్వం చొరవతో కేంద్రం నుంచి నిధులు

- 500 కోట్లు వచ్చినా వాడుకోని వైనం
- డబ్బు విడుదలకు అధికారుల మోకాలడ్డు
- మంత్రి ఆదేశాలూ బేఖాతరు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏ ప్రభుత్వ శాఖ అయినా నిధులు లేక సంక్షేమ కార్యక్రమాలను పెండింగ్‌లో పెడుతుంది. కానీ గిరిజన సంక్షేమ శాఖ మాత్రం అందుకు భిన్నం. నిధులున్నా ఖర్చు చేయడానికి అధికారులకు మనసు రావట్లేదు. గిరిజన సంక్షేమంపై దృష్టి పెట్టడంలేదు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టకుండా కేంద్రమిచ్చిన నిధులను వృథా చేశారు. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. కేంద్రం నుంచి గిరిజన సంక్షేమ శాఖకు సుమారు రూ.500 కోట్లు విడుదలైనా.. ఆ శాఖ అధికారులెవ్వరూ నిధులను గిరిజనుల సంక్షేమానికి విడుదల చేసే ప్రయత్నం చేయడం లేదు. మంత్రి సంధ్యారాణి ఆదేశాలను ఉన్నతాధికారులు ఖాతరు చేయడం లేదంటున్నారు.

### కేంద్రం నుంచి నిధులకు నిర్విరామ కృషి

కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత గిరిజన సంక్షేమ శాఖకు వచ్చిన నిధులు, ఆర్థిక శాఖలో నిలిచిన నిధులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై కసరత్తు చేశారు. ఢిల్లీకి అధికారులను పంపి నిధులు రాబట్టేందుకు నిర్విరామ కృషి చేసి, సుమారు రూ.500 కోట్లు రాబట్టారు. ట్రైకార్ ద్వారా పీవీటీజీలకు గత టీడీపీ ప్రభుత్వం 2018-19లోనే రూ.20 కోట్లు రాబట్టింది. వైసీపీ ప్రభుత్వం ఆ నిధులు ఒక్క పైసా ఖర్చు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక శాఖలోనూ ఫైల్ క్లియర్ చేసి పీవీటీజీల అభివృద్ధికి నిధులను రెడీగా ఉంచారు. అయితే వాటిని ఖర్చు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు తయారుచేయడం గానీ, వాటిని అమలు చేయాలన్న ఆలోచన గానీ ఆ శాఖలో ఎవ్వరికీ లేకుండా పోయింది.

### బడ్జెట్ నిధులున్నా..

స్వయం ఉపాధి పథకాల అమలుకు కూటమి సర్కార్ రూ.170 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. గత ఏడాది ఆ నిధులను వాడుకోలేకపోయారు. ఈ ఏడాది వాడుకోనేందుకు ప్రణాళికలు రూపొందించేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో పాటు గిరిజన ప్రాంతాల్లో పాఠశాలల అభివృద్ధికి రూ.200 కోట్లు విడుదలైనా ఖర్చు చేసే పరిస్థితి లేదు. ఆర్టికల్ 275 నిధులు 2017-18లో రాష్ట్రానికి సుమారు రూ.150 కోట్లు విడుదలయ్యాయి. జగన్ సర్కార్ ఆ నిధులను పట్టించుకోలేదు. కూటమి సర్కార్ ఆ నిధులను ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినా.. ఒక్క అడుగు ముందుకు పడలేదు. గిరిజనుల అభివృద్ధికి షెడ్యూల్డ్ ట్రైబ్ కాంపోనెంట్ కేంద్రం నుంచి 2018-19లో రూ.100 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులను గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసే అవకాశమున్నప్పటికీ పట్టించుకోలేదు. పథకాలు అమలు చేస్తే అవినీతి జరుగుతుందంటూ అధికారులు విచిత్ర కారణం చెబుతున్నారు.

### నిధులు ఖర్చు చేస్తే మరిన్ని నిధులు..

కేంద్రమిచ్చిన గిరిజన సంక్షేమ నిధులు ఖర్చు చేస్తే మన రాష్ట్రానికి మరిన్ని నిధులు విడుదల అయ్యే అవకాశముంది. కూటమి సర్కార్ వచ్చిన మొదట్లో పలు ప్రణాళికలు రూపొందించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కసరత్తు జరిగింది. అయితే అధికారుల బదిలీలతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. గిరిజన సంక్షేమశాఖ మంత్రి, ముఖ్యకార్యదర్శి డైరెక్టర్ అందరూ ఎస్టీ వర్గానికి చెందిన వారైనప్పటికీ గిరిజనులకు న్యాయం జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజనుల సంక్షేమానికి సంబంధించి ముఖ్యమంత్రి పలు సూచనలు చేసినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. మంత్రి, ఉన్నతాధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో ఈ శాఖలో అభివృద్ధి నిలిచిపోయిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# అరాచకాల కి'లేడీ' అరుణ!

## పోలీసు విచారణలో ఒక్కొక్కటి వెలుగులోకి.. కోవూరులోని ఓ ఇంటికెళ్లి దొమ్మీ

- అరుణ నేరాల చిట్టా విప్పిన అనుచరులు!
- తాజాగా 'ఆయుధాల చట్టం' కేసు
- రెండు హత్యల్లోనూ ఆమె పాత్రపై అనుమానాలు
- నేరాలపై సిట్ తరహాలో విచారణ!



కోవూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కి'లేడీ' నిడిగుంట అరుణ అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నారు. నెల్లూరు జిల్లా కోవూరులోని ఓ ఇంటికి వెళ్లి దొమ్మీ చేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు అరుణ అనుచరులను ఇటీవల రెండు రోజులపాటు కస్టడీకి తీసుకుని చేసిన విచారణలో ఈ విషయం బయటపడినట్లు తెలిసింది. నెల్లూరులోని వెంకటేశ్వరపురం కాలనీకి చెందిన పల్లం వేణు, అంకెం రాజా, షేక్ అఫ్సర్, షేక్ మునీర్, మచ్చకర్ల గణేష్, ఎలీషాలను పోలీసులు విచారించారు. అరుణ నేరాల చిట్టా గురించి వారు చెప్పిన విషయాలను విన్న పోలీసులు విస్తుపోయినట్లు తెలిసింది.

### అరుణ నేరాల చిట్టా ఇదిగో..

అరుణపై ఇటీవల నెల్లూరులోని నవాబుపేట పోలీసుస్టేషన్‌లో ఆయుధాల చట్టం కింద ఓ కేసు నమోదైంది. గతంలో అన్నాదమ్ముళ్ల ఆస్తి వివాదంలో అన్న తరఫున తమ్ముడిని తుపాకీతో అరుణ బెదిరించినట్లు సమాచారం. ఒంగోలు జైలులో రిమాండు ఖైదీగా ఉన్న ఆమెను నవాబుపేట పోలీసులు పీటీ వారంటుపై కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంది. దీనికి తోడు తాజాగా కోవూరులో వెలుగులోకి వచ్చిన నేరంపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. విజయవాడలో ఓ నిరుద్యోగ యువకుడిని మోసం చేసినందుకు కోవూరులోనే కేసు నమోదు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కొడవలూరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన హిజ్రా హత్య కేసులోనూ అరుణ ప్రమేయముందని భావిస్తున్నారు. ఒంగోలులో జరిగిన ఓ హత్య కేసులోనూ ఆమె పాత్ర ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో జరిగిన ఓ యువకుడి అనుమానాస్పద మృతి కేసును పునర్విచారణ చేయనున్నట్లు తెలిసింది. కోవూరు మండలంలో గిరిజన మహిళలను మోసగించిందనే కేసును పరిశీలిస్తున్నారు. నెల్లూరు 'దిశ' పోలీసుస్టేషన్ కేంద్రంగా సాగిన అక్రమాలపై కూడా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

### డీజీపీ ఆఫీస్ నుంచి ఆదేశాలు!

రౌడీషీటరు శ్రీకాంత్ పెరోల్ విషయమై అరుణ ప్రభుత్వంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిసింది. అరుణ వ్యవహారాన్ని రాష్ట్రస్థాయి పోలీసు ఉన్నతాధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకుంటూ డీజీపీ కార్యాలయం నుంచే నెల్లూరు అధికారులకు ఆదేశాలు అందుతున్నాయి. దీంతో ఎప్పటికప్పుడు నేరాల విషయాన్ని రాష్ట్ర కేంద్రానికి చేరవేస్తున్నారు. ఆయుధాల చట్టంతో పాటు 2-3 హత్య కేసులు కూడా అరుణపై త్వరలోనే నమోదయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ నేరాలపై 'సిట్' తరహా విచారణకు ప్రభుత్వం ఆదేశించే అవకాశం ఉందని కొంతమంది అధికారులు అంటున్నారు. గతంలో నెల్లూరు ఎస్పీగా పనిచేసిన పీహెచ్‌డీ రామకృష్ణను ప్రత్యేకాధికారిగా నియమించారని ప్రచారం సాగుతోంది.

### హోంమంత్రి అయ్యేందుకే అనుచరులు

హోంమంత్రి కావాలనే లక్ష్యంతో అరుణ సాగించిన దందా చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యేగా పోటీ చేసి, ఆపై హోంమంత్రి అయ్యేందుకు జిల్లాలో అనుచరులను తయారు చేయడంపై ఆమె దృష్టి పెట్టినట్లు విచారణలో అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఆ అనుచరుల వివరాలను కూడా ఇప్పుడు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అరుణ నేరాల కూపీని పూర్తిగా తెలుసుకుంటేనే చర్యలు తీసుకొనే అవకాశముందని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

# నైరుతి కాలం పెరిగింది

- కొన్నేళ్లుగా రుతుపవనాల విస్తరణలో జాప్యం
- క్లైమేట్ చేంజ్‌తో గాడ్పులు, అతిశీతల గాలులు, ఆకస్మిక వరదలు
- ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర



ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కువ వర్షాలకు దోహదం చేసే నైరుతి రుతుపవనాల కాలం పెరిగిందని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. క్లైమేట్ చేంజ్ ప్రభావంతో కొన్ని సంవత్సరాల నుంచి నైరుతి రుతుపవనాల సీజన్‌లో అనేక మార్పులు వచ్చాయన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏయూలో నిర్వహించిన సైన్స్ కాంక్లేవ్‌కు హాజరైన ఆయన.. తొలుత వాతావరణంలో మార్పులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబరు వరకూ 4 నెలల కాలాన్ని నైరుతి రుతుపవనాల సీజన్‌గా పరిగణిస్తాం. అయితే కొన్నాళ్ల నుంచి రుతుపవనాల తీరులో అనేక మార్పులు వచ్చాయి. జూన్ 1న కేరళను తాకే విషయంలో మార్పులు పెద్దగా లేకపోయినా జూలై 15కు బదులు అదే నెల 8వ తేదీ నాటికే వాయవ్య భారతానికి విస్తరిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ 29వ తేదీకల్లా దేశం మొత్తానికి విస్తరించాయి. అలాగే సెప్టెంబరు 17 నుంచి రుతుపవనాల ఉపసంహరణ ప్రారంభం కావలసి ఉండగా కొద్ది సంవత్సరాల నుంచి కొంత జాప్యం జరుగుతోంది' అని తెలిపారు. ఈ ఏడాది నైరుతి సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని ఏప్రిల్ 15న ఇచ్చిన ముందస్తు అంచనాలో పేర్కొన్నామన్నారు. అధిక వర్షపాతం నమోదైన సమయాల్లో ఆకస్మిక వరదలు, కొండ చరియలు విరిగిపడడం, నగరాలు వరదల్లో చిక్కుకుంటాయని వివరించారు. పశ్చిమ హిమాలయ ప్రాంతాలైన జమ్ము కశ్మీర్, హిమాచలప్రదేశ్, ఉత్తరాఖండలో కొండ చరియలు విరిగిపడడానికి బలమైన రుతుపవనాల ప్రభావమే కారణమన్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వాయవ్య భారతంలో అధిక వర్షపాతం నమోదైందని, ప్రస్తుతం బిహార్, అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ తప్ప దేశంలో ఏపీ, తెలంగాణ సహా అన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో వాతావరణ బులెటిన్ల రూపకల్పనకు అనువుగా పలు మోడళ్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఏఐకు అనుగుణంగా సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.

### ప్రాణాలు తీస్తున్న పిడుగులు!

వాతావరణ మార్పుల ప్రభావంతో దేశంలో పిడుగులు, మెరుపుల తీవ్రతకు అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని మహాపాత్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఒడిశా, బిహార్‌లో పిడుగులు, ఉరుములు, మెరుపుల తీవ్రత ఎక్కువగా ఉండడానికి భౌగోళిక పరిస్థితులు కొంత కారణం కావచ్చన్నారు. నైరుతి సీజన్ ముగిసిన తర్వాత స్వల్పకాలం పసిఫిక్ మహాసముద్రంలో లానినా పరిస్థితులు ఏర్పడనున్నాయని ఆయన తెలిపారు. క్లైమేట్ చేంజ్ ప్రభావంతో దేశంలో వడగాడ్పులు, అతిశీతల గాలులు, కుంభవృష్టి వర్షాలు, ఆకస్మిక వరదల తీవ్రత పెరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేలా మరింత కచ్చితమైన బులెటిన్లు రూపొందించేలా అధ్యయనం చేస్తున్నామని వివరించారు.

## 13న బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ పరిసరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం శుక్రవారం నాటికి మధ్యప్రదేశ్, రాజస్థాన్ పరిసరాల్లో తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది ఏడో తేదీకల్లా వాయుగుండంగా బలపడి, ఆ తరువాత బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 13వ తేదీకల్లా ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీనివల్ల ఒడిశా, కోస్తాంధ్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణాల్లో ఎక్కువగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. శుక్రవారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరిగింది. దీని ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, మిగిలినచోట్ల ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

# లిక్కర్ స్కామ్‌లో వైఎస్ అనిల్ రెడ్డి పీఏ?

## దేవరాజన్‌ను ప్రశ్నిస్తున్న సిట్

- నిందితుడు బాలాజీదీ, ఈయనదీ కుప్పమే..
- రాజ్ కసిరెడ్డి ఇచ్చిన సొమ్ము అంతిమ లబ్ధిదారుకు?
- రాజ్ మనిషి చాణక్యతో రోజూ ఫోన్ సంభాషణ
- ధనుంజయ్, కృష్ణమోహన్, చెవిరెడ్డితో భేటీలు
- జగన్ ఆర్థిక వ్యవహారాలు చూసే అనిల్‌రెడ్డి
- విచారణలో కీలక సమాచారం ఇచ్చిన దేవరాజన్!

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ కుటుంబ వ్యాపారాలు చూసుకునే ఆయన సోదరుడు వైఎస్ అనిల్ రెడ్డికి వ్యక్తిగత సహాయకుడు దేవరాజన్‌ను లిక్కర్ స్కామ్‌లో సిట్ విచారిస్తున్నట్టు తెలిసింది. వైసీపీ హయాం నాటి ఈ కుంభకోణానికి సంబంధించిన కీలక సమాచారాన్ని రాబట్టినట్లు సమాచారం. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలానికి చెందిన దేవరాజన్.. అనిల్‌రెడ్డి వద్ద నమ్మకస్తుడిగా కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్నారు. అదే మండలానికి చెందిన బాలాజీ గోవిందప్ప(భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్)ను ఈ కేసులో సిట్ అధికారులు మూడు నెలల క్రితం అరెస్టు చేసి జైల్లో పెట్టారు. గోవిందప్పతో పాటు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, భూనేటి చాణక్య, రాజ్ కసిరెడ్డితో దేవరాజన్ నిరంతర సంబంధాల్లో ఉన్నారని చెబుతున్నారు. క్రమం తప్పకుండా ఫోన్లు చేస్తూ ఎప్పటికప్పుడు ఓకే.. గాట్ ఇట్.. రిసీవ్డ్.. అంటూ ఎస్ఎంఎస్‌లు పంపినట్లు టెక్నాలజీ సాయంతో 'సిట్' తేల్చింది. ఈ వ్యవహారాలన్నీ నిగ్గు తేల్చేందుకు దేవరాజన్‌ను విజయవాడకు పిలిపించి రెండు రోజులుగా ప్రశ్నిస్తోంది. 'ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, గోవిందప్పతో ఏమిటీ నీకున్న సంబంధం" అని ప్రశ్నించినట్టు సమాచారం. వ్యాపారుల నుంచి మద్యం ముడుపులు వసూలు చేసి రాజ్ కసిరెడ్డి ఆదేశాల మేరకు ఎవరి వాటా వారికి బూనేటి చాణక్య అనే వ్యక్తి చేర్చాడు. విచారణ సందర్భంగా.. 'చాణక్యతో ప్రతి రోజూ ఫోన్ ఎందుకు మాట్లాడా'వని ప్రశ్నించగా, అత్యంత కీలక సమాచారాన్ని దేవరాజన్ చెప్పినట్లు తెలుస్తోంది. ఆ సమాచారానికి తగిన ఆధారాలు సేకరించి వైఎస్ అనిల్ రెడ్డిని సిట్ విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని వేల కోట్లు అక్రమంగా ఆర్జించిన జగన్ ఆ డబ్బును వైట్ మనీగా చూపించుకునే క్రమంలో సండూర్ పవర్ ప్లాంట్, సరస్వతి పవర్, భారతీ సిమెంట్స్, కార్మెల్ ఏషియా వంటి పరిశ్రమలతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లోనూ పెట్టినట్లు సీబీఐ తేల్చింది. చెన్నైలో సొంత వ్యాపారాలు చేసుకుంటూ.. జగన్ ఆర్థిక వ్యవహారాలను కూడా అనిల్ రెడ్డి చక్కబెడుతున్నారు.



రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందిన ఉత్తమ ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, విద్యాశాఖ అధికారులు

## సీఎం హెలికాప్టర్ మారింది!

- మరో కంపెనీ చాపర్‌ను అద్దెకు తీసుకున్న ప్రభుత్వం
- సీఎం కోసం హెలికాప్టర్ కొన్నారన్న ఫేక్ ప్రచారంపై ప్రభుత్వం సీరియస్



అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు వినియోగిస్తున్న హెలికాప్టర్‌ను మార్చారు. బెల్ కంపెనీకి చెందిన చాపర్‌ను సీఎం సహా వీవీఐపీల పర్యటనల కోసం అద్దె ప్రాతిపదికన ప్రభుత్వం ఇన్నాళ్లూ వినియోగించింది. అయితే అందులో తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతుండడంతో దాని స్థానంలో ఎయిర్‌బస్ కంపెనీ హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకున్నారు. సీఎం పర్యటన సందర్భంగా ఓసారి.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పర్యటనలో మరోసారి బెల్ హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు వచ్చాయి. గోయల్ గతంలో రాష్ట్ర పర్యటనకు వచ్చిన సమయంలో తిరుపతి నుంచి కృష్ణపట్నం పోర్టుకు బెల్ హెలికాప్టర్‌లో వెళ్లాల్సి ఉండగా.. సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆయన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇటీవల కాలంలో పలుమార్లు సాంకేతిక సమస్యలు తలెత్తడంతోపాటు టేకాఫ్‌కు ఎక్కువ సమయం తీసుకోవడం వంటి ఇబ్బందులు వచ్చాయి. దీంతో ఈ హెలికాప్టర్‌ను కొనసాగించవచ్చా? లేదా? అనే అంశంపై పరిశీలన చేసిన భద్రతా సిబ్బంది.. దాని స్థానంలో వేరే హెలికాప్టర్‌ను వినియోగించాలని సూచించారు. ఈ మేరకు ఎయిర్‌బస్ హెచ్ 160 చాపర్‌ను అద్దెకు తీసుకున్నారు. ఇప్పటి వరకు హెలికాప్టర్ వినియోగానికి ప్రభుత్వం ఎంత ఖర్చు పెడుతుందో.. తాజాగా అద్దెకు తీసుకున్న దానికి కూడా దాదాపు అంతే ఖర్చు కానున్నట్లు సమాచారం. ఎయిర్‌బస్ చాపర్ గతంలో వాడిన దానికన్నా అధునాతనమైనది. దీనిలో నేరుగా రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా ప్రయాణం చేయవచ్చు. భద్రతాపరంగా కూడా గత హెలికాప్టర్ కంటే మెరుగైనది. కాగా, అద్దె హెలికాప్టర్‌ను వినియోగిస్తుంటే కొత్త హెలికాప్టర్ కొనుగోలు చేశారనే ఫేక్ ప్రచారాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. తప్పుడు ప్రచారంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నవారిపై కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

### 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 18 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈమేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం నోటిఫికేషన్ ఇచ్చారు. 18వ తేదీ ఉదయం 9 గంటలకు శాసన మండలి, 10 గంటలకు శాసనసభ సమావేశమవుతాయి. మొదటి రోజు సమావేశం అనంతరం రెండు సభల బీఏసీ సమావేశాలు జరుగుతాయి. బీఏసీ సమావేశాల్లో అసెంబ్లీని ఎన్ని రోజులు నిర్వహించాలి, అజెండా తదితర అంశాలపై నిర్ణయం తీసుకుంటారు.

### యూరియా పంపిణీపై దృష్టి సారించండి

- కలెక్టర్లకు మంత్రి అచ్చెన్న ఆదేశం

యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యను అధిగమించాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. యూరియా సక్రమంగా సరఫరా జరిగేలా చూడాలని, అవసరమైతే టోకెన్ పద్ధతిలో పంపిణీ చేయాలని సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, కడప, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లతో మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిల్వలు ఎక్కువ ఉన్నచోట నుంచి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు యూరియా తరలించాలన్నారు. కాకినాడ, గంగవరం పోర్టుల నుంచి 53వేల టన్నుల యూరియా సమయానికి చేరుకునేలా పోర్టు, రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు.

### గురువులపై వైసీపీ జుగుప్సాకర వ్యాఖ్యలు: లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'టీచర్లూ... మీపై వైసీపీ చేసిన అతి జుగుప్సాకరమైన వ్యాఖ్యలపై తగు రీతిలో స్పందించండి' అని మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. 'భావిభారత పౌరులను తీర్చిదిద్దుతూ, బాధ్యతాయుతంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను వైసీపీ నీచంగా చిత్రీకరించింది. వైసీపీ ఫేక్ హ్యాండిల్ నేడు ఒక ఫొటోను షేర్ చేసింది. దానికింద రాష్ట్రంలో టీచర్లు తాగి బెంచీల కింద పడుకుంటున్నారంటూ అతి జుగుప్సాకర వ్యాఖ్యానం ఉంది. ఎక్కడో పక్క రాష్ట్రంలో ఏదో ఒక సందర్భంలో బయటకు వచ్చిన ఫొటోను ఏపీలో జరిగినట్లు చెప్పడం క్షమించరాని నేరం. విద్య నేర్పే గురువుల పట్ల కూడా అతి నీచంగా వ్యవహరించిన వైసీపీ నీతిబాహ్యమైన చర్యల్లో మరో మెట్టు దిగజారింది' అని లోకేశ్ విమర్శించారు.

### ఇంకా సకల శాఖా మంత్రిననే భ్రమలోనే సజ్జల

- లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆగ్రహం

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సజ్జల రామకృష్ణారెడ్డి... సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మండిపడ్డారు. 'సజ్జల.. జగన్ దగ్గర బంట్రోతు, కార్పొరేటర్‌గా కూడా గెలవని వ్యక్తి.. అలాంటివాడు ప్రతిపక్ష హోదా గురించి మాట్లాడటం హాస్యాస్పదం. సజ్జల, భార్గవ్, జగన్‌తోసహా వైసీపీ నేతలందరూ జైలుకు వెళ్లడం ఖాయం' అని పిల్లి హెచ్చరించారు. కాగా, సజ్జల వ్యాఖ్యలపై ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ కార్యాలయాలకు త్వరలో టూలెట్ బోర్డులు పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు.

### పిల్లాడిలా మారాం చేస్తున్న జగన్: రఘురామ

కాళ్ల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): చందమామ కోసం చంటి పిల్లాడు మారాం చేసినట్లు ప్రతిపక్ష హోదా కోసం జగన్ మారాం చేస్తున్నాడని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. '18 స్థానాలు ఉంటేనే ప్రతిపక్ష హోదా అర్హత పొందుతారనే విషయం తెలిసి కూడా హోదా కావాలనడం విడ్డూరంగా ఉంది. శాసనసభకు రానంటూ జగన్ మారాం చేస్తే పులివెందులకు కూడా బైఎలక్షన్ వస్తుంది' అని రాఘురామరాజు అన్నారు.

### సంక్షేమ రాజ్య సాకారానికి కూటమి కృషి: యనమల

జీఎస్టీ తగ్గింపు పేదల వినియోగ వ్యయాన్ని తగ్గించడానికి దోహదపడుతుందని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని టీడీపీ నేత యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న సంక్షేమ రాజ్య సాకారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

### బీసీ సంక్షేమ శాఖకు స్కోచ్ అవార్డు

బీసీ సంక్షేమ శాఖకు స్కోచ్ అవార్డు వరించింది. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ బీసీ యువతకు శిక్షణ అందజేసినందుకు 2025 సంవత్సరానికి గాను అవార్డు లభించింది. ఈ అవార్డును 20న న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. స్కోచ్ అవార్డు బీసీ సంక్షేమశాఖను వరించడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు.

### అన్నీ ఇచ్చాం.. అందుకే సూపర్ హిట్ సభ: కొల్లు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చారు. అందుకే 10న సూపర్‌హిట్ సభను పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నాం' అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అనంతపురంలో జరగబోయే 'సూపర్ సిక్స్- సూపర్ హిట్' సభ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు.

# నేను నిత్య విద్యార్థిని

- రోజూ కొత్త విషయం నేర్చుకుంటా
- దేశంలో రాష్ట్రం నం.1 కావాలి
- అందుకే నిరంతరం నేను పనిచేస్తా
- సీఎం వెల్లడి..టీచర్లకు అవార్డుల ప్రదానం

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాను నిత్య విద్యార్థిని అని, ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొత్తగా నేర్చుకున్న విషయాల ద్వారా ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందా అని నిత్యం ఆలోచిస్తానన్నారు. అలాగే బోధనలోనూ అనేక మార్పులు రావాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనావిధానం మారాలని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విజయవాడలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. 175 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానంచేశారు. అనంతరం వారిని ఉద్దేశించి సీఎం మాట్లాడారు. "గురువులకే గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్. నేను తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పటినుంచీ విధిగా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి హాజరవుతున్నాను. ఉత్తమ టీచర్లు ఈ సభలో పలు సూచనలు చేశారు. వాటిని ఒక పుస్తకంగా తీసుకొస్తాం." అని చంద్రబాబు తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. .

### నేతల పిల్లలు చదవరు..కానీ,

"సాధారణంగా రాజకీయ నాయకుల పిల్లలు సరిగా చదువుకోరు. లోకేశ్ తన తాత సీఎం అయ్యాక పుట్టాడు. ఆ తర్వాత నేను సీఎం అయ్యాను. కుటుంబంలో ఇలాంటి పరిస్థితి ఉంటే చాలా మంది చదవరు. ఇతర అలవాట్లు పెంచుకుంటారు. కానీ లోకేశ్ ఉన్నత విద్యను అభ్యసించారు. ఆ ఘనత వాళ్ల అమ్మదే."

**నేను అడిగినా సీటు ఇవ్వలేదు:** "ఒకప్పుడు నేను ఐటీ అంటే ఎగతాళి చేశారు. నేను మొదట్లో సీఎంగా ఉన్నప్పుడు ఐఐటీల్లో మన విద్యార్థులు చాలా తక్కువగా ఉండేవారు. వారి సంఖ్య పెంచాలని విద్యావేత్త చుక్కా రామయ్యను పిలిపించి మాట్లాడాను. ఆయన 10వేల మందికి పరీక్ష పెట్టి 100 మందిని ఎంపిక చేస్తారు. అందరూ ఐఐటీల్లో సీట్లు సాధిస్తారు. ఆయన ఇన్‌స్టిట్యూట్‌లో సీట్లు కావాలని కొందరు నన్ను అడిగేవారు. ఆయనకు ఫోన్ చేసి అడిగితే ఏమైనా అడగండి కానీ సీటు మాత్రం అడగొద్దని ఖరాఖండీగా చెప్పారు. అలా అంటే సీఎంలుగా ఉండేవాళ్లకు కోపం వస్తుంది. కానీ నాకు ఆయనపై గౌరవం పెరిగింది".


'ఉత్తమ' విధానాలు ఇవీ...



విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వినూత్న పద్ధతిలో చేపట్టిన బోధనా విధానాలను, పాఠశాల అభివృద్ధికి, మెరుగైన ఫలితాల సాధన కోసం చేసిన కార్యక్రమాలను ఉత్తమ ఉపాధ్యాయులు వివరించారు. వీటన్నింటినీ కార్డులపై రాసి గురుపూజోత్సవంలో ప్రదర్శించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) ఎం.మంగరాణి డిజిటల్ టెక్నాలజీ సాయంతో పాఠాలు చెప్పిన విధానాన్ని ఇలా ఈ కార్డుపై రాశారు. 1500కు పైగా వీడియోలు రూపొందించి విద్యార్థులకు అందుబాటులో ఉంచడంతో పాటు కంటెంట్ తయారీలో 10 వేలమందికి పైగా టీచర్లకు శిక్షణ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

### ప్రతి స్కూల్‌లో సోషల్ మీడియా

"ప్రతి పాఠశాలలో సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఏర్పాటుచేసుకోవాలి. పూర్వవిద్యార్థులను అందులో మమేకం చేయాలి. బదిలీల్లో కౌన్సెలింగ్ ప్రవేశపెట్టి టీచర్ల గౌరవం పెంచాం. నా పాలనలో టీచర్లు, ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవు. పరిశ్రమలకు ఏది అవసరమో సిలబస్ అలా మారాలి."

### సభలో నవ్వులు

ఉపాధ్యాయ దినోత్సవంలో చంద్రబాబు నవ్వులు పూయించారు. మంత్రి లోకేశ్‌కు ఎంత ఎక్కువగా టెక్నాలజీ తెలిసినా తనతో పోటీ పడలేరని సరదాగా వ్యాఖ్యానించారు. మనవడు దేవాన్ష్ మాట్లాడేది తనకు అర్థంకావట్లేదని, అంత స్పీడ్‌గా ఉన్నాడన్నారు. "మన కంటే ఇతర రాష్ట్రాలు ముందుంటే నేను సహించలేను. నాకు అసూయ. అందుకే రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి నిరంతరం పనిచేస్తుంటాను." అని సీఎం వ్యాఖ్యానించడంతో అందరూ గట్టిగా నవ్వారు.

"సీఎం చంద్రబాబుతో పనిచేయడం అంత తేలిక కాదు. మంత్రిగా ఒకరోజు సెలవు కావాలని అడిగితే ఎందుకని అడిగారు. మా అబ్బాయి దేవాన్ష్ స్కూల్‌లో పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు వెళ్లాలని చెప్పా. ఆతర్వాత అన్ని పాఠశాలల్లో మెగా పీటీఎంలు నిర్వహించాం." - లోకేశ్

## నాన్నే నా తొలి గురువు

- స్కూల్‌లో మాది రౌడీ బ్యాచ్... బ్యాక్ బెంచ్ విద్యార్థిని
- ఆ ఉపాధ్యాయుల వల్లే క్రమశిక్షణ అలవడింది: లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): "నాకు తొలి గురువు మా నాన్న చంద్రబాబు గారే. నేను స్టాన్‌ఫోర్డ్ వరకూ వెళ్లి చదివి, నేడు మంత్రిని అయ్యానంటే నాకు చదువు చెప్పిన టీచర్లే కారణం" అని మంత్రి లోకేశ్ అన్నారు. శుక్రవారం విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "స్కూల్‌లో మాది రౌడీ బ్యాచ్. నేను బ్యాక్ బెంచ్ విద్యార్థిని. నన్ను తీర్చిదిద్దింది మా టీచర్ మంజుల, ప్రిన్సిపాల్ రమాదేవి. ఆ తర్వాత పి.నారాయణ (ప్రస్తుత మంత్రి). యూనివర్సిటీ స్థాయిలో ప్రొఫెసర్ రాజిరెడ్డి. ఈ నలుగురి వల్లే ఉన్నత విద్యను అభ్యసించగలిగాను. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని నేను ఇచ్చిన పిలుపునకు టీచర్లు అద్భుతంగా స్పందించారు. కొన్ని పాఠశాలల్లో 'నో అడ్మిషన్' బోర్డు పెట్టే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పిస్తే జీరో ఇన్వెస్ట్‌మెంట్" అని లోకేశ్ తెలిపారు. 'డీఎస్సీ అంటే చంద్రబాబు... చంద్రబాబు అంటే డీఎస్సీ' అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. "ఈ ప్రభుత్వంలో మొదటి ఏడాది సంస్కరణలకు ప్రాధాన్యం ఇచ్చాం. ఇకపై ఫలితాలు రాబట్టాలనేది లక్ష్యం. గతప్రభుత్వంలో టీచర్లను వైన్‌షాపుల ముందు కాపలాపెట్టారు. ఈప్రభుత్వంలో టీచర్లకు ఇబ్బందులు తప్పించాం." అని లోకేశ్ కోరారు.

**నారాయణ సార్... ఎంతో నేర్పించారు:** విద్యార్థి దశలో తనకు మంత్రి పి.నారాయణ ఎంతో నేర్పించారని లోకేశ్ అన్నారు. "అప్పట్లో ఫండమెంటల్‌గా నేను వీక్‌గా ఉన్నానని నారాయణ సార్‌ను పిలిపించి... మావాడు కొంచెం వీక్‌గా ఉన్నాడు అని బ్రిడ్జి కోర్సు నేర్పించారు. అది నాకు ఎంతో ఉపయోగపడింది. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్- టీచర్స్ మీటింగ్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. ఒకేరోజు 50లక్షల మందికిపైగా టీచర్లు, తల్లిదండ్రులతో నిర్వహించినందుకు ఈ గుర్తింపు దక్కింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గిన్నిస్ రికార్డుల ప్రతినిధి ఈ గుర్తింపు పత్రాన్ని చంద్రబాబుకు అందజేశారు." అని లోకేశ్ తెలిపారు.

# స్మార్ట్ ఉపాధ్యాయులు కావాలి

- స్మార్ట్ తరగతి గదులకంటే వీరివల్లే ఉపయోగం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటన
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 60మంది టీచర్లకు అవార్డుల ప్రదానం


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న శ్రీదేవి, విజయలక్ష్మి, దేవానందకుమార్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ తరగతి గదులు, స్మార్ట్ నల్లబల్లల కంటే స్మార్ట్ టీచర్లే ముఖ్యమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. "సమాజ అవసరాలను, దేశ ప్రయోజనాలను నెరవేర్చేలా విద్యార్థులను తీర్చిదిద్దే సత్తా వారికి మాత్రమే ఉంది" అని తెలిపారు. ప్రపంచంలోనే సుసంపన్న జ్ఞానం కలిగిన సూపర్ పవర్‌గా...భారత్‌ను జాతీయ విద్యావిధానం తయారుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన కాలం తన జీవితంలో అతి మధురమైనదంటూ.. అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులను రాష్ట్రపతి అవార్డులతో సత్కరించారు.

### టీచర్ల సేవలు శ్లాఘనీయం : మోదీ

టీచర్లకు అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. అవార్డు విజేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పిల్లలకిచ్చే హోంవర్క్‌లో స్వదేశీ ఉత్పత్తులకు ప్రచారం, మేక్ ఇన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్ వంటి అంశాలు ఉంటే బాగుంటుందని మోదీ సూచించారు.

### వీరే మన ఉత్తమ టీచర్లు..

- ఏపీకి మూడు అవార్డులు

తెలుగు రాష్ట్రాల నుంచి ఏడుగురు ఉపాధ్యాయులు రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. ఉన్నత విద్యాసంస్థలు, పాలిటెక్నిక్ కళాశాల కేటగిరిలో.. ఐదుగురు అధ్యాపకులు అవార్డులను తీసుకున్నారు. వీరిలో ప్రొఫెసర్ జె.విజయలక్ష్మి (స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ), మెండా దేవానందకుమార్ (డాక్టర్ లక్కిరెడ్డి హన్మిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మైలవరం) ఉన్నారు.. తెలంగాణ నుంచి ప్రొఫెసర్ సాంకేత్ గోయల్ (బిట్స్ పిలాని, హైదరాబాద్), ప్రొఫెసర్ వినీత్ ఎన్‌బీ (ఐఐటీ, హైదరాబాద్), స్నేహలత(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ఉన్నారు. పాఠశాలల కేటగిరిలో.. విశాఖపట్నంలోని భీమునిపట్నంలో పండిట్ నెహ్రూ జీవీఎంసీ మునిసిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మాదాబత్తుల తిరుమల శ్రీదేవి, తెలంగాణ నుంచి సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మారం పవిత్ర ఉన్నారు.

### శిష్యుల ఉన్నతిలోనే ఉపాధ్యాయుల విజయం

- గవర్నర్, డిప్యూటీ సీఎం టీచర్స్ డే శుభాకాంక్షలు

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, దేశ నిర్మాణంలో వారి పాత్ర చాలా ముఖ్యమైనదని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఉపాధ్యాయ సోదర, సోదరీమణులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కాగా, శిష్యుల ఉన్నతిలోనే తమ విజయాన్ని చూసుకొని ఉపాధ్యాయులు సంతోషిస్తారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం టీచర్స్ డే సందర్భంగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఆచార్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పే గురువును దైవంతో సమానంగా పూజించే సంస్కృతి మనదన్నారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు విద్యా సంబంధిత అంశాలతో పాటు నైతిక విలువలు కూడా నేర్పించాలని టీచర్లను పవన్ కోరారు.


విజయవాడలో బీజేపీ నిర్వహించిన శోభాయాత్రలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, తదితరులు

## చర్చలతో సమస్యలకు పరిష్కారం

- అభివృద్ధా? అరాచక పాలనా? అన్నదానిపై ప్రజలు చర్చించాలి
- విజయవాడలో చాయ్ పే చర్చా కార్యక్రమంలో మాధవ్

కృష్ణలంక, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంచి ఆలోచనలు, చర్చల ద్వారా ఎటువంటి సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. గురువారం ఉదయం విజయవాడలో చాయ్ పే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'ప్రజలను నేరుగా కలసి వారి అభిప్రాయాలను, ఆలోచనలు, సూచనలు తెలుసుకోవడం ద్వారా ఆ ప్రాంతానికి, రాష్ట్రానికి ఇంకా మంచి చేసే అవకాశం ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంతం బాగా దెబ్బతింది. కూటమి ప్రభుత్వంలో అమరావతి రాజధాని అభివృద్ధి చెందుతుంది. కేంద్రం సహకారంతో వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. జీఎస్టీ తగ్గించి పేద, మధ్య తరగతి ప్రజలకు మోదీ ఉపశమనం కలిగించారు. గత ఏడాది ఈ రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అన్ని రకాల పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా ప్రజల ఆదాయ వనరులు పెరుగుతున్నాయి. మన ప్రాంతాల్లో తయారయ్యే ఉత్పత్తులను మనం కొనుగోలు చేయాలి. మళ్లీ దేశవ్యాప్తంగా స్వదేశీ ఉద్యమం ప్రారంభం కావాలి. అరాచక పాలన కావాలా? అభివృద్ధి పాలన కావాలా? అన్న అంశంపై చర్చ పెట్టాలి. ఎవరి హయాంలో ఈ దేశానికి, రాష్ట్రానికి మంచి జరిగిందో ప్రజలే ఆలోచించాలి, ఆత్మనిర్భర్ భారత్ కోసం అందరం కలిసి అడుగులు వేద్దాం' అని మాధవ్ పిలుపునిచ్చారు.

## ఏపీ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన యోగాంధ్ర వేడుకలపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఆయనకు అందజేశారు. సుమారు 45 నిమిషాలు సమావేశం జరిగింది. రాష్ట్రానికి చెందిన కొన్ని ముఖ్య విషయాలపై చర్చించారు. రాష్ట్రంలో ఇటీవలి పరిణామాలను లోకేశ్ ప్రధానికి వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత 15 నెలల్లో కేంద్రం మద్దతు, సహకారంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. 'మీ నేతృత్వంలో వికసిత్ భారత్-2047లో భాగస్వాములం అవుతాం' అని చెప్పారు. ప్రగతి దిశగా అడుగులు వేస్తున్న ఏపీలో పెట్టుబడుల ఆకర్షణకు, అభివృద్ధి కార్యక్రమాలకు మరింత తోడ్పాటు అందించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు 'అడ్వాన్స్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్' సెమీకండక్టర్ యూనిట్‌ను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. 'కేంద్ర నిర్ణయం రాష్ట్ర పారిశ్రామికవృద్ధికి కీలక మలుపు. అలాగే ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు కేంద్రం నిరంతర సహకారం అందించాలి. తద్వారా రాష్ట్రంలో భారీ స్థాయిలో ఉపాధి లభించి, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది' అని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. విద్యా మంత్రిగా చేపడుతున్న విద్యా సంస్కరణల గురించి కూడా వివరించారు. విద్యా ప్రమాణాలను పెంచడానికి, అభ్యాసన ఫలితాల నాణ్యతను మెరుగుపరచడానికి రాష్ట్రప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యలో ఆంధ్రప్రదేశ్ మెరుగైన ఫలితాలను సాధించడానికి సాయం చేయడంతో పాటు మద్దతు, మార్గదర్శకత్వం అందించాలని అభ్యర్థించారు. అనంతరం కేంద్రం తాజాగా చేపట్టిన జీఎస్టీ సంస్కరణలకు మద్దతు ప్రకటించి ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సంస్కరణలతో దేశంలోని కోట్లాది మంది నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందన్నారు. ఇవి రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు, చిన్న వ్యాపారాల వృద్ధికి మరింత తోడ్పడతాయని.. మధ్యతరగతి ప్రజల్లో మరింత పొదుపును ప్రోత్సహిస్తాయని ప్రధానికి లోకేశ్ తెలిపారు.

# కన్నతల్లి కడచూపూ కరువాయె!

- ముగ్గురు పిల్లల మృతదేహాలు చూసేందుకు రాని దీపిక
- అంత్యక్రియలు నిర్వహించిన మునిసిపాలిటీ సిబ్బంది

నాగర్‌కర్నూలు, త్రిపురాంతకం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కన్నతండ్రిది రాతిగుండె అని తేలిపోతే, తానూ నిర్దయురాలినేనని కన్నతల్లీ చాటుకుంది! భార్యపై కోపంతో ముగ్గురు బిడ్డల ప్రాణాలను భర్త బలిగొంటే.. భార్యేమో తన పిల్లలను కడసారి చూసేందుకూ రాలేదు. ప్రకాశంజిల్లా ఎర్రగొండపాలెం మండలం బోయలపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు, దీపిక దంపతులు. వీరికి మోక్షిత(8), వర్షిణి(6), శివధర్మ(4) సంతానం. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గతనెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకొని నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండకొచ్చాడు. అక్కడ పిల్లలతో పురుగుల మందు తాగించి.. వారి ఒంటిపై పెట్రోలు పోసి నిప్పంటించి చంపాడు. తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. వర్షిణి, శివధర్మ మృతదేహాలను శుక్రవారం అచ్చంపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పిల్లల బాబాయి మల్లికార్జున, తండ్రి తరపు బంధువులు వచ్చి మృతదేహాలను మునిసిపాలిటీ సిబ్బందికి అప్పగించారు. వారు శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు. మోక్షిత మృతదేహానికి కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని సొంతూరుకు తీసుకెళ్లలేమని బంధువులు చెప్పడంతో మున్సిపాల్టీ సిబ్బందే అంత్యక్రియలు పూర్తిచేశారు.


అచ్చంపేటలో చిన్నారులకు దహన సంస్కారాల అనంతరం నివాళులర్పిస్తున్న కానిస్టేబుల్

### తనలా కష్టాలు పడకూడదనే...

వెంకటేశ్వర్లు సున్నిత మనస్కుడని.. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాడని అతడి సొంతూర్లో స్థానికులు చెబుతున్నారు. వెంకటేశ్వర్లు తన బంధువైన దీపికను పెళ్లి చేసుకున్నాడని, భార్యతో గొడవల కారణంగానే తానూ చనిపోవాలని నిర్ణయించుకున్నాడని అంటున్నారు. అదే సమయంలో తనలా తన పిల్లలు తండ్రి లేక కష్టాలు పడకూడదనే.. వాళ్లను కూడా చంపేసినట్లు భావిస్తున్నారు.




# హాప్ హాప్... టిప్ టాప్!

- రూ.250తో కులాసాగా విహారం
- విశాఖలో 'డబుల్ డెక్కర్' టూర్
- పది పర్యాటక ఆకర్షణల వీక్షణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రామకృష్ణా బీచ్ నుంచి తొట్లకొండ వరకు! మొత్తం పది పర్యాటక ప్రాంతాలు! ఎక్కడైనా ఎక్కొచ్చు... ఎక్కడైనా దిగొచ్చు! 24 గంటల్లో ఎన్నిసార్లైనా ప్రయాణించవచ్చు! కూల్‌కూల్‌గా ఏసీ బస్సు! డబుల్ డెక్కర్‌లో పై వరుసలో కూర్చుని విశాఖ అందాలు వీక్షించవచ్చు! ఆయా ప్రాంతాల వివరాలు చెప్పేందుకు బస్సులోనే టూర్ గైడ్! విద్యుత్ వాహనంలో... చప్పుడు లేకుండా సుఖమైన ప్రయాణం! ఇన్ని సౌకర్యాలుంటే టికెట్ ఏ వెయ్యి రూపాయలో ఉంటుందనుకుంటున్నారా? కానే కాదు! కేవలం రూ. 250తో విశాఖ అందాలు చూసే 'హాప్ ఆన్.. హాప్ ఆఫ్' పర్యాటక బస్సు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం రెండు 'హాప్' బస్సులు తిరుగుతున్నాయి.

**ఏమేం చూడొచ్చు...:** 'హాప్ ఆన్.. హాప్ ఆఫ్' బస్సు ప్రయాణం రామకృష్ణా బీచ్‌లో మొదలవుతుంది. అక్కడి నుంచి... టీయూ-142 విమాన మ్యూజియం, కురుసుర సబ్‌మెరైన్, సీ హ్యారియర్, యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం, విశాఖ మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పార్క్, రోప్‌వే (కైలాసగిరి వెళ్లేవారికి), తెన్నేటి పార్క్, సాగర్‌నగర్ బీచ్, ఇస్కాన్ టెంపుల్, రుషికొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రుషికొండ బీచ్ మీదుగా తొట్లకొండ వరకు వెళుతుంది. మొత్తం 16 కిలోమీటర్లు... పది పర్యాటక ప్రాంతాలు!

### ఇదీ ప్రత్యేకత...

ఆయా పర్యాటక కేంద్రాల్లో నచ్చిన చోట దిగి.. తర్వాత... మళ్లీ వచ్చే 'హాప్ ఆన్ హాప్ ఆఫ్' బస్సు ఎక్కి.. మరో పర్యాటక ప్రాంతంలో దిగొచ్చు. ఇలా 24 గంటలపాటు ఎన్నిసార్లయినా.. ఎక్కడైనా ఎక్కి, దిగొచ్చు. ఒకసారి టికెట్ తీసుకుంటే చాలు. ఈ బస్సులు ఎక్కడున్నాయో తెలుసుకోవడానికి ప్రత్యేకంగా యాప్ తయారు చేస్తున్నారు. అది అందుబాటులోకి వచ్చే వరకు గైడ్ల మొబైల్ నంబర్లు ఇస్తున్నారు. వారికి ఫోన్ చేస్తే బస్సు ఎంతసేపట్లో వస్తుందో చెబుతారు. ఈ టికెట్లను బస్సులోనే తీసుకోవచ్చు. ఆయా పర్యాటక కేంద్రాల వద్ద టికెట్ కౌంటర్లను కూడా ఏర్పాటు చేశారు. పర్యాటకుల గుర్తింపు కార్డు చూసి టికెట్ ఇస్తారు.

### ఈవీ బస్సులో... కూల్‌గా!

గతనెల 29న సీఎం చంద్రబాబు విశాఖలో 'హాప్ ఆన్.. హాప్ ఆఫ్' బస్సులు ప్రారంభించారు. ఈ విద్యుత్ బస్సులు మూడు గంటలు చార్జింగ్ చేస్తే 170 కిలోమీటర్లు నడుస్తాయి. బస్సులో కింద, పైనా కలిపి 100 సీట్లు ఉన్నాయి. సెంట్రలైజ్డ్ ఏసీ ఉండే ఈ బస్సుల్లో గైడ్ ఉంటారు. ఆయా ప్రాంతాల విశేషాలను పర్యాటకులకు వివరిస్తారు. ఈ టూర్‌కు తొలుత రూ.500 టికెట్ నిర్ణయించగా... సీఎం సూచనల మేరకు దానిని రూ.250కి తగ్గించారు. పిల్లలకు రూ.వంద మాత్రమే!.




### త్వరలో ఓపెన్ టాప్ బస్సు



ప్రస్తుతం ఉన్న రెండు బస్సుల్లో ఒకటి విశాఖపట్నం పోర్టు, మరొకటి అశోక్ లేల్యాండ్ కంపెనీ సమకూర్చాయి. త్వరలో హెచ్‌పీసీఎల్ కంపెనీ మరొకటి ఇవ్వనుంది. అది ఓపెన్ టాప్ డబుల్ డెక్కర్ బస్సు. బస్సులు వారాంతాల్లో ఫుల్ ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. మిగిలిన రోజుల్లో పర్యాటకుల సంఖ్య తక్కువగా ఉంటోంది. వచ్చే నెల నుంచి పర్యాటక సీజన్ మొదలైతే.. డిమాండ్ పెరుగుతుంది.

- జె.మాధవి, విశాఖ జిల్లా పర్యాటక శాఖ అధికారిణి



## గుడ్ల ఉత్పత్తిలో ఏపీ ఫస్ట్

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 25 లక్షల కుటుంబాలకు ఉపాధితో పశుసంవర్ధక రంగం అభివృద్ధిలో గణనీయపాత్ర పోషిస్తోందని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టీ దామోదర్‌నాయుడు చెప్పారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 12.17 శాతం వాటాతో రూ. 1.61 లక్షల కోట్లు పశుగణ రంగం నుంచి లభిస్తోందన్నారు. శుక్రవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గుడ్ల ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉందని చెప్పారు. గొర్రెలు, కోళ్ల ఉత్పత్తిలో 2వ స్థానం, మాంస ఉత్పత్తిలో 4వ స్థానం, పాల ఉత్పత్తిలో 5వ స్థానం, గేదెల ఉత్పత్తిలో 6వ స్థానంలో రాష్ట్రం నిలిచిందన్నారు. పాల ఉత్పత్తులపై జీఎస్టీ జీరో కావడం వల్ల పౌల్ట్రీ రంగం ఊపందుకుంటుందని అన్నారు. పశు సంవర్ధక రంగంలో 15 శాతం వృద్ధి రేటు సాధించే లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం పెట్టుకుంటుందని పేర్కొన్నారు. దానిలో భాగంగా 50 శాతం రాయితీపై పశుదాణా, 75 శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు, 85 శాతం రాయితీతో పశు బీమా, 70-90 శాతం రాయితీపై గోకులాల నిర్మాణం, 100 శాతం రాయితీతో బహువార్షిక పశుగ్రాసాల సాగు చేపడుతున్నట్లు చెప్పారు. పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు సోమిరెడ్డి, ఉపాధ్యక్షుడు కుటుంబరావు తదితరులు మీడియా భేటీలో పాల్గొన్నారు.



## రేపు సంపూర్ణ చంద్రగ్రహణం

- రాత్రి 8:58కి ప్రారంభమై అర్ధరాత్రి 2:25 గంటల వరకు
- 2022 తర్వాత ఎక్కువ సమయం కనిపించే అవకాశం

బెంగళూరు, సెప్టెంబరు 5: ఈనెల 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుంది. 2022 తర్వాత భారత్ నుంచి అత్యంత ఎక్కువ సేపు కనిపించే సంపూర్ణ చంద్రగ్రహణంగా ఇది నిలవనుందని ఖగోళ శాస్త్రవేత్తలు తెలిపారు. అలాగే 2018 జూలై 27 తర్వాత భారత్‌లోని అన్ని ప్రాంతాల నుంచి సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని వీక్షించడం ఇదే మొదటిసారి కానుందని పుణెలోని నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రోఫిజిక్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న దివ్యా ఒబెరాయ్ చెప్పారు. మళ్లీ ఇలాంటిది చూడాలంటే 2028 డిసెంబరు 31 వరకూ వేచి చూడాలన్నారు. ఈ నెల 7,8 తేదీల (ఆది, సోమవారం) మధ్య ఈ సంపూర్ణ చంద్రగ్రహణం సంభవిస్తుందని వెల్లడించారు. ఆదివారంరాత్రి 8:58గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమవుతుంది. 8వ తేదీ తెల్లవారుజామున 2:25 గంటలకు చంద్ర గ్రహణం ముగుస్తుంది.



## జర్మనీలో ఉపాధి అవకాశాలు

- డెక్రా గ్రూప్‌తో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం డెక్రా గ్రూప్‌తో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 25 సంవత్సరాలకు పైగా అనుభవంతో ప్రపంచవ్యాప్తంగా 3వేల కంపెనీలకు సేవలందిస్తున్న డెక్రా ఆర్బిట్ భాగస్వామ్య సంస్థ ద్వారా వివిధ రంగాలకు చెందిన నిపుణులను జర్మనీకి పంపించడానికి శిక్షణ, రిక్రూట్‌మెంట్ కార్యక్రమాలను చేపడతామని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో గణేశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్, డెక్రా ఎక్స్‌పర్ట్ గ్రూప్ ఎండీ య్వోన్ బొలాచ్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వం.. అనాది విధానమే!

- శ్రీకృష్ణుడు ఉత్తమ మధ్యవర్తి: ముఖ్యమంత్రి
- విశాఖలో అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం సుముఖం
- త్వరితగతిన వివాదాల పరిష్కారంతోనే ఆర్థికాభివృద్ధి
- ఆదిలోనే వాటిని పరిష్కరించే వ్యవస్థ రావాలి
- వర్చువల్ విచారణ, మొబైల్ అప్‌డేట్స్, ఈ-ఫైలింగ్ విస్తృతంగా వాడాలి
- అంతర్జాతీయ సదస్సులో చంద్రబాబు సూచన
- మధ్యవర్తిత్వంతో కోర్టులు, ప్రజల మధ్య తగ్గుతున్న అంతరం: జస్టిస్ సూర్యకాంత్
- సామరస్య సంస్కృతి పెరుగుతుంది: జస్టిస్ నరసింహ
- వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాంగం: జస్టిస్ ఠాకూర్




అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేదికపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఉన్నారు

విశాఖపట్నం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం సుముఖంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చేయడం అనాదిగా వస్తున్న విధానమేనన్నారు. శ్రీకృష్ణ భగవానుడు ఉత్తమ మధ్యవర్తిగా పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడి రాడిసన్ బ్లూ హోటల్‌లో 'ఏషియన్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్(ఏసీఐఏఎం)' నిర్వహించిన అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఇందులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను త్వరగా పరిష్కరించినప్పుడే భారత ఆర్థిక వ్యవస్థ మరింత పుంజుకుంటుందని సీఎం తెలిపారు. వివాదాలను త్వరగా పరిష్కరించడానికి టెక్నాలజీతో పాటు ప్రత్యేక యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో పెద్దలే మధ్యవర్తులుగా ఉంటూ వివాదాలు పరిష్కరించేవారని, తన తండ్రి కూడా ఇలాగే గ్రామ పెద్దగా వివాదాలు పరిష్కరించేవారని తెలిపారు. విశాఖలో ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కార కేంద్రాన్ని (ఏడీఆర్) అభివృద్ధి చేయాల్సిన ఉందన్నారు. 'ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ బలమైన మూలస్తంభం. రాజ్యాంగపరమైన హక్కుల పరిరక్షణలో కీలకంగా వ్యవహరిస్తోంది. కొన్ని సమయాల్లో కాసింత ఆలస్యమైనా న్యాయం జరుగుతుందనే విశ్వాసం ప్రజల్లో ఉంది. ఇప్పటికీ చాలామంది వివాదం పరిష్కారానికి కోర్టుకు వెళ్లాలంటే అవమానంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం లభిస్తుంది. సులభతర న్యాయం (ఈజ్ ఆఫ్ జస్టిస్)లో వర్చువల్ విచారణ, ఈ-ఫైలింగ్, మొబైల్ అప్‌డేట్స్ వంటివి విస్తృతంగా ఉపయోగించాలి' అని సూచించారు.

> ఏడాది కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. పెద్ద పెద్ద సంస్థలు వస్తున్న నేపథ్యంలో వివాదాల పరిష్కారానికి ఆర్బిట్రేషన్ వంటి ప్రత్యామ్నాయ న్యాయవ్యవస్థలు అందుబాటులోకి రావలసి ఉంది. పెరుగుతున్న వివాదాలు, కేసుల పరిష్కారానికి కొత్త కోర్టులు కూడా రావాలి.
>
> - ముఖ్యమంత్రి చంద్రబాబు

### వారధిలా ఏసీఐఏఎం: జస్టిస్ సూర్యకాంత్

ఏసీఐఏఎం వంటి సంస్థలు ప్రొఫెషనల్‌గా న్యాయం అందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయని జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. ఇలాంటి సంస్థాగతమైన మధ్యవర్తిత్వంతో సకాలంలో పరిష్కారం చూపడం వల్ల కోర్టులకు, ప్రజలకు మధ్య అంతరం తగ్గుతోందని, ఇవి వారధిలా పనిచేస్తున్నాయని అన్నారు. ఏపీలో మధ్యవర్తిత్వం అత్యవసరంగా అభివృద్ధి చేయాల్సి ఉందని జస్టిస్ పీఎస్ నరసింహ చెప్పారు. బలమైన సంస్థాగత చట్టాలు కోర్టులపై ఒత్తిళ్లను తగ్గిస్తాయని, సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకునే సంస్కృతి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

### రాష్ట్రానికి మరో 800 న్యాయాధికారులు అవసరం: సీజే

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు 650 మంది న్యాయాధికారులు ఉన్నారని.. కేసులు త్వరితంగా పరిష్కరించాలంటే మరో 800 మంది అవసరమని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ తెలిపారు. 'పెద్దసంఖ్యలో కేసులు దాఖలవుతున్న నేపథ్యంలో ఇప్పుడు మధ్యవర్తిత్వ ప్రక్రియ చాలా అవసరం. మీడియేటర్లకు శిక్షణ, నైపుణ్యం కూడా అవసరం. ఆర్బిట్రేషన్ రంగంలోకి విశ్రాంత న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు వస్తున్నారు. వీరిలో నిజాయితీ కొరవడినవారూ ఉన్నారు. ఈ వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేకమైన యంత్రాంగం ఉండాలి' అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహక సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సూర్య రాజు, భోపాల్ ఎన్‌ఎల్‌ఐయూ వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్య ఘర్‌కు మాస్క్ మస్కా!

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలకు ఫోన్‌లూ వెళ్తున్నాయి. కేంద్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'పీఎం-సూర్యఘర్' ప్రాజెక్టులో జరుగుతున్న తంతు ఇది!

### అసలేమిటీ పథకం...

ఇంటి పైకప్పు మీద సోలార్ ప్యానెళ్లు బిగించుకుని... 1 కేడబ్ల్యూ నుంచి 3 కేడబ్ల్యూ వరకు విద్యుత్ ఉత్పత్తి చేసేలా రూపొందించిన పథకమే.. 'పీఎం సూర్యఘర్'! 2026-27 నాటికి దేశవ్యాప్తంగా కనీసం కోటి ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు బిగించాలన్నది కేంద్రం లక్ష్యం. ఏపీలో ఒక్కో నియోజకవర్గంలో సగటున 10వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి... మొత్తంగా 17.5 లక్షల ఇళ్లపైన సోలార్ ప్యానెళ్లు బిగించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో ఒక్కో యూనిట్ ధర (3కేడబ్ల్యూ పవర్) కనీసం 2 లక్షల రూపాయలు! ఇందులో ప్రభుత్వం గరిష్ఠంగా 78వేల రూపాయల సబ్సిడీ ఇస్తుంది. రాష్ట్రస్థాయిలో ఈ ప్రాజెక్టును డిస్కమ్‌లు అమలు చేస్తున్నాయి. ఏపీలో ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.8వేల కోట్లపైనే. ఈ ప్రాజెక్టులో సోలార్ ప్యానల్స్ ఎంపిక, ఇన్‌స్టలేషన్, ఇతర కీలక పనులు చేయడానికి ఏజెన్సీలను టెండర్ల ద్వారా ఎంపిక చేస్తారు. ఈ ప్రాజెక్టు గురించి గ్రామీణ, పట్టణ ప్రజలకు అవగాహన కల్పించడానికి, ప్రాజెక్టులో భాగస్వాములయ్యేందుకు ముందుకొచ్చేవారికి శిక్షణ ఇవ్వడానికి కూడా కేంద్ర నిధులు ఇస్తోంది. ప్రచారం, అవగాహన కల్పించే కంపెనీలను కూడా వాటి అర్హత, అనుభవం, నేపథ్యం ఆధారంగా ఎంపిక చేయాలి. ఈ మేరకు కేంద్రం పక్కా నియమ నిబంధనలు రూపొందించింది.

### గోల్‌మాల్ జరిగిందిలా...

ఓ ముఖ్య అధికారి, నెడ్‌క్యాప్‌లోని మరో కీలక అధికారి కలిసి 'సూర్యఘర్'పై కన్నేశారు. ప్రాజెక్టుపై అవగాహన, ప్రచారం, ఇన్‌స్టలేషన్ సర్వీసులు వంటి కీలక అంశాలు తమ కనుసన్నల్లో జరిగేలా ప్లాన్‌వేశారు. తొలుత ప్రచారం, అవగాహన కల్పించే పేరిట ప్రాజెక్టులోకి ప్రవేశించినా.. తర్వాత సోలార్ రూఫ్‌టాప్‌ల ఇన్‌స్టలేషన్, ఇతర కీలక విభాగాలు కూడా తమ నియంత్రణ లోనే ఉండాలన్నది వారి మాస్టర్ ప్లాన్. దీనికి ప్రకాశం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేను జతగా కలుపుకొన్నారు. ఆయనకు అత్యంత సన్నిహితుడికి చెందిన కంపెనీని సోలార్ ప్రాజెక్టులోకి తీసుకొచ్చారు. ఈమేరకు నెడ్‌క్యాప్ ఎండీతో ఓ ఉత్తర్వు ఇప్పించారు. నిజానికి పీఎం-సూర్యఘర్ ప్రాజెక్టుపై స్వయం సహాయక సంఘాలు ప్రచారం చేస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో లబ్ధిదారులుగా చేరాలని ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాయి. అయితే... ఓ కంపెనీ పేరు సూచిస్తూ దానికి సహకరించేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఏపీ నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఈడీసీ ఏపీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్ బాబు గత 28న మెప్మా మిషన్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. "పీఎం-సూర్యఘర్ ప్రాజెక్టు అవగాహన, ఇన్‌స్టలేషన్ సర్వీసెస్ కార్యక్రమాల్లో పాల్గొంటామని ఆ కంపెనీ మాకు ప్రతిపాదన ఇచ్చింది. కాబట్టి, స్వయం సహాయక సంఘాలు అవసరం ఉన్న చోట వారి చర్యలకు సహకరించగలరు" అని ఆ లేఖలో పేర్కొన్నారు. నెడ్‌క్యాప్ ఎండీ రాసిన లేఖపై మెప్మా మిషన్ డైరెక్టర్ తేజభరత్ వెంటనే స్పందించారు. పీఎం సూర్యఘర్ అమలులో భాగంగా నెడ్‌క్యాప్ ఎండీ ఇచ్చిన లేఖను కోట్ చేస్తూ, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లకు ఆగస్టు 30న లేఖరాశారు. అయితే, ఈ లేఖలో ఆయన ఓ వ్యూహాన్ని పాటించారు. ఎక్కడా కంపెనీ పేరు ప్రస్తావించకుండా, నెడ్‌క్యాప్ ఎండీ రాసిన లేఖలోని అంశాలను మాత్రమే పేర్కొన్నారు. మెప్మాకే చెందిన ఓ అధికారి జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లకు ఫోన్‌లు చేసి ఆ కంపెనీతో కలిసి పనిచేయాలని ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. నేరుగా ఎమ్మెల్యేల వద్దకు ఆ కంపెనీ ప్రతినిధిని తీసుకెళ్లి పరిచయం చేయాలని మెప్మా ఉన్నతాధికారి హుకుం జారీ చేశారు. దీని వెనుక ఒక కీలక అధికారి పాత్ర ఉన్నట్లు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంలో ఆయనే కర్త, కర్మ, క్రియగా ఉన్నారు. కంపెనీని తెరపైకి తేవడం, నెడ్‌క్యాప్‌తో ఆ కంపెనీకి వర్క్ ఇప్పించడం, తర్వాత ఎమ్మెల్యేల వద్దకు కంపెనీ ప్రతినిధి వెళ్లి బేరాలు.. ఇదంతా ఆ అధికారి వ్యూహంలో భాగమేనని తెలిసింది.



### మాస్కుల కంపెనీకి సోలార్ పనులా?

నెడ్‌క్యాప్ సిఫారసు చేసిన కంపెనీ విజయవాడ కేంద్రంగానే ఏర్పాటైంది. ఆ కంపెనీ మాస్కులు తయారు చేస్తుంది. ఇంకా ఫెయిర్స్, షోలు నిర్వహిస్తుంది. బల్క్ రిటైల్ లాటరీ టికెట్ల విక్రయం, క్యాసినో, బెట్టింగ్ వంటి వ్యవహారాల్లో వేలుపెట్టినట్లు కంపెనీ ప్రొఫైల్‌ను చూస్తే స్పష్టమవుతోంది. ఈ కంపెనీకి సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలో కనీస అనుభవం లేదు. ఉత్పత్తి, అమ్మకాలతో పరిచయం లేదు. ఎలాంటి అనుభవం లేని ఈ కంపెనీ... సోలార్ పవర్ గురించి ప్రజలకు, ప్రత్యేకించి స్వయం సహాయక సంఘాలకు ఎలాంటి అవగాహన కల్పించగలదు? ప్రజల్లో ఎలాంటి చైతన్యం తీసుకురాగలదు?.

### నిలదీసిన ఎమ్మెల్యే..

ఇటీవల మెప్మాకే చెందిన ఓ ప్రభుత్వ వాహనంలో ఆ ప్రైవేటు కంపెనీ ప్రతినిధి అనంతపురానికి వెళ్లారు. జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యేతో మెప్మా అధికారులు మీటింగ్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలో 10వేల రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్‌ల ఇన్‌స్టలేషన్‌కు సహకరించాలని ఆ కంపెనీ ప్రతినిధి కోరినట్లు తెలిసింది. "మీరు ఎవరు? ఈ కాంట్రాక్టు ఎవరిచ్చారు? ఈ వర్క్ మీకే ఇచ్చినట్లుగా ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఆదేశాలు ఇచ్చిందా?" అని ఆ ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీంతో ఆ ప్రతినిధి నేరుగా మెప్మాలోని ఓ ఉన్నతాధికారికి ఫోన్ కలిపి... ఎమ్మెల్యేతో మాట్లాడించారు. "కీలక అధికారి, ఓ కీలక మంత్రి, మరి కొందరు ప్రభుత్వ పెద్దలు ఆయనతో ఉన్నారు. ఆయనకు సహకరించండి. మీ పనికూడా అవుతుంది" అని మెప్మా ఉన్నతాధికారి ఏదో భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. దీంతో ఆ ఎమ్మెల్యేకు చిర్రెత్తుకొచ్చింది. కంపెనీ ప్రతినిధిని వెనక్కి పంపించేసి... ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయం రచ్చకెక్కడంతో... కంపెనీ ప్రతినిధి వచ్చిన వాహనంపై ఉన్న 'ప్రభుత్వ వాహనం' స్టిక్కర్‌పై తెల్లటి టేప్ అతికించేశారు.

### ఇదేనా విధానం?

'పీఎం-సూర్యఘర్'ను కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలో స్వయంగా ముఖ్యమంత్రి దీని అమలును పర్యవేక్షిస్తున్నారు. ఇంతటి కీలకమైన ప్రాజెక్టులో ఎవరిని పడితే వారిని ప్రచారకర్తలుగా, ఇన్‌స్టలేషన్ సర్వీసు ప్రొవైడర్‌లుగా ఎంపిక చేస్తారా? ఏజెన్సీల ఎంపికకు ఎలాంటి నిబంధనలు, విధానాలు లేవా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నెడ్‌క్యాప్ ఎండీ మెప్మాకు రాసిన లేఖలోని అంశాలు విస్తుగొలుపుతున్నాయి. ప్రచారం, ఇన్‌స్టలేషన్ సర్వీసు చేస్తానని ఒక కంపెనీ ముందుకు రాగానే... 'ఓకే' చెప్పేశారట! ఆ కంపెనీని ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు? ఏ టెండర్ ద్వారా ఎంపిక చేశారు? విధి విధానాలేమిటి? ఇవేవీ ఆ లేఖలో లేవు. ఆ కంపెనీకి ఉన్న అర్హతలు, ప్రమాణాలు ఏమిటో చూడరా? ఎవరు దరఖాస్తు చేసుకున్నా పని అప్పగిస్తారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.




మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, వర్సిటీ వీసీ డి.సూర్యప్రకాశరావు

# సవాళ్లతో కూడుకున్న న్యాయవాద వృత్తి

- లాయర్లకు నిజాయితీ, స్వీయ అవగాహన అవసరం
- సమాజంలో మార్పు కోసం యత్నించాలి: జస్టిస్ సూర్యకాంత్
- ఘనంగా న్యాయ వర్సిటీ సంయుక్త స్నాతకోత్సవం

విశాఖపట్నం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తి అత్యంత సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (8, 9, 10, 11, 12వ బ్యాచ్‌లు) సంయుక్త స్నాతకోత్సవాన్ని శుక్రవారం విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ సూర్యకాంత్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు నిజాయితీ, స్వీయ అవగాహన కలిగి, మార్పును స్వీకరించేందుకు నిరంతరం సిద్ధంగా ఉండాలని సూచించారు. యువ న్యాయవాదులు సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని కోరారు. అధిక సంఖ్యలో మహిళలు న్యాయవాద పట్టాలు తీసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విశిష్ట అతిథి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి మాట్లాడుతూ న్యాయవాద వృత్తి కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, సమాజాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. మాజీ చాన్సలర్‌గా వర్సిటీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. మరో అతిథి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువ న్యాయవాదులు భాగస్వాములు కావాలని వ్యక్తిత్వం, నైతికతతో కూడిన జీవితాన్ని నిర్మించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, వర్సిటీ చాన్సలర్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, పలువురు సీనియర్ న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'బంగారు' తల్లి రష్మి!



జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో భాగంగా ఆయా బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు పట్టాలను అందించడంతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 154 మందికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. గోల్డ్ మెడల్ సాధించిన వారిలో కోల్‌కతాకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలు రష్మి మరువాడ ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రెయిలీ లిపి ద్వారా ప్రతిష్ఠాత్మక వర్సిటీలో బీఏ ఎల్ఎల్‌బీ పూర్తిచేసినందుకు ఆనందంగా ఉందన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్‌లో ఎల్ఎల్ఎం కూడా పూర్తయిందని, ప్రస్తుతం అక్కడే ఎంఎస్‌డబ్ల్యూ చేస్తున్నానని చెప్పారు. క్రిమినాలజీ అండ్ డ్రగ్ కంట్రోల్ లా సబ్జెక్ట్‌లో టాపర్‌గా నిలిచినందుకు బంగారు పతకం వచ్చిందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.